



గురువులు


సాయి బాబా

నాకు తెలిసిన సాయి








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **తెలుగు భక్తి** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తెలుగు భక్తి వారి వెబ్ సైట్: http://www.telugubhakti.com/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt


ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

తెలుగు భక్తి వారి వెబ్ సైట్:

http://www.telugubhakti.com/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

నాకు తెలిసిన సాయి

– కోటంరాజు శ్రీనివాసరావు



ముందుగా నిత్యసత్య స్వరూపుడైన శ్రీ శిరిడీ సాయినాథుని పాద పద్మములకు సర్వస్య శరణాగతితో వేడుకుని వారి పాద పద్మములకు సాష్టాంగ నమస్కారములు సమర్పించుకుని ప్రారంభించుచున్నాను. సాయిబాబా అనగానే అందరికి తెలిసినది ఏమనగా వారు శిరిడిలో వుండే వారని వేపచెట్టు నీడయందు కూర్చుండేవారని చిలుము త్రాగుతూ తలకుగుడ్డ కట్టుకుని, ఒక చేతిలో సటాక పట్టుకుని జోలెను తగిలించుకుని చెప్పులు లేకుండా తిరిగే వారని, ధుని ముందు కూర్చుని అందు బూడిదెను ఊదీగా తన వద్దకు వచ్చిన భక్తులకిచ్చేడివారని ఇలా సాయి యొక్క రూపురేఖలను మరియు వారి చేష్టలనుబట్టి సాయిబాబా గురించి తెలుసుకుని ఇతరులకు చెప్పుచుండెడివారు.

"ఓం శ్రీ శిరిడీ స్వరాయ నిత్య సత్య స్వరూపాయ" అంటే ఓ సాయీ నిత్యసత్యమైనటు వంటి స్వరూపము కలవాడివనే అర్థం. అయితే సాయి అంటే పైన చెప్పిన రూపురేఖలను బట్టి మరియు వారి చేష్టలను బట్టి ఆలోచిస్తే ఆ పరమాత్మ సాయి 1918 వ సంవత్సరము అక్టోబరు 15 వతేదీన సమాధి చెందినారని, శ్రీ సాయి సమాధి చెందక పూర్వము సాకార రూపులై శిరిడీ అను గ్రామములో నివసించేవారు. వారి రూపురేఖలు మరియు చేష్టలు పైన తెలిపిన విధముగానే కలవు. కాని వారి సమాధి పిదప సాకార రూపము లేదు. మరి శ్రీ సాయిని **"నిత్యసత్య స్వరూపాయ"** అని ఎలా అంటున్నాము ? దీనిని బట్టి సాయి నిరాకారుడా? అనేప్రశ్నవస్తుంది.

శ్రీ సాయి సచ్చరిత్రలో 51 అధ్యాయములు కలవు.ప్రతి అధ్యాయములో దాదాపుగా అన్నిటిలోనూ శ్రీ సాయి సాకార రూపమున ఎన్నోలీలలను ప్రదర్శించుటయే కాక నిరాకార రూపమున కూడా మహత్యమును చూపే సంఘటనలు కలవు. సాయి సచ్చరిత్రను చదివిన పిదప ఆ సాయినాథుని అనుగ్రహముచే శ్రీ సాయి సాకార మరియు నిరాకార రూపములలో వారు చేసిన లీలలు కాని మరియు మహత్యములు గాని కాకుండా నాకు సాయి అంటే మరియొక విధముగా ఒక

క్రొత్తదనము గోచరించినది. శ్రీ సాయి ఆశీస్సులచే **నాకు తెలిసిన సాయి** ని మీ అందరి ముందుంచుతున్నాను.

శ్రీ సాయి స్వయముగా ఇట్లనినారు. ఎవరైతే బాబా శిరిడీలో మాత్రమే ఉన్నాడని అనుకుందురో వారు బాబాను గ్రహింపలేరని తెలుసుకో. సాయి చెప్పిన విషయములో ఎవరైతే బాబా శిరిడీలో మాత్రమే ఉన్నాడని అనుకొందురో అట్టివారు శ్రీ సాయిని సాకార రూపమున కొలిచే భక్తులు మాత్రమే కాని శ్రీ సాయి చెప్పిన విషయము బాబా నిరాకారుడని వారు సర్వాంతర్యామియని. అయితే శ్రీ సాయని క్రొత్త విధముగా తెలుసుకునే ప్రయత్నంలో ఋజువైనది ఏమిటంటే శ్రీ సాయి తన దేహము మాయమ్మై పోయినను, అందుడిన బాబా ఈ రోజుకి కూడా అనంత శక్తి వలె నిలిచి సమాధి చెందిన పిదప కూడా అదే సాయి అందరికీ నిశ్శబ్దముగా సహాయపడుచున్నారు. శ్రీ సాయి పరిమితులకు అతీతమైనటు వంటివారు. సాయి భక్తులకు ఎరుకలో నిలిచినది మాత్రము వారి అనంత తత్వమే. కావున శ్రీ సాయి తత్వాన్ని పరిశీలించిన చాలు. అసలు శ్రీ సాయి రూపురేఖలు లేనటువంటి వారని, సాకార నిరాకార అనే ద్వైతము లేకుండా సాయి తత్వములో అసలు శ్రీ సాయి అంటే ఎవరో తెలుసుకొనవచ్చును. అటువంటి తత్వము నుండి బయటపడ్డ సాయిని తెలుసుకొనినాను కావుననే నాకు తెలిసిన సాయి ఎవరో తెలుపుచున్నాను.

శ్రీ సాయి శాశ్వతమైన అనంతశక్తి అన్ని పరిమితులకు అతీతులని సర్వాంతర్యామి అగుటచే అంతర్యామి అని వారు ప్రతిజీవి ఆత్మయొక్క అంతర్యామికూడా. ప్రతిజీవి అంతరంగమందు వచ్చే ఆలోచనలను తెలుసుకుని వారి కోరికలను తీర్చుచూ వారి ఇచ్ఛానుసారమగా సర్వమును ఎటువంటి దీర్ఘాలోచనలు చేయకుండానే నిత్య శాంతమూర్తిగా ఉంటూ సర్వమును నడిపించే సూత్రధారియే శ్రీ సాయి. కావున శ్రీ సాయి శిరిడీలోనే సాకారరూపమున 1918 వ సంవత్సము వరకే ఉన్నారని, తరువాత లేరని అనుకొనుట భ్రమయే. ఐతే వారు నిరాకారముగా తిరుగుచున్నారని అర్థమా ? మరి ఋజువేమిటి ? వారు ప్రతిజీవియందు అంతర్యామిగా వారి ఆత్మయొక్క అంతర్యామిగా ఉన్నారని ప్రతివారికి ఆ ఎరుక ఉండుటచే ఆ ఎరుకలో నిలిచినది శ్రీ సాయి అనంతతత్వమే. కావున ప్రతిజీవికూడా శ్రీ సాయియే. సాయిలేని చోటు దొరుకుట కష్టము. జగమంతా నిండియున్న అనంత శక్తి ఆ సాయి.

నిజానికి పరమాత్మ శ్రీ సాయి నిరాకారుడే. తన భక్తుల కొరకు సాకార రూపము దాల్చవలసి వచ్చింది. అయితే పరమాత్మ నిరాకారుడంటే సరిపోదు. ఆ నిరాకారము కూడా ఋజువు కావలసి వస్తుంది. అయితే పరమాత్మ అయిన శ్రీ సాయిని గురించి చాలామందికి వారు చేసిన లీలలను మరియు మహత్యములను మాత్రమే తెలిసికొనుట చేత వారి సాకార రూపము ఎక్కువభాగము భక్తుల్లో నిలిచి పోయినది. కాని దీర్ఘముగా ఆలోచించగా సాయి బోధనలను వాటి అంతరార్థమును క్షుణ్ణముగా పరిశీలించిన యెడల మన ఎరుకలో నిలిచినది మాత్రము శ్రీ సాయి అనంత తత్వమే. సాయి తత్వములో అసలు సాయి అంటే ఎవరు ? తెలుసుకొనవచ్చును. అయితే శ్రీ సాయి అసలు తత్వాన్ని గురించి ఎప్పుడు మాట్లాడలేదని కొందరు వాదించెదరు. శ్రీ సాయి ఎప్పుడు ఏ క్షణములో వారి నోటి వెంబడి అమూల్యమైన తత్వము వెలువడునో ఎవరకు తెలియదు. ఒక్కసారిగా వారు తత్వాన్ని తమ వాక్కు ద్వారా పలికేవారు. ఉదాహరణకు పైన చెప్పబడిన విషయము ఎవరైతే బాబా శిరిడీలో మాత్రమే ఉన్నాడని అనుకొందురో వారు నిజముగా బాబానుగ్రహింపలేరు. దీనిని బట్టి వారు అనంతశక్తి అని ఆ శక్తి నిశ్శబ్దముగా ఇప్పటికీ నిలిచి సహాయ పడుతున్నారని ప్రతిజీవియొక్క వారి ఆత్మయొక్క అంతర్యామిగా ఉన్నారు. వారు ఆత్మ తత్వాన్ని ఈ విధంగా బోధించినారు. శ్రీ సాయి నిత్య శాంతమూర్తిగా ప్రతివారి అంతరంగమందలి ఆత్మగా ఉండుటచే ఎవరికైనా ఏ విషయములోనైనా ఒక వ్యక్తి మరొకవ్యక్తిని తిట్టినప్పుడు తిట్టబడిన వ్యక్తి ఆ క్షణమందు కోపగించుకొనక తన ఆత్మయొక్క అంతర్యామి శ్రీ సాయి నిత్యశాంతమూర్తి అని ఎరుకలో ఉన్నచో ఆ తిట్టబడ్డ వ్యక్తి కూడా శాంతమూర్తియై ఉండగలడు. సాయి ఆత్మతత్వము నుండి ఆ అసలు సాయి అంటే ఎవరో తెలుసుకున్నాము. నాకు తెలిసిన సాయి సర్వాంతర్యామి, అంతర్యామి. మరియు ప్రతిజీవియొక్క ఆత్మయొక్క అంతర్యామి. శ్రీ సాయి నిత్యశాంతమూర్తి. ఆ సాయియే నిత్య సత్యస్వరూపుడు. శ్రీ సాయి సచ్చరిత్ర ఉపోద్ఘాతమునుండి నాకు తెలిసిన సాయి ఇదే.

శ్రీ సాయినాథార్పణమస్తు.

అధ్యాయము -1

భగవద్గీతయందు శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునునికి అనేక యోగములతో పాటు జ్ఞానయోగము కూడా బోధించెను.పైగా శ్రీ కృష్ణపరమాత్మ అందరికీ బోధించినది ఏమనగా జ్ఞానివి కావాలని.

శిరిడీలో శ్రీ సాయిబాబా తరచుగా గోధుమలు విసురుచుండెడివారు. అది చూచుటకు చిత్రముగా ఉండుటయేకాక భిక్షాటనచే జీవించే ఆ ఫకీరు సాయిబాబాకు గోధుమపిండితో పనియేమని ఎందరికో సందేహము కలిగెను. కాని శ్రీ సాయి ఆ శ్రీకృష్ణుని వలె మనలను జ్ఞానిగా మారమని చూపుటకై చేసిన చిత్రమైన దృశ్యమది. ఎందరో భక్తులు శిరిడీకి తమ పూర్వజన్మ పాపములతో మరియు ప్రస్తుతజన్మములో చేసిన పాపములతో కలుపుకొని శిరిడీకి చేరేవారు. శ్రీసాయి భక్తులయొక్క పాపాలను అట్టి పాపఫలమైన మనోవిచారములను శ్రీ సాయి విసిరేవారు. కావున వారు అనునిత్యము విసిరేవి గోధుమలు కావు. భక్తులపాపములు మరియు వారి యొక్క విచారములే. శ్రీ సాయి అట్టి భక్తుల పాపములను కర్మ అనేక్రింద రాయితో మరియు భక్తి అనే పైరాయి సహాయముతో ముఖ్యమైనది పిడి అదే జ్ఞానము. అట్టి పిడిని చేతితో పట్టుకుని విసరవలెనని సాయి మనందరికీ సూచించెను. చూచుటకు సాయిబాబా గోధుమలు విసిరేవాని వలె కనిపించినను అందులోనున్న అంతరార్థమైన తత్వము అదే. కావున శ్రీ సాయి చూపిన తన అనంత తత్వములో ఒకటైన జ్ఞానతత్వము గురించి శ్రీ సాయి సచ్చరిత్రలో మొదటి అధ్యాయము నుండి తెలుసుకున్నాము. సాకారముగా సాయి గోధుమలు విసురుతున్నట్లు కనిపించినప్పటికీ వారి నిరాకార రూపము జ్ఞానతత్వము ద్వారా గోచరించినది. **ఈ తత్వముద్వారా అసలు సాయి బైటపడటం గ్రహించినాము.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -2

ఈ అధ్యాయమున సాయిబాబా చెప్పినదేమనగా ఎవరైతే వారి అహంకారమును పూర్తిగా విడిచిపెట్టి సాయిపాదాలపై అర్పించిన యెడల సాయి వారితో ఉండుట సత్యమని కాని అట్టి అహంకారము మచ్చుకైనను కూడదని బాబా సూచించెను. సాయి బోధనలలో తెలిసినదేమనగా 1918 పిదప శ్రీ సాయి సాకార రూపము లేక పోయినప్పటికి వారి నిరాకార రూపము సాయి బోధనల ద్వారా మరియు సాయి తత్వము ద్వారా ఋజువైనది. సాయి చెప్పినది అహంకారమును విడువవలెనని. అట్టి అహంకారమును సాయిపాదాలపై పెట్టిన వారికి బాబా సహాయపడెదరని మరియు వారి

గృహకృత్యములందు తోడ్పడెదరని మాటయిచ్చెను. ఏ కార్యమైనను చేయబోయే ముందు ఒక్కసారి మన అహంకారమును సాయిపాదములపై పెట్టుచున్నానని అనుకొనిన యెడల నిరాకార సాయి మన వెనువెంటనే ఉండి ఆ కార్యమును సఫలీకృతము చేయుటయే కాక నిత్యము మన గృహకృత్యములయందు ఉండుట తథ్యము. కావుననే శ్రీ అన్నాసాహెబ్ ధాబోళ్కర్ శ్రీసాయి సచ్చరిత్రము వంటి మహాగ్రంథమును తమ అహంకారమును సాయి పాదములపై ఉంచుటచే వారు నిమిత్తమాత్రముగ ఉండి మిగిలినవన్నీ శ్రీసాయి వారే వ్రాసుకొనినారు. ఈ సంఘటన ప్రతి రచయితకు వర్తిస్తుంది. అన్నా సాహెబ్ దాభోళ్కర్ సాయి జీవిత చరిత్ర వ్రాయుటకు శ్యామాద్వారా సాయిని కోరినప్పుడు శ్రీ సాయి **"వాడు తన అహంకారము విడిచి నా పాదములపై పెట్టవలెను"** అని అనుటయేకాక "ఎవరైతే వారి జీవితములో ఇట్లు చేసెదరో నేను సహాయపడెదను". ఈ రోజుకీ కూడా ఏ భక్తుడైనను తన అహంకారమును విడిచిన వానికి సాయి నిరాకార రూపుడై వారు బోధించిన తత్వముద్వారా వచ్చి వారి జీవితములో వారితో పాటు ఉండి సహాయపడును. **ఈ తత్వమునుండి కూడా నాకు తెలిసిన అసలు సాయి కనిపించినారు.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -3

భగవద్గీతయందు శ్రీకృష్ణపరమాత్మ పరమాత్మ రెండు రూపాలని అందులో మొదటిది సగుణ లేదా సాకార రూపమని, రెండవది నిర్గుణ లేదా నిరాకార రూపమని చెప్పాడు. అయితే భక్తులకు తమ ఇష్టదైవాన్ని సాకార రూపములో కొలుచుటయే భక్తికి మరియు భక్తునికి సులువైన మార్గమని శ్రీకృష్ణుడు తెలిపాడు. నిరాకార రూపములో భగవంతుని కొలుచుట చాలా కష్టము. కాని నిజానికి పరమాత్మ నిరాకారుడే. పరమాత్మను వర్ణించుట చాలా కష్టము. అతీతమైనటువంటి వ్యవహారము. అటువంటి పరమాత్మ సాయి నిరాకార రూపముతో ఎందరో భక్తులను సమాధి చెందిన పిదప కూడా కంటికిరెప్పవలె కాపాడుచున్నారు. సాకార రూపముతో నున్న సాయి ఎన్నోలీలలను ప్రదర్శించినారని 1918 వ సంవత్సరమునకు ముందు ఉన్న సాయిభక్తులెందరో చెప్పుకొనినారు. కాని 1918 వ సంవత్సరము పిదప కూడా సాయి ఎన్నో మహత్త్యములను తమ భక్తులకు చూపించినప్పటికి బలహీనమైన మనస్సుగలవారగుటచే మరియు విశ్వాసము లేకపోవుటచే ఈ నాటిసాయిభక్తులు శ్రీసాయి నిరాకారముతో ఎన్నో లీలలను

ప్రదర్శించినప్పటికీ సాయి నిరాకారరూపాన్ని ఋజువుకొరకు ప్రయత్నించుచున్నారు. నిజానికి అందరి భక్తుల ఎరుకలో సత్యముగా నిలిచినది మాత్రము శ్రీ సాయి అనంతతత్వమే. అదే శాశ్వతమైనది. అట్టి శాశ్వతమైన అనంత తత్వమునుండి ఏ భక్తుడైతే సాయి సాకారరూపములో ఉన్నప్పుడు వారినోటినుండి వచ్చినటువంటి అమృతతుల్యమైన పలుకులను తత్వముగా స్వీకరించి జీర్ణించుకుని ఆచరణలో పెట్టిన ఎడల ఆ అనంత శాశ్వతమైన తత్వమునుండి అసలు సాయి బయటపడును. **వారే నాకు తెలిసిన సాయి**.

శ్రీసాయి సచ్చరిత్ర 3 వ అధ్యాయమును పరిశీలించిన పిదప ఆనందమునకు అసలు కారణము సాయి సూచించెను. మనకు తెలిసిన ఆనందమంటే ప్రాపంచిక విషయములందు పొందేవని మనస్సును పలువిధములైన చోటుకు తీసుకుని వెళ్లటము, తద్వారా క్షణికమైన ఆనందాన్ని పొంది అదే శాశ్వతమైనదని అనుకొనిన క్షణములోనే ఆ ఆనందము దూరమగుచున్నది. అట్టి అశాశ్వతమైన ఆనందాన్ని మరచుట ఎట్లనగా శ్రీసాయి ప్రేమతో "నా నామమునుచ్చరించిన వారి భక్తిని హెచ్చించెదను." అని అన్నారు. సాయి చెప్పిన ఈ మాటలను ఒక్కసారి ప్రేమపూర్వకముగా మనస్సులోని అన్ని ఆలోచనలకు కోరికలకు స్వస్తిచెప్పి సాయినామాన్ని ఆర్తితో ప్రేమగా **సాయీ** అని ఉచ్చరించిన భక్తునికి ఉన్నభక్తి ఇంకా అధికమగును. తద్వారా సాయినామము నుచ్చరించుచున్నప్పుడు తనకండ్లనుండి తనకు తెలియకుండానే కన్నీళ్లుకారును. అదే అసలైన అమితానందము. సాయి చెప్పిన సులువైన భక్తితత్వము పాటించిన వానికి ఆ భక్తి తత్వము నుండి అసలైన సాయి నిరాకారముతో నిశ్శబ్దముగా ఉంటూ మనల్ని కాపాడే ఆ అసలు సాయి బయటపడును. **వారే నాకు తెలిసిన సాయి**. అట్టి వారికి ప్రపంచమందు వ్యామోహము క్షీణించును. సదాసాయి నామస్మరణతో సాయిలీల లలో మునుగుతూ జ్ఞాన రత్నములను పొందగలుగుతారు. ఇదే ఆనందమునకు అసలు కారణము. సాయిసేవలో తృప్తి పడినవారి ఇంట భోజన పాత్రలు ఎల్లప్పుడు సంపూర్ణముగానేయుండును.

సాయిభక్తులు వారి దృష్టిని సాయిపై త్రిప్పినయెడల వారికి శాశ్వతానందము లభించుటయేకాక వారిని సాయి చూచుచుండును.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -4

శ్రీసాయిబాబా రూపాన్ని గుర్తుకు తెచ్చుకుంటే సామాన్యముగా వారు తలకి తెల్లనిగుడ్డ కట్టుకుని కఫ్నీ ధరించి చెప్పులు ధరింపక ఒక భుజముపై జోళీ తగిలించుకుని ఒక చేతితో సటాక పట్టుకుని ఫకీరు వలె కనిపిస్తారని అందరూ చెప్పే మాట. కానీ శ్రీ సాయి సచ్చరిత్రలో 4 వ అధ్యాయమును గమనించినచో శ్రీ సాయి రూపురేఖలు ఇలా ఉంటాయి :

- వారు జ్ఞానమూర్తులు.
- ఎల్లప్పుడు ఆత్మధ్యానమునందే ఉంటూ ఆత్మసాక్షాత్కారమందే మునిగియుండేవారు.
- వారి అంతరంగము ప్రశాంతము.
- సమాధిస్థితినుండి మరలు వారు కారు.
- శాంతియే వారి భూషణము
- మానావమానాలను లెక్కించరు.
- మౌనమును పాటించేవారు
- నిత్యం దైవనామ స్మరణము చేయువారు.

సాయి మనమనుకున్న రూపురేఖలు మరియు పైన 8 విషయాలలో శ్రీ సాయిరూపురేఖలను పోల్చిచూచినచో అసలు పొంతన ఉండదు. శ్రీ సాయి మనకు చెప్పినది ఏమనగా అందరూ శాంతితో ఉంటూ వారి ఆంతరంగమున ప్రశాంతతను పొందుటకు యత్నించవలెనని, నిత్యం ఆత్మసాక్షాత్కారమందే మునిగియుండి సమాధిస్థితి అవలంబించవలెనని మౌనముతో ఉంటూ ఆత్మధ్యానమునందే మనస్సును లగ్నముంచి మానావమానములను లెక్కించక ఎవరి ఇష్టదైవమును వారు స్మరించవలెనని శ్రీ సాయిబాబా వారికున్న రూపురేఖలు మనకు ఆదర్శముగా చూపించెను. దీన్ని బట్టి సాయి బోధించిన తత్వమేమనగా ఒకమనిషి రూపురేఖలు అంటే కనుముక్కుతీరు లేదా వారు ధరించిన దుస్తులను బట్టి నిర్ణయించేది కాదని కావున ఒక వ్యక్తి రూపురేఖలంటే ఆ వ్యక్తియొక్క వ్యక్తిత్వమని శ్రీ సాయి తన తత్వబోధన ద్వారా చూపెను. కావున నాకు తెలిసిన సాయి యొక్క రూపురేఖలు వారి ఆకారము వారు ధరించిన దుస్తులు, వారుపయోగించిన వస్తువులను బట్టి నిర్ణయించబడేది కాదని సత్యమైన మరియు క్రొత్త సాయి వారి తత్వమునుండి పైన చెప్పబడిన 8 విధములైన వ్యక్తిత్వములతోకూడియున్నారని, వారే సత్యమైన సాయి అని మరియు **నాకు తెలిసిన సాయికూడాను**.

అసలు శ్రీసాయి దగ్గర ద్వందము అనే ప్రశ్నేలేదు. వారు ద్వంద్వాతీతులు. నిరుత్సాహము మరియు ఉల్లాసము రెండూ ఎరుగరు. కావుననే శిరిడీసాయి స్థితప్రజ్ఞులు. సాయి స్థితప్రజ్ఞతను సాయిభక్తులెల్ల ఆచరణలో తీసుకొనవలెను. అది అలవాటైన భక్తుడు నిరుత్సాహమెదురైనను క్రుంగిపోడు. ఉత్సాహసమయములలో పొంగిపోడు. నిశ్చలస్థితి అలవాటగును. ఆ స్థితియే బ్రహ్మస్థితిగా చెప్పవచ్చును. గుప్తముగా దాగిన శ్రీ సాయి నిశ్శబ్దముతో నిశ్చలస్థితిలో అనగా బ్రహ్మస్థితిలోయున్న భక్తునికి శ్రీసాయి క్రొత్తరూపము దాల్చి అనగా నిరాకారముతోనే ఆ భక్తునికి ప్రసన్నమగును. ఋజువు ఏమిటంటే ఎప్పుడైతే భక్తుడు స్థితప్రజ్ఞతకు అలవాటైన భక్తుడు బ్రహ్మీస్థితి అనుభవము పొందును. అది పరమానంద స్థితి. ఆ స్థితిని తెలుపుట కష్టము. అనుభవించేవారికే దాని స్థితితెలియును. సుఖదుఃఖాలు రెంటిలో సమానముగా ఉండే భక్తుని బ్రహ్మీస్థితిలో పొందే అమితానందమేశ్రీసాయి రూపము. **నాకు తెలిసిన సాయి** అంటే ఆ బ్రహ్మీస్థితియే.

సాయి మరికొన్ని అమృతతుల్యమైన మాటలను తన భక్తుడైన దాసగణుతో చెప్పెను. "మన ప్రయాగ ఇచ్చటనే కలదు. నా మాటలు విశ్వసింపుము". దాసగణు ప్రయాగకు పోవాలనుకున్నపుడు సాయి ఆతనితో చెప్పినమాటలివి. సామాన్యముగా జనులు గొప్ప పుణ్యనదులలో స్నానము చేసినచో పుణ్యము లభించునని నమ్ముదురు. సాయి పలికిన బోధన నిజానికి అది తత్వమే. "మన ప్రయాగ ఇచ్చటనే కలదు. నా మాటలు విశ్వసింపుము". అనుటలోని ఉద్దేశం జనులు పుణ్యనదులలో స్నానమొనరించవలెనని ఉండే నమ్మకం సాయి మాటలపై ఉంచవలెనని సాయి ఉద్దేశం. శ్రీసాయి దాసగణుకు తన పాదములనుండి ప్రయాగనదిని తెప్పించి దాసగణుకు చూపించెను. కావున సాయి భక్తులెల్ల ఏ పుణ్యక్షేత్రములకు గాని నదులకు గానిపోనవసరములేదని భక్తులు నమ్ముకున్న పాదములే సకల తీర్థములు మరియు సర్వనదుల పుణ్యములనిస్తాయని ఆయన అంటారు. **నాకు తెలిసిన సాయి** ఎవరంటే ఎవరైతే సాయి మాటలను విశ్వసించి వారిపాదములను నమ్ముకున్న వారికి ప్రసన్నుడై నిశ్శబ్దముతో ఆశీస్సులిచ్చే వారని.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -5

సాయిసచ్చరిత్రలో 5 వ అధ్యాయమున శ్రీసాయి చిలుమును వెలిగించుటకు నిప్పును, మరియు గుడ్డను తడుపుటకు నీరు కావలసివచ్చినపుడు సాయి వారి సటాకాను కొట్టగా నేలపై నీరు మరియు నిప్పు వచ్చెను. ఈ సంఘటన చూచినచో సాయి సాకార రూపములో చూపిన చమత్కారమగుటచే శ్రీసాయి

మహిమాన్వితునిగా తలచినారు. కాని ఇదే సంఘటన వేరొక కోణములో చూచిన ఎడల శ్రీసాయి పంచభూతాలకతీతముగా ఉంటూ వారు చెప్పిన విధముగా ఆ పంచభూతాలు వారిమాట విని నడుచునని తెలియును. ఉదాహరణకు మనకు వర్షాలు కురవడము, అగ్ని పుట్టడము, నిత్యము గాలివేయటము ఇవన్నీ ఎలా జరుగుతున్నాయని ప్రశ్నించుకుంటే సాకార రూపములో నున్న సాయియే ఆనాడు చమత్కారమును చూపి నీరు,నిప్పులను పుట్టించినారు. మరి ఇప్పుడు కురిసే వానలు, పుట్టే అగ్ని, వీచేగాలి ఇవన్నీ శ్రీసాయి పంచభూతాలకతీతంగా ఉంటూ నిశ్శబ్దముగా ప్రాణికోటిని నిరాకారరూపముతో రక్షిస్తున్నారు. **నాకు తెలిసిన సాయి** పంచభూతాలకతీతమైన వాడని వారు సైగచేయుటచే నీరు వర్షరూపముగా కురిసి పంటలు పండుతున్నాయని, అగ్నిప్రజ్వలించుచున్నదని, గాలి వీస్తూ, ప్రాణికోటిని బ్రతికిస్తోందని తెలుస్తోంది.

శ్రీసాయి తన జీవితములో ఒకసారి విరక్తిచూపెను. తద్వారా తాను ధరించిన దుస్తులను మార్చి కఫ్నీ ధరించుట, తలపై గుడ్డ కట్టుకొనుట, గోనెపై కూర్చొనుట ప్రారంభించెను. "రాజ్యభోగము కంటే దారిద్ర్యమే మేలని మరియు పేదవారికి భగవంతుడు స్నేహితడ" ని బాబా చెప్పెను. శ్రీసాయి చెప్పిన బోధనలో దారిద్ర్యము మేలన్నారు. మరియు పేదవారికి భగవంతుడు స్నేహితుడన్నారు. కావున ఎవరైతే పేదవారో వారు నిజంగా అదృష్టవంతులే . ఎందుకనగా వారికి ఆదినుండి అంతమువరకు శ్రీసాయి నిరాకార రూపములో స్నేహితులుగా ఉంటూ నిశ్శబ్దముగా ఆ పేదవారికి తెలియకుండా ఏదోయొక విధముగా రోజూ గడుపుతారు. **నాకు తెలిసిన సాయి** సాయి రాజ్యభోగములనుభవించే వాని దగ్గరలేడు. కాని దారిద్ర్యముతో ఉన్నవాడివద్దే ఉంటారు.

శ్రీసాయి ద్వారకామాయిలో దక్షిణాభిముఖముగా దక్షిణామూర్తి వలె కూర్చొనెడివారు. ఎదురుగా ధుని వెలుగుచుండెడిది. ఆ ధుని యొక్క ఉద్దేశ్యము అందరి అహంకారము,కోరికలను మరియు ఆలోచనలను ఆహుతి చేసినచో మిగిలేది బూడిదయే. మరియు జీవితము అనిత్యమని, నిత్యము కానటువంటిదని, ఏనాటికైనను మనిషి కట్టెలో కాలి బూడిదయగునని చూపుటకై ధుని వెలిగించెడివారు శ్రీసాయి. కావున ప్రతిజీవికి వైరాగ్యం కూడా ముఖ్యమని శ్రీసాయి తాను వెలిగించిన ధుని ద్వారా వైరాగ్యతత్వమును బోధించెను. **నాకు తెలిసిన సాయి** ద్వారకామాయిలో ధుని వెలిగించినవారుకారు. కాని వారి వైరాగ్య తత్వమునుండి తెలిపిన సత్యాన్ని చూపిన సాయియే **నాకు తెలిసిన సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -6 మరియు 7.

భగవంతుని సాన్నిధ్యమునకు వెళ్లుటకు ముఖ్యమైన నాలుగు మార్గములు గలవు. అవి 1. కర్మ 2.జ్ఞానం 3.యోగ 4.కష్టసాధ్యమైన భక్తిమార్గం. సద్గురువు తలచుకొనిన కష్టమైనది అంటూ ఉండదు. వారి సహాయముతో గమ్యాన్ని చేరుకోవచ్చును. సద్గురు సాయి బోధించిన అనేక బోధనలలో ఒకటైనది అదియు భక్తిమార్గమునకు సంబంధించినటువంటిది. "నా భక్తునియింటిలో అన్నవస్త్రములకు లోటు ఉండదు. నాయందే మనసు నిలిపి భక్తిశ్రద్ధలతో మనః పూర్వకముగా నన్నే ఆరాధించువారి యోగక్షేమములను నేనే చూచుకుందును." సాయి చెప్పిన తత్వములో భక్తిమార్గము ఎలాంటిదో సాయి చూపెను. శ్రద్ధతో కూడిన భక్తిగలవానికి మరియు మనఃపూర్వకముగా సాయిని ఆరాధించువారికి శ్రీ సాయి అట్టి భక్తుని యోగక్షేమములు చూచుటయేకాక వానియింట అన్నవస్త్రములకు లోటుండదని చెప్పెను. ఇక్కడ కావాలసినది శ్రద్ధతో కూడిన భక్తి మరియు మనస్సు. మరి మనస్సు సరియైన దారిలో ఉన్నదా లేదా అని ప్రశ్నించుకొనవలెను. మనస్సు సరియైన దారిలో ఉండవలెనన్న మనస్సునందు ఎవరి ఇష్టదైవము యొక్క రూపాన్ని వారు నిలుపుకొని సమస్త ఇంద్రియములను మరియు మనస్సును కూడా తనయిష్టదైవ ఆరాధనకై నియమింపవలెను. ఇట్లు చేసినచో మనస్సు వేరేచోటకు పరుగిడదు. అట్టి మనస్సుతో మనఃపూర్వకముగా శ్రద్ధతో కూడిన భక్తితో సాయిని ఆరాధించినచో నిర్గుణరూపముతోనున్న సాయి నిశ్శబ్దముగా తన భక్తుని ఇంటిలో అన్న వస్త్రములకు లోటు చూపడు. మరియు ఆ భక్తుని యోగక్షేమములను చూచుకుంటాడు. సాయి చెప్పిన తత్వమునుండి వెలువడిన క్రొత్త సాయే **నాకు తెలిసిన సాయి.**

ఒకసారి శ్రీ సాయి శ్రీరామనవమి మహోత్సవమున రామజన్మోత్సవ హరికథావేడుకలు జరుగుచున్న సమయమున శ్రీసాయి మసీదులో ఉండు భగవంతుని నిర్గుణ స్వరూపము సూచించుచు నింబారు (గూడు) నుండి రెండుపూలమాలలు తీసి హరికథ చెప్పువారి మెడలోను మరియు హార్మోనియం మ్రోగించువాని మెడలోను వేసెను. సాకారరూపములో నున్న శ్రీసాయి భగవంతుని నిర్గుణ స్వరూపము మనందరికి సూచించెను.

శ్రీసాయి మరియొక తత్వము సూచించెను. "నీకేమైనా కావలసినచో భగవంతుని వేడుకొనుము. భగవంతుని కరుణాకటాక్షములు సంపాదించుటకు యత్నించుము". ఇదిచాలా ముఖ్యమైన సాయిబోధన. భక్తుడు ఎంతో గొప్పభక్తుడైనప్పటికీ ఒక్కోసారి తనకు కష్టము వచ్చినప్పుడు తాను నమ్ముకున్న భగవంతుని వేడుకొనక సామాన్యమైన మానవులవద్దకు వెళ్లి తమ

కష్టములనుగూర్చి గోడువెలిబుచ్చెదరు. సాయి చెప్పినదేమనగా ఏదైనా కావలసినచో నీవు నమ్ముకున్న భగవంతునే వేడుకొనినచో ఆ పరమాత్మ కరుణించి కటాక్షించుచున్నారు. అట్టి కరుణాకటాక్షములిచ్చే నిర్గుణసాయియే **నాకు తెలిసిన సాయి.**

1. శ్రీసాయి జాతిమతాలతో ఎట్టి సంబంధము పెట్టుకొనరు.
2. వారు మత్స్యమాంసములు భుజించేవారు.
3. కుక్కలు భోజన పళ్లెములో మూతి పెట్టినను ఏమీ అనేవారు కారు.
4. శుద్ధానంద చైతన్యమూర్తి వారు.
5. నిత్యము పరిపూర్ణ వేదాంత తత్వమును బోధించేవారు.
6. సన్మానములకు పొంగిపోయే వారు కారు. అసలు వారికి అవి యిష్టమే లేవు.
7. ధునికెదురుగా ధ్యాన నిమగ్నులై ఉండెడివారు.
8. మలమూత్ర విసర్జన అక్కడే చేసేవారు.
9. స్నానానికి విలువ ఇచ్చేవారుకారు.
10. మూడురోజులకొకసారి తన ప్రేవులను బైటికి క్రక్కి వాటిని నీటితో శుభ్రపరచి చెట్టుపై ఆరవేసేవారు.
11. సాయి తన శరీరావయవములన్నిటినీ వేరు చేసేవారు.

పై సంఘటనలు ఒక్కసారి గమనించినచో నేను శరీరాన్ని అనుకునే వారికి అటువంటి సంఘటనలు చేయుట బహు కష్టము. సాయి తానొక శరీరమని ఎన్నడు అనుకొనలేదు. వారెల్లపుడు ఆత్మధ్యానములోనే ఉండెడివారు. వారు నిరాకార నిర్గుణ స్వరూపులు. భక్తులకొరకై సాకార రూపము దాల్చినప్పటికి వారు నిరాకారులు కావుననే ధునికెదురుగా ధ్యాననిమగ్నులై ఉండుటచే మలమూత్రవిసర్జన వారికి తెలియకుండగనే జరిగెడిది. వారొక శరీరమని అనుకోలేదు. కావుననే ఒక్కొక్కసారి స్నానము చేసేవారు. మరోసారి చేసేవారు కారు. కావున వారు శుద్ధానంద చైతన్యమూర్తులు. **నాకు తెలిసిన సాయి** వారే. దీనికి ఉదాహరణగా ఒక దీపావళి పండుగకు ముందురోజు సాయి ధునికెదురుగా కూర్చుని ఎక్కడో తన భక్తుల బిడ్డను రక్షించుటకై కాలుతున్న ధునిలో సాయి తనచేతిని నిశ్చలంగా ఉంచినారు. దీనిని బట్టి సాయి ఒక శరీరమును ధరించినవారా ? కారు. కావుననే వారిచేయి మండుతున్న ధునిలో పెట్టినను నిశ్చలముగా ఉన్నారు. ఆత్మకు

కాలుట, తడచుట, మండుట అనేవి ఉండవుకదా. అలాగే శిరిడీనుండి బహుదూరములో నున్న తన భక్తులయింటిలో జరుగు ప్రమాదమును నిర్గుణ స్వరూపములో అక్కడ ఉన్నసాయి చూచుటచేత తన భక్తుని రక్షించుటకై అప్పుడు సాయి సాకార రూపములో ఉన్నారు కావుననే తన చేయిని మంటలో పెట్టవలసి వచ్చింది. మరి ఈనాడు సాకారరూపసాయి లేకపోయినను తనను నమ్ముకున్న భక్తుని చేయిపట్టి ఎన్నో సందర్భములలో ప్రమాదాలనుండి దాటిస్తారు. అటువంటి నిర్గుణసాయి ఈనాడు కూడా నిశ్శబ్దముతో తన భక్తులను రక్షిస్తున్నారు. అటువంటిసాయియే **నాకు తెలిసిన సాయి.** ఇది నిరూపించుటకే శ్రీసాయి ఒకసారి తన భక్తునితో యిట్లనెను. తన భక్తుని కొరకు నేనెట్లు బాధపడెదనో చూడుము. వారి కష్టములన్నీ నావే. ఈ ఒక్కమాటచాలు. సాయి భక్తులకెల్ల కొండంత బలము.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -8

శ్రీసాయి నిత్యము ఆత్మానుసంధానమునందే నిమగ్నులై ఉండెనని, కావున వారు సద్గురువని చెప్పబడినారు. వారు కష్టసుఖములకు లోనుకాక నిశ్చలముగా ఉండేవారు. శ్రీసాయి రుచి అనునది ఎరుగరు. అన్ని పదార్థములను ఒకేసారి కలిపి తినేవారు. వారి భిక్షాటనలో దొరికిన పదార్థములను ఒక్కొక్కసారి పశుపక్ష్యాదులు తినినను ఏమీ అనేవారుకారు. కావుననే వారిని ఫకీరు అనికూడా అనేదరు. మానవజన్మ ఎంతో గొప్పదైనప్పటికీ, దానిని చాలామంది సద్వినియోగము చేసుకొనుటలేదు. మానవజన్మ వలన జ్ఞానమును పొందవచ్చును. ఈ జ్ఞానశక్తిచే ఆత్మసాక్షాత్కారమునుకూడా పొందవచ్చును. అట్టి ఆత్మసాక్షాత్కారము పొందవలెనన్న ఆత్మసాక్షాత్కారము పొందిన సద్గురువులే మార్గము. అటువంటి సద్గురువే శ్రీసాయి. మరి సాయిని ఫకీరు అని పిలుచుటకు కారణం? సద్గురువు లక్షణాలివి :

1. వారు శాంతి కలిగియున్నవారు.
2. క్షమ, వైరాగ్యంతో కూడినవారు.
3. దానము మరియు ధర్మము స్వాధీనమందుంచుకున్నవారు.
4. అలాగే మనోదేహములను కూడా స్వాధీనమందుంచుకున్నవారు.
5. అసలు మచ్చుకైనా అహంకారము చూపనివారు.

6. జిహ్వాను స్వాధీనమందుంచుకున్నవారు.

ఇలాంటి లక్షణాలు కలిగియున్న సద్గురువునే ఫకీరు అని అందురు. ఎందుకంటే వారు జ్ఞానశక్తిని కలిగియుండి దేహము మరియు జగత్తు అనిత్యమని ఇంద్రియ సుఖములు అశాశ్వతమని సిరిసంపదలు క్షణభంగురములని తలచి శాంతి, క్షమ, వైరాగ్యము, దానము, ధర్మములతో ఉంటూ, మనోదేహములను స్వాధీనమునందుంచుకొని అహంకారము లేని వారలను ఫకీరులని కూడా అందురు. వారి చర్యలు మరియు సామాన్య సంభాషణే మనందరికీ మౌన ప్రబోధములని ఋజువగుటకు ఒకసారి సాయి ఇట్లనినారు. " ఫకీరు పదవియే నిజమైన మహారాజు పదవియని, యిది శాశ్వతమని, సిరిసంపదలు క్షణభంగురాలని". సాయి భక్తులెల్ల శ్రీసాయి చర్యలు మరియు సంభాషణలు ఆదర్శముగా తీసుకుని ధనానికై పాకులాడక ఫకీరు పదవికి అర్హుడు కావలెను. అట్టి అర్హత పొందినచో ఆత్మసాక్షాత్కారమునకు దారిచూపుటకు నిర్గుణరూపములో నున్న సాయి నిశ్శబ్దముగా తన భక్తుడికి జ్ఞానశక్తి రూపముతో సహాయపడి మోక్షానికి దారిచూపుతారు. అట్టి జ్ఞానమనేప్రత్యేకశక్తిగల సాయియే **నాకు తెలిసిన సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -9

శ్రీసాయి బ్రహ్మచారి. వారు చిన్నతనమునుంచి బ్రహ్మచర్యముతోనే ఉన్నారు. శ్రీసాయి భిక్షాటనముచే తమ జీవితమును గడిపేవారని అందరికీ తెలుసు. కానీ సకలజగత్తు వారి గృహమే. వారు జగత్తుపై ఆధారపడలేదు. కానీ ఈ సకలజగత్తు వారిపై ఆధారపడినది. కావున కనిపించే జగత్తుకు వారే కారణభూతులు. మరి సకల జగత్తు వారి గృహమే అయినపుడు సాయి భిక్షాటన చేయుట ఏల ? దీనికి సమాధానము పంచ సూనములను తప్పించుటకై సాయి ప్రతి ఇంటికి వెళ్ళి భిక్షాటన చేయుచు ఆ గృహస్థులకు వారు నిర్వర్తించవలసిన కర్మలను గుర్తుచేసే వారు. భక్తులకొరకు మానవరూపమున భువిపై సాక్షాత్కరించిన పరమాత్మతత్వమే సాక్షాత్తు శ్రీసాయిబాబా. మరియు ఆ పరమాత్మయే శ్రీసాయిబాబా. గృహస్థులు దంచుట,విసురుట, పాత్రలు తోముట, ఇంటిని ఊడ్చుట, పొయ్యి అంటించుట అనే పనులు నిత్యము చేయవలసినదే. అలా చేసేటప్పుడు తెలియకుండానే క్రిమికీటకాలు మరణించుట జరుగును. ఈ పాపములను గృహస్థులు మూటకట్టుకొనుట తప్పదు. పాప పరిహారమునకు బ్రహ్మయజ్ఞము, వేదాధ్యయనము,

పితృ,దేవ,భూత మరియు అతిథి యజ్ఞములు అనే ఆరు మార్గములు కలవు. ఇవి ప్రబోధించుటకై శ్రీసాయి భిక్షాటన చేసేవారు.

కావున గృహస్థులు తమ యింటి ముందు ఎవరైనా భిక్షకై వచ్చినప్పుడు వారిని తిరస్కరించి పంపివేయక వారికి భిక్షనీయవలెను. అట్లుచేసిన ఎడల ఆయింటి పంచసూనములనే పాపములు తొలగిపోవును. అంతేకాక గృహస్థుడు తన ఇంటిముందుకు వచ్చిన ఆ భిక్షకుడు సాక్షాత్ శ్రీసాయిగనే భావించినచో వానియింట పంచసూనములనే పాపాలు తొలగిపోవును. నిరాకార స్వరూపులనైన శ్రీసాయి నిశ్శబ్దముగా ఆ ఇంటిలోనున్న పంచసూనములనే పాపములను తన జోలెలో కట్టుకుని భుజముపై వేసుకుని ఆ యింటివారిని ఆశీర్వదించి ఎక్కడినుండి వచ్చినారో అక్కడికి వెళ్లిపోవును. **నాకు తెలిసిన సాయి** భిక్షాటనముచే సాకారరూపములో కనిపించిన సాయియే కాక ఆ భిక్షాటనమువలన గృహస్థుల పంచ సూనములను పోగొట్టువారే అట్టి సాయి అని తెలిసినది.

శ్రీసాయి సాకార రూపములో శిరిడీలో ఉన్నప్పుడు తన భక్తుడైన ఆత్మారాముని భార్యతో ఇట్లనినారు. **"**తల్లీ ! ఏమైనా తినవలెనని ఉద్దేశ్యముతో బాంద్రాలో మీయింటికి పోయినాను. తాళంవేసియున్నను ఎలాగోలా లోపలకు ప్రవేశించితిని. కాని అక్కడ తినుటకు ఏమీలేకపోయెను కావున తిరిగి వచ్చితిని." శిరిడీ ఎక్కడ ? బాంద్రా ఎక్కడ ? పైగా శ్రీసాయి సాకారరూపములో శిరిడీలోనే ఆత్మారాముని భార్య ఎదుటయుండి బాంద్రాలో అట్టి భక్తుని ఇంటికి అదే సమయమున వెళ్లెను. దీనిని బట్టి శ్రీసాయికి సకల జగత్తు వారి గృహమే అనేది ఋజువు అగుటయే కాక, శ్రీసాయి సర్వవ్యాపి అని వారు నిశ్శబ్దముగా యావత్ జగత్తులోని తన భక్తులయింట ఏదో ఒక సమయమున తప్పక వచ్చి తన భక్తుడు భక్తిప్రేమలతో సమర్పించిన ఏ చిన్ని నైవేద్యమునైనను స్వీకరించునని ఋజువౌతోంది. బాబాకు కావలసినది భక్తిప్రేమలు మాత్రమే. సాయిని నమ్ముకున్న భక్తులెల్ల ప్రతిరోజూ శ్రీసాయికి తప్పకుండా నైవేద్యము పెట్టితీరవలెను. **నాకు తెలిసిన సాయి.** ఏ భక్తుడైతే పూర్తివిశ్వాసముతో సాయి పలికిన పలుకులపై "తలుపు తాళము వేసి యున్నను ఎలాగునో లోపలకు ప్రవేశించితిని**"** నమ్మకముంచినచో శ్రీసాయి తనను నమ్ముకున్న భక్తుని ఇంటికి తాళము వేసియున్నను శ్రీసాయి లోపలకు ప్రవేశించి వారు సమర్పించిన నైవేద్యము స్వీకరించును. సాయి పలికిన పలుకులు సామాన్యమైనవికావు. అవి తత్వాన్ని బోధించేవి. ఆ పలుకులను లేదా

తత్వమును పరిపూర్ణ విశ్వాసముంచిన భక్తునికి శ్రీసాయి నిరాకార స్వరూపముతో నిశ్శబ్దముగా తన భక్తుని వెంటే ఉంటూ రక్షించును. వారే **నాకు తెలిసిన సాయి.**

శ్రీసాయి బలరామ్ మాన్ కర్ తో మరియొక సందర్భమున ఇట్లనినారు. “నాభక్తులు నన్నెట్లు భావింతురో నేను వారినావిధముగానే అనుగ్రహింతును. ” ఆత్మారాముని భార్య బలరామ్ మాన్ కర్ తో సాయి అప్పటికే నైవేద్యముగా పెట్టిన పేడా ను శిరిడీకి పంపెను. అయినను శ్రీసాయికి కావలసినది భక్తి మరియు ప్రేమలు. కావున ఆ పేడాను స్వీకరించి బలరామ్ మాన్ కర్ తో అన్నపలుకులే పైన చెప్పబడినవి. **నాకు తెలిసిన సాయి** అంటేవారే. ప్రత్యేకముగా శుద్ధితో మడిఆచారములతో నైవేద్యముపెట్టినచో స్వీకరించే పరమాత్మ కాదని ఏ భక్తుడైతే భక్తి మరియు ప్రేమ కలిగియుండి ఆ భక్తిప్రేమలచే అప్పటికే నైవేద్యము సమర్పింపబడినది. ఎటువంటిదైనను పత్రం, పుష్పం, ఫలం, తోయం లాంటివైనను స్వీకరించే పరమాత్మయే శ్రీసాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -10

శ్రీసాయి ద్వంద్వభావ భేదము వదలమని చెప్పినారు. ఎవరైతే సకల జీవకోటిలో నన్ను చూడగలుగుదురో వారే నా ప్రియభక్తులన్నారు శ్రీసాయి. దీనికి నిదర్శనముగా తర్కడ్ భార్య ఒక మొరిగే కుక్కకు రొట్టె వేసినపుడు అదేరోజు సాయంత్రం మసీదులోనున్న సాయిని ఆమె దర్శించుకున్నప్పుడు సాయి ఇట్లన్నారు. “ నీవు ప్రేమపూర్వకముగా పెట్టిన రొట్టెను తిని ఇప్పటికి త్రేన్పులు త్రేన్పుచున్నాను. ఆ కుక్కయు,నేనును ఒక్కటియే. నేనే వాని ఆకారములో తిరుగుచున్నాను”. దీనిని బట్టి శ్రీసాయి అంటే శిరిడీనున్న ద్వారకామాయిలోకూర్చునియున్న శ్రీసాయేనా ? కాదు. **నాకు తెలిసిన సాయి** అంటే సకలజీవకోటిలో సాయిని చూడటమే. దీనికి ద్వంద్వభావము సాయి చెప్పినట్లుగా విడువవలెను. అప్పుడు సాయిలేనిచోటు వెతుకుటయే కష్టము.

గృహస్థుల యొక్క సంసారపు ముళ్లను విప్పుటకు సాయి నామస్మరణే తరుణోపాయము. వారిని నమ్ముకున్న భక్తుని సంసారమున శ్రీసాయి తప్పక సాగరపు ఒడ్డునకు చేర్చును. శ్రీసాయి శిరిడీలో మసీదులోనున్న రోజులలో ఆ మసీదులోని దూలమునకు చినిగిన పాతగుడ్డ పీలికలతో ఊయలను కట్టి ఆ బల్లయొక్క నాలుగు వైపుల దీపములను వెలిగించి ఆజానుబాహుడైన సాయి ఆ

బల్లపై పడుకునే వారు. చిత్రమేమిటంటే ఆ బల్లపైకి శ్రీసాయి ఎలా ఎక్కుచుండెనో లేదా దిగుచుండెనో ఎవ్వరికీ తెలియదు. ఈ సన్నివేశమును ఒక్కసారి లోతుగా గమనించినచో అంతటి ఎత్తుపై బాబా సాకారరూపముతో ఎక్కడం సాధ్యంకాదని గమనింపవచ్చును. శ్రీసాయి నిరాకార శక్తియే అప్పటికి ఇప్పటికి మరెప్పటికైనా ఆ శక్తి తరగనిది. **నాకు తెలిసిన సాయి** ఆ శక్తిస్వరూపుడే. వారు విశ్వమంతయు ఆవరించియున్నారు. ఆ పరబ్రహ్మము మరియు అట్టి పరబ్రహ్మతత్వమే శ్రీసాయి.

అంతటి శక్తి సంపన్నుడు మరియు సహజస్థితిలోనే ఉంటూ ప్రపంచపు ఉనికికి అతీతముగా తీసుకుని వెళ్లే శక్తిగల సాయి సద్గురువులైనప్పటికీ ఒకసారి ఇట్లన్నారు. **"**బానిసలకు బానిసనగు నేను మీకు ఋణగ్రస్తుడను. మీ దర్శనముచే నేను తృప్తుడనైతిని. మీ పాదములు దర్శిచుట నా భాగ్యము. మీ అశుద్ధములో నేనొక పురుగును. అట్లగుటవలన నేను ధన్యుడను**"**. సాయి పలికిన ఈ పలుకులు విన్నచో నిజమైన సాయి భక్తులకెల్ల తమ కళ్లు చెమ్మగిల్లును మరియు ఒళ్లు జలదరించును. భక్తుల కొరకు మానవ రూపము దాల్చి ఆపరమాత్మ తత్వమే శ్రీసాయి అందరికీ సద్గురువైనప్పటికీ " బానిసలకు బానిసనగు నేను**"**.అనియున్నారు. ఇక మనలాంటి వాళ్లయొక్క స్థితి గమనించినచో ఎక్కడ కనిపించును ? **"**శ్రీసాయి మీ దర్శనముచే నేను తృప్తుడనైతిని**"**. అని అన్నారు. ఎందరోయాత్రికులు శిరిడీకి వెళ్లి సాయిని దర్శించుకొనవలెననే ఆశతో లోనికి ప్రవేశించినప్పటికీ సాయి విగ్రహము ముందు వచ్చినప్పుడు ఆ యాత్రికులు తమ మనస్సును బుద్ధిని నిలకడగా ఉంచుకొనక బైటకు వచ్చిన పిదప సాయిని తృప్తిగా దర్శించుకొనలేదనే భావన కలుగుతుంది. అదే సాయి విగ్రహరూపంలో ఉన్నప్పటికీ తమ దర్శనము కొరకు వచ్చిన వేల భక్తులను చూచి "మీ దర్శనముచే తృప్తుడనైతిని. మీ పాదములు దర్శించుట నా భాగ్యమని అంటున్నారు." సాయియొక్క అణకువ చూచిన వారికెల్ల ఇది ఒక గుణపాఠం. సాయి చెప్పిన మాటలలో ప్రతిఒక్కరు తమ నిత్యజీవితంలో ఎవరైనా వారి ఎదుట పరిచయమున్నను లేకున్నను వారు వచ్చినచో అటువంటి వారి దర్శనముచే తృప్తిపడి వారి పాదములను ఒక్కసారి దర్శించుకుని అది భాగ్యముగా తలవవలెను. అంతటి సాయియే ఆవిధముగా చేయుచున్నప్పుడు మనబోటివారు ఇక ఎంత ?శ్రీ సాయి "మీ అశుద్ధములో నేనొక పురుగును. అట్లగుటవలన నేను ధన్యుడను**"** అనికూడా అన్నారు. ఈ వాక్యములు చదివినచో చాలును. సామాన్యమైన మనవంటి మానవులు ఇక ఎంతటివాళ్లము ? మనయొక్క ధనము, దర్పము, కీర్తి, ప్రతిష్ఠలు, చదువులు ఇలా ఎన్ని కోణాలలో చూచుకొనినను

అవి ఏపాటివి ? కావున దీనినిబట్టి నేను అశుద్ధతలో ఉన్న పురుగుకు గల అర్హతను కూడా నోచుకోనివాడను. **నాకు తెలిసిన సాయి** ఎవరోకాదు. వారు పలికిన పలుగుల నుండి వారి తత్వమునుండి మరియు వారి అణకువ నుండి వెలువడిన సత్యాలేశ్రీసాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -11

శ్రీసాయి శిరిడీలో సగుణ స్వరూపమున నివసించినట్లు కనపించినప్పటికీ వారు నిర్గుణరూపమున సర్వాంతర్యామిగా కొలువై ఉన్నారు. సాక్ష్యం వారి తత్వమే. తత్వము అనగా స్వభావముగా చూచినను లేదా తత్వజ్ఞానముగా చూచినను శ్రీసాయి తన స్వభావము మరియు వారి దివ్యామృత పలుకుల తత్వము రెంటిలోను గమనించిన నిరాకార సాయి తెలియచున్నాడు. అటువంటి క్రొత్తసాయియే **నాకు తెలిసిన సాయి.** సాయి ఆకారముతో కనిపించినను వారు నిరాకార స్వరూపులే. వారికి దేనియందు ఆసక్తి లేకుండెను. కావుననే వారు విరాగులు. ఉదాహరణకు ఒకసారి సాయి తన గద్దెపై కూర్చుని ఉన్నప్పుడు నానావళి సాయిని లేవదీసి తాను ఆ గద్దెపై కూర్చున్నప్పటికీ సాయి ఎట్టికలత చెందలేదు.

శ్రీసాయి తన భక్తులకు యోగాభ్యాసములు కాని ఎటువంటి మంత్రోపదేశములు కాని ఉపదేశించలేదు. సాయి చెప్పినదెల్ల ఒక్కటే. సాయి నామమును జ్ఞప్తియందుంచుకొనమనెను. మరియొక విశేషమేమనగా శ్రీసాయికి షోడశోపచార పూజలతో ఎటువంటి పనీలేదు. సాయిని నిత్యము జ్ఞప్తియందుంచుకొనుటకు తెలివైన మార్గమేమిటంటే అనునిత్యము విరామమే లేకుండా ఆలోచించే మనస్సును మరలించి సాయిపై ఉంచి జ్ఞప్తికి తెచ్చుకోవలెను. ఇదే సాయికి పూజ. మరే ఇతర ఆర్భాటములు,ఆడంబరములు, ఆచారములతో పనిలేదు. **నాకు తెలిసిన సాయి** ఏ యోగాభ్యాసములు కాని మంత్రోపదేశములు కాని ఉపదేశించనివాడు. ఒక్క సాయి నామమును మాత్రమే జ్ఞప్తియందుంచుకొన్నవాడు మరియు ఇంద్రియ విషయములపై ఆకట్టుకున్న మనసును మరల్చి సాయిపై తదేక దృష్టిని నిలిపి జ్ఞప్తికి తెచ్చుకుని అదియే శ్రీసాయిపూజ అని విశ్వసించే భక్తునికి తన వెంట నీడలా తనకు తెలియకుండా నిశ్శబ్దముగా ఆ భక్తుని యోగక్షేమములు కనిపెట్టుకునిన సాయి అని ప్రేమతో పిలిచే భక్తునికి పలికేవాడు. తనపలుకు ఆ భక్తునికి వినిపించదు. కాని సాయి తన పలుకును వారి చేష్టలతో చూపించి ఆ భక్తుని ఇంట మరియు వెంట ఉంటూ వారి తంటాలను

సరిదిద్ది సమయానికి ఆదుకునేవారే **నాకు తెలిసిన సాయి.** దీనికి ఋజువుగా సాయి ఇట్లనినారు. నేనెప్పుడూ నీ యోగక్షేమములనే ఆపేక్షించెదను. నేను మీ సేవకుడను. నేనెప్పుడూ నీ వెంటనే ఉండి పిలిచిన పలుకుతాను. నేనెప్పుడూ కోరేది మీ ప్రేమను మాత్రమే.

శ్రీసాయి పంచభూతాలను స్వాధీనమందుంచుకున్నవారు. కావుననే శిరిడీలో ఒకసారి సంభవించిన గాలితుఫానును మరియొకసారి ద్వారకామాయిలో ధునిలోని మంటలు ఒక్కసారిగా లేచినప్పుడు సాయి తన వాక్కుతో పంచభూతములలో ఒకటైన నీరు మరియు నిప్పును శాసించి వాటిని శాంతపరచినారు. ఈనాటికికూడా పలుచోట్ల వర్షాలులేని కారణముగా పంటలు పండకపోవుటచే ఎందరో భక్తులు నిరాకార స్వరూపుడైన సాయిని ప్రార్థించిన తోడనే పంచభూతములను స్వాధీనమందుంచుకున్న సాయి నిరాకార స్వరూపముతోనే నిశ్శబ్దముగా పంచభూతములలో ఒకటైన నీటిని తిరిగి వారి శాసనముచే కురిపించుచున్నారు. అలాగే తీవ్రనష్టముతో కూడిన వర్షమును సాయి తన శాసనముతో తిరిగి తగ్గించుచున్నారు. **నాకు తెలిసిన సాయి** ఎవరోకాదు. నిర్గుణ స్వరూపములో ఉంటూ పంచభూతములనే స్వాధీనమందుంచుకుని ఆటలాడేవారే ఆ సాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -12

శ్రీసాయి యిష్టానుగుణముగానే సర్వము జరుగును తప్ప మనము యోచించే విధముగా జరుగుట అనేది ఉండదు. మన యోచనలన్ని గాలిలో తేలేవే. సాయికి యిష్టములేకున్నఎడల వారి దర్శనమునకు కూడా రానివ్వరు. కావున బాబా ఆజ్ఞ ఎంతవరకు ఉన్నదో అంతవరకే జరుగును కానీ ఆవగింజంతైనా ఆవల సాయి గీసిన గీత దాటదు. సాయిని నమ్ముకునిన మరియు ప్రేమించిన భక్తులు సాయి ఆజ్ఞను శిరసావహించవలసినదే. ఒక్కొక్కసారి సాయి భక్తుడు తాను అనుకున్న విధముగా జరుగకున్నచో అది సాయి ఆజ్ఞ అని భావించి సమ్మతింపవలెను. అటువంటి స్థితిలో కలతను వదలి తనకు జరుగవలసినది జరుగలేదని దుఃఖము గాని తాను నమ్ముకున్న సాయి తన కోరికను వినక వ్యతిరేకముగా చేసినందుకు భక్తుడు నిరుత్సాహముతో సాయిపై కోపము తెచ్చుకొనరాదు. అటువంటి స్థితిలోకూడా నిబ్బరముగానే ఉంటూ సాయిని ఇంకా ప్రేమిస్తూ తన ప్రేమను హెచ్చించి తన

విశ్వాసమును ఇంకా దృఢపరచి తన భక్తిలో పరాకాష్ట చెందుటకు యత్నించి నిశ్చలముగా ఉండవలెను.

నాకు తెలిసిన సాయి సర్వము సాయి ఇష్టము పైనే ఆధారపడిచూపే పరిణామమే ఆసాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -13

శ్రీసాయిబాబా బైటకు దక్షిణ పుచ్చుకునేవానిగా కన్పించినను నిజానికి సాయి తన భక్తులకవద్ద నుండి ఏమియు కాంక్షించేవారు కారు. వారు కోరినది నమ్మకము మరియు భక్తి మాత్రమే. కావుననే ఒకానొక సందర్భమున శ్రీసాయి ఇట్లనెను. పూజాతంతుతో నాకు పనిలేదు. "షోడశోపచారములు గాని అష్టాంగయోగములు కాని నాకు అవసరములేదు. భక్తియున్నచోటనే నా నివాసము". సాయి చెప్పిన మాటలలో "భక్తియున్నచోటనే నా నివాసము" అనే మాటలను పరిశీలిస్తే ఆయన భౌతికముగా ఈ రోజులేనప్పటికీ వారు ఎవరిచెంత అనన్యమైన భక్తి ఉన్నదో ఆ భక్తునిఇంట మరియు ఆ భక్తునివెంట శ్రీసాయి నిశ్శబ్దముతో ఆ భక్తునికి తెలియకుండా తాను ఎక్కడికి వెళ్లినను తన వెంటఉంటూ కంటికి రెప్పలా కాపాడుతూ ఆ భక్తుని భారములను బాధ్యతలను కార్యములను సాయి నిరాకారరూపములో ఉంటూ వారి ప్రేరణచే ఆ భక్తునితప్పుదారి పడనీయకుండా అంతా సుఖమయముగా భక్తునికి తెలియకుండానే చేయుచున్నారు. ఈ రహస్యమును గ్రహించుట చాలా కష్టమైనప్పటికీ శ్రీసాయిని నమ్ముకున్న భక్తుడు ఏ కార్యమైనా జయము పొందిన పిదప ఆ భక్తుడు అసలు రహస్యము తెలియకుండానే ఈ నా విజయము సాయి కృపతో జరిగెనని అందురు. కావున **నాకు తెలిసిన సాయి** భౌతిక రూపముతో కనిపించకపోయినప్పటికీ ఎవరైతే అనన్యభక్తిని మరియు శ్రీసాయి దివ్యబోధనలను పరిపూర్ణముగా విశ్వసించెదరో అటువంటి వారి వెనుకయుండి సర్వము శ్రీసాయియే కనిపించకుండా చేస్తూ తన భక్తుడు చేసినట్లుగా చూపించిన వాడే ఆ నిరాకార సాయి.

శ్రీ,సాయి " నేను ఫకీరు అయినప్పటికీ తప్పించుకొనలేని మాయ నన్ను బాధించుచున్నది. హరియొక్క ఆ మాయ బ్రహ్మాదులనే చికాకు పరచగా నేనెంత కాని హరి ప్రసన్నుడైనచో ఆ మాయ దాటగలము. దానికి మార్గము నిరంతర హరి భజనయే". ఈ మాటలలో కూడా శ్రీసాయి మాయాశక్తిని, దాని పరిణామమును కూడా అందరికీ గుర్తుచేసెను. ఏ క్షణములోనైనా మాయ ఆవరించే ప్రమాదమున్నదని ఆ మాయలో చిక్కుబడి బైటకు రావటం

కష్టమని సూచించెను. అయితే హరి ప్రసన్నుడైనచో తప్పించుకొనగలమని కూడా హెచ్చరించెను. దానికి సులువైన మార్గం హరిభజనయే అని శ్రీసాయి అన్నారు. శ్రీసాయి సాక్షాత్ త్రిమూర్త్యాత్మక రూపమైన శ్రీదత్తుడు. ఆ త్రిమూర్తులలో హరికూడా ఒకరు. శ్రీసాయి అటువంటి దత్తావతారం దాల్చినప్పటికీ మనకు మాయ కప్పింపచేసి సాయి సామాన్యునివలె "తప్పించుకొనలేని మాయ నన్నుకూడా బాధించుచున్నది." అనుటయే కాక హరి ప్రసన్నుడైతే తప్పించుకొనుట సాధ్యమని దాని మార్గము హరిభజనయే అన్నారు. మాయ కమ్మినవారందరికీ శ్రీసాయి అభయమిచ్చినట్లే. ఎందువలనంటే వారు త్రిమూర్తిరూపములో ఒకరైన హరికూడా. హరిప్రసన్నుడైతే అనే మాటలలో అంతరార్థము శ్రీసాయి ప్రసన్నుడైతే అని వస్తుంది. శ్రీసాయి ప్రసన్నుడవ్వాలంటే శ్రీసాయి భజనయే మార్గం. **నాకు తెలిసిన సాయి** ఎవరోకాదు. ఎక్కడ శ్రీ సాయి భజన జరుగునో అక్కడ శ్రీసాయి నిర్లిప్తతతో నిరాకారంతో మరియు నిశ్శబ్దముగా వచ్చిన వారందరిలో ఒకరుగా కనిపించకుండా ఉంటూ అక్కడ అంటే ఆ భజనయందు పాల్గొనే వారందరిని శ్రీసాయి ప్రసన్నుడై వారిపైనున్న మాయాతెరను తొలగించేవాడే ఆ సాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -14

శ్రీసాయి ద్వారకామాయిలో ఉన్నపుడు తన భక్తుడు ఎవరైతే ఆ ద్వారకామాయి మసీదు ఎక్కుతారో వారి కష్టములను మరియు రోగములను పోగొట్టి అఖండ ఆశీర్వాదములనిచ్చేవారు. ఉదాహరణకు బాలాగణపతి షిండే అనే భక్తుడు మలేరియాతో బాధపడుచుండగా అతని వ్యాధి విరుగుడుకు శ్రీసాయి లక్ష్మీమందిరము ముందరనున్న ఒక నల్లని కుక్కకు పెరుగన్నము పెట్టింపజేసి వ్యాధిని నిరోధింపచేసెను. అలాగే బాపూసాహెబ్ బూటీకి విరోచనములను సాయి తన వాక్కుతో హెచ్చరించి ఆపెను. ఆళంది అనే ఒక సన్యాసికి చెవిపోటు తగ్గించుటకు సాయి అల్లా అచ్చాకరేగా అనే వాక్కుతో నిరోధింపజేసెను. ఇంకా కడుపు నొప్పి, మూలవ్యాధి మరియు అనేక వ్యాధులతో బాధపడే భక్తులకు శ్రీసాయి తమ ఆశీర్వాదములతో తగ్గింపచేసెను. ఈనాటికికూడా భయంకరమైన రోగాలతో బాధపడే సాయిభక్తులెందరికో శ్రీసాయి సజీవముగా లేకున్నప్పటికీ వారి ఊదీ ప్రభావముచే వ్యాధులు తగ్గుముఖము పట్టిన వారెందరో కలరు. దీనిని బట్టి **నాకు తెలిసిన సాయి** ద్వారకామాయిలో భౌతికముగా కనిపించే రూపమా? లేదా ఒక వైద్యుడా? కాదు. అన్నిరోగములకు

సరియైన ఔషధమంటే శ్రీసాయి యొక్క వాక్కు మరియు వారి అఖండ ఆశీర్వాదములు మాత్రమే. శ్రీసాయిని పరిపూర్ణముగా భక్తి మరియు విశ్వాసములతో నమ్ముకున్న భక్తులయొక్క వ్యాధులను నిరోధించుటకు శ్రీసాయి నిశ్శబ్దముగా నిరాకారరూపుడై తమ భక్తుల ఇంట లేదా తమ భక్తులు ఉన్న ఆసుపత్రులలో వారికి తెలియకుండా కనిపించకుండా వచ్చి దివ్య ఆశీర్వాదములనిచ్చే వారే ఆ సాయి. సాయి అంటేనే ఆశీర్వాదమని అర్థం. వారి ఆశీర్వాదమే అన్ని రోగములకు అసలైన ఔషధము.

శ్రీసాయి తనను నమ్ముకున్న భక్తులయొక్క వ్యాధులు బాగుచేయుటయే కాక సంతానములేని దంపతులను కూడా శ్రీసాయి వారి వాక్కుచే మరియు ఆశీర్వాదముచే సంతానమును కలిగింపచేసిన సంఘటనలు కూడా అప్పటికీ మరియు ఇప్పటికీ చాలా కనిపిస్తూనే ఉన్నాయి. ఉదాహరణకు పుత్రసంతానము లేని రతన్ జీ అనే వానికి శ్రీసాయి ఒక దివ్యవాక్కుచేత ఆశీర్వదించెను. అదే "దిగులుపడకు నీకు కీడురోజులు ముగిసినవి అల్లా నీ మనసులోని కోరిక నెరవేర్చు" ననెను. తత్వమనగా స్వభావము లేదా తత్వజ్ఞానము అని తెలుసుకున్నాము. శ్రీసాయి స్వభావము వర్ణింపరానిది. అంతుపట్టనిది. అతీతమైనది. వారి స్వభావము లేదా తత్వజ్ఞానము శ్రీసాయి యొక్క వాక్కులలో జాగ్రత్తగా లోతుగా పరిశీలించిన వాటి అంతరార్థములు బయటపడతాయి. అటువంటి అమృతతుల్యమైన మరియు ధైర్యాన్ని ఒసగే శ్రీసాయి వాక్కులను ప్రతి సాయి భక్తుడు గుర్తుచేసుకుని ధైర్యముగా ఒక అడుగు ముందువేసిన శ్రీసాయి వాక్కుబలముచే తప్పక ఆ భక్తుడు తమ గమ్యస్థానము చేరగలడు. పైన సాయి పలికిన పలుకులు దిగులు పడకు నీ కీడు రోజులు ముగిసినవి అన్న బలమైన ఆశీర్వచనము రతన్ జీ కి పుత్రసంతానము లేకపోవుటచే ఆ యాశీర్వాదము ఉత్తరోత్తర రతన్ జీకి సంతానప్రాప్తి కలిగించినది. అదే సాయివాక్కును ఇతర భక్తులు ఎవరు బాధలలో లేదా కష్టములతో ఉన్న ఇతర భక్తులు శ్రీసాయి పలికిన పై పలుకులను తలచుకున్నయెడల వారు పడుతున్న రకరకాల కష్టాలు కూడా శ్రీసాయి ఆశీర్వాదములచే తొలగిపోవుట తథ్యం. **నాకు తెలిసిన సాయి** ఎవరంటే శ్రీసాయి పలికిన తత్వజ్ఞాన పలుకులయొక్క సారాంశమే. అటువంటి దివ్యపలుకులను జ్ఞప్తియందుంచుకొనిన వారి చెంత శ్రీసాయి నిరాకార రూపముతో ప్రక్కనే ఉంటూ నిశ్శబ్దముగా అతనిని రక్షిస్తూ ఉంటారు. కావున శ్రీసాయి అంటే పరిమితులకు అతీతులని శ్రీసాయి యొక్క దేహము కనిపించకపోయినను సాయిబాబా అను శాశ్వతమైన ఆ అనంతశక్తి మాత్రము ఎల్లప్పుడూ శాశ్వతముగా నిలిచియున్నదని మరియు అందరి ఎరుకలో మరియొకటి నిలిచిన శ్రీసాయి అనంత తత్వమే.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము -15

శ్రీసాయి మరియొక సందర్భమున ఇట్లనినారు. " నా ముందర భక్తితో మీ చేతులు చాపినచో రాత్రింబవళ్లు మీ చెంతనే యుండెదను. సప్తసముద్రముల ఆవల మీరు చేయు పనులు నాకు తెలియును. ప్రపంచమున మీరు ఎక్కడున్నను నేను మీ చెంతనయుండెదను. నా నివాస స్థలము మీ హృదయమే. కావున మీ హృదయములోను సర్వజనుల హృదయములలోను నన్ను పూజింపుడు". అని అన్నారు. ఇది నిరూపించుటకే శ్రీసాయి తన భక్తుడైన చోల్కర్ అను భక్తుడు తనకు స్థిరమైన ఉద్యోగము కావలెనని శ్రీసాయిని మనస్ఫూర్తిగా భక్తితో చేతులు చాపి ఠాణాలో మ్రొక్కగా శిరిడీలో ఉన్న శ్రీసాయి తన భక్తుని భక్తివిశ్వాసములను మరియు ఆర్తితో చాపిన తన భక్తుని చేతులను చూచి ఆశీర్వదింపగ ఆ భక్తునికి తగిన స్థిరమైన ఉద్యోగము లభించెను. ఇందులో తెలుసుకోవలసినది సాయి సప్తసముద్రముల ఆవలన ఉన్నప్పటికీ ఆ సప్తసముద్రములకు ఈవల ఉన్నసాయి భక్తులెవరైనను ఆర్తితో సాయిని స్మరియించి చేతులు చాపి అర్థించినయెడల శ్రీసాయి వెంటనే సప్తసముద్రముల ఆవలనుండి ఈవలనున్న ఆ భక్తుని చెంతకు వచ్చి నిరాకారముతో నిశ్శబ్దముగా రాత్రింబవళ్లు తన భక్తులను కాపుకాచి నిద్రలేకుండా కాపాడుననే సత్యము తెలిసినది. **నాకు తెలిసిన సాయి** ఎవరోకాదు. తన భక్తునికోసం ప్రపంచమున ఎక్కడనున్నను ఎంతమంది భక్తులైనను అనగా అసంఖ్యాకులైన భక్తులైనను శ్రీసాయి తన అనంతశక్తి ద్వారా ప్రపంచములో వేర్వేరు ప్రాంతములలో ఉన్న భక్తులయింట రాత్రింబవళ్లు తన భక్తుడు నిదురవేళలో శ్రీసాయిని మరచి నిద్రించినను సాయి మాత్రం తన భక్తునికోసం నిదురపోక రాత్రింబవళ్లు ప్రపంచమునంతా తనను నమ్ముకున్న భక్తులయింట వారు ఎక్కడున్నను తెలియకుండా కనిపించకుండా ఉండే ఆ అనంతశక్తేయే **నాకు తెలిసిన సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు - 16 & 17

శ్రీసాయి సజీవముగా ఉన్నప్పుడు మసీదులో ఈవిధముగా అన్నారు. " నా ఖజానా నిండుగాయున్నది. ఎవరికేమి కావలసినా దానిని వారికి ఇవ్వగలను. కాని పుచ్చుకొను యోగ్యత పరిశీలించెదను". సాయికి తన వద్దకు వచ్చిన వారికి బ్రహ్మజ్ఞానమును కూడా యివ్వగల శక్తి కలదు.

కాని బ్రహ్మజ్ఞానమును చూచుటకు యోగ్యత కలదో లేదో అని సాయి పరీక్షించేవారు. ఒకసారి ఒకతను సాయివద్దకు వచ్చి బ్రహ్మజ్ఞానమును ప్రసాదింపమని వేడుకొనగా సాయి బ్రహ్మమును చూచుటకు ముఖ్యమైన విషయములను ఈక్రింది విధముగా చెప్పెను.

- బ్రహ్మమును చూచుటకు పంచప్రాణములు, పంచేద్రియములు, మనస్సు, బుద్ధి మరియు అహంకారములను సమర్పింపవలెను.
- సుఖములను లక్ష్యపెట్టరాదు.
- కీర్తివిషయములందు అనాసక్తుడై మెలగవలెను.
- దృష్టిని లోనికి పంపి లోనున్న ఆత్మనే ధ్యానింపవలెను.
- తప్పుడుమార్గము వదలవలెను.
- సత్యములు పలుకవలెను.
- వేదాంతవిషయములు ఎంచుకోవలెను.
- మనస్సును చంచలము కానివ్వక జాగ్రత్త పడవలెను. అనగా మనస్సును స్వాధీనమునందుంచుకొనవలెను.
- విధులను తృప్తిగా ఫలాపేక్షరహితముగా నిర్వర్తింపవలెను.
- అహంకారమును విడువవలెను.
- మనస్సు కోరికలను విడిచిపెట్టి దేహమే నేనను భ్రమను కూడా వదలవలెను. లేనిఎడల బంధములో చిక్కుకొనవలసి వచ్చును.
- ఆత్మసాక్షాత్కారము పొందిన గురువు సహాయము యిందులకు చాలా అవసరము.
- భగవంతుని కటాక్షము ఎంతో అవసరము.

శ్రీసాయి బ్రహ్మజ్ఞానము లేదా ఆత్మసాక్షాత్కారము లేదా బ్రహ్మముచూపుట అనేవాటిని సూక్ష్మముగా బోధించి రహస్యమును తెలిపి ఎవరైతేపైన చెప్పిన విధముగా తన నిత్యజీవితములో ఉందురో వారికి ఆత్మసాక్షాత్కారము పొందుటకు సహాయపడును. శ్రీసాయి చెప్పిన పలుకులలో " నా ఖజానా నిండుగాయున్నది. ఎవరికేసి కావలసిన దానిని వారికి ఇవ్వగలను. కాని పుచ్చుకొను యోగ్యత పరిశీలించెదను". అన్నవిషయములో చివరకు బ్రహ్మజ్ఞానము కూడా శ్రీసాయి యివ్వగలరని కానీ దానిని పుచ్చుకొనుటకు యోగ్యతను శ్రీసాయి పరిశీలించెదనని చెప్పెను. కావున శ్రీసాయిఖజానాలో

ఎన్నోరకాలైనవి ఉన్నప్పటికీ భక్తులు ఐహిక సుఖములకై వస్తువులను, కోరికలను కోరక బ్రహ్మజ్ఞానమును ప్రసాదింపమని కోరవలెను. కానీ ఆ కోరిక కోరుటకు శ్రీసాయి పైన చెప్పిన పదమూడు విషయాలను గ్రహించుటయేకాక ఆ విధముగా కోరినవాడు ఆ 13 విషయాల గుణములను కలిగి అర్హుడై శ్రీసాయిని భక్తి,ప్రేమ మరియు విశ్వాసములతో చేతులు చాచి అర్థించిన యెడల శ్రీసాయి వారికి తప్పక ఆత్మసాక్షాత్కారము లేదా బ్రహ్మజ్ఞానమును లేదా బ్రహ్మమును చూపును. ఈవిధముగా చూపుటకు సాయి భౌతికరూపము దాల్చనవసరములేదు. ఎవరైతే బ్రహ్మజ్ఞానమునకు అర్హులో వారి చెంతకు సాయి నిర్గుణరూపములో వచ్చి నిశ్శబ్దముతో ఆ భక్తునికి ఆత్మసాక్షాత్కారము కలుగచేయును. ఆత్మసాక్షాత్కారము అంటే ఆత్మ సాక్షాత్కరించుట అని అర్థముగాదు. ఆత్మ అనేది క్రొత్తగా వచ్చి సాక్షాత్కరించదు. ఆత్మ అనేది ఎప్పుడూ ఉన్నదే. సనాతనమైనదే. ఎవరైతే శ్రీసాయి చెప్పిన 13 విషయములను గ్రహించి అర్హతలను పొందెదరో ఎప్పుడూ ఉన్న ఆత్మ వారికి ఎరుకలోనికి వచ్చును. ఆ ఆత్మయే శ్రీసాయి అని తనలోనే ఉంటూ సర్వము చేస్తూ అంతర్యామిగా మరియు సర్వాంతర్యామిగా వెలుగుచూపే అనంతశక్తి అని తెలుసుకొనగలరు. కావున **నాకు తెలిసిన సాయి** ఎవరో కాదు. సాక్షాత్ ఆత్మయే. ప్రతీజీవిలో ఉంటూ ప్రతీక్షణము లోన, బయట కనబడే ఆ అనంత దివ్యశక్తియే ఆ సాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు - 18 & 19

శ్రీసాయి రాధాబాయి అనే ఒక ముసలావిడతో ఒకసారి ఓ రహస్యం చెప్పవలసి వచ్చినది. ఆమె సాయిని తనకు ఏదైనా ఉపదేశము చేయమని, అలా చేయనిచో తాను ఉపవశించి చనిపోయెదననే మనోనిశ్చయముతో సాయివద్దకు వచ్చి అభ్యర్థించింది. " ఓ తల్లీ ! నీవు చావును ఏల కోరుచున్నావు ? నాకు ఒక గురువు ఉండిరి. వారికి శుశ్రూష చేసితిని . నా చెవిలో వారెలాంటి మంత్రము ఊదలేదు. వారి వద్ద కొన్ని ఉపదేశములను గ్రహించుటకు నిశ్చయించుకొంటిని. కాని వారి మార్గము వారిదే. వారు కోరినది నానుండి రెండే రెండు పైసలు మాత్రమే. అవి 1.నిష్ఠ 2. సంతోషస్థైర్యములతో కూడిన ఓరిమి. నేనీ రెంటిని వారి కర్పించితిని. 12 సంవత్సరములు వారికి సేవ చేసితిని. వారే నన్ను పెంచి, పోషించి, భోజనమునకు గాని వస్త్రమునకు గాని లోటులేక చూచినారు. " అని శ్రీసాయి రాధాబాయికి సెలవిచ్చారు.

సాఠే అను సాయిభక్తుడు 7 రోజులలో శ్రీ గురుచరిత్ర పారాయణను ముగించిన పిదప శ్రీసాయి మరియొక సప్తాహపారాయణను సాఠే చేసినచో భగవంతుడు ప్రీతిచెంది ప్రపంచబంధములనుండి అతనిని తప్పించుననెను. అక్కడేనున్న హేమాడ్ పంత్ తన మనసులో తాను 7 సంవత్సరములనుంచి అక్కడే ఉండెనని 40 సంవత్సరములనుండి తాను పారాయణముచేయుచున్నాడని అటువంటి వానిని వదలి శ్రీ సాయి సాఠే యొక్క మరొక సప్తాహపారాయణము వలన భగవంతుడు ఎట్లు ప్రీతిచెంది ఆశీర్వదించునని ప్రశ్నించుకొనెను. శ్రీసాయి సాఠే అంతరార్థము గ్రహించి అతనిని శ్యామా వద్దకు పంపినపుడు శ్యామా రాధాబాయి వృత్తాంతము (పైన చెప్పబడినది) గురించి హేమాడ్ పంత్ కు చెప్పను. హేమాడ్ పంత్ ఆశ్చర్యపడెను.

శ్రీసాయి పలికిన జ్ఞానరత్నములలో ముఖ్యముగా ఏ సాధకుడైనను గ్రహించవలసినదేమనగా ఏ మంత్రములకొరకు గురువులకడకు ఆశించి వెళ్లకూడదని, తాను నమ్ముకున్న గురువుకు మంత్రం దక్షిణరూపంగా రెండుపైసలనడుగగా నిష్ఠ మరియు సంతోషస్థైర్యములతో కూడిని ఓరిములను అర్పించినచో గురువే సాధకుని పెంచి పోషించి అన్నవస్త్రములకు లోటులేకుండా ప్రేమతో చూచుననే రహస్యమును శ్రీసాయి దాచకుండా బయట పెట్టిరి. దీనికి ఉదాహరణయే సాఠే కథ. సాఠే గురుచరిత్రపారాయణ యందు గొప్ప మనోబలము కలిగి ఉన్న వాడగుటచే 7 రోజులలో పూర్తిచేసెను. గురుచరిత్రను వేరొక సప్తాహపారాయణ చేయాలని, అట్లుచేసినచో భగవంతుడు ప్రీతిచెంది ప్రపంచ బంధములనుండి తప్పించునని శ్రీసాయి సాఠేకి చెప్పిరి. అక్కడే ఉన్న హేమాడ్ పంత్ తాను 42 సంవత్సరములనుండి పారాయణను చేయుచున్నానని దానికి ఫలితము లేదు కావున సాఠేకు ఎట్లు లభించునని ఆ క్షణమున తాను నిష్ఠ మరియు ఓరిములను కోల్పోవుటచే తన భక్తుడైన హేమాడ్ పంత్ తిరిగి నిష్ఠ మరియు సాబూరిల యొక్క ప్రాధాన్యతను తెలుపుటకై శ్రీసాయి శ్యామా వద్దకు పంపెను. శ్యామా చెప్పిన రాధాబాయి కథ వలన హేమాడ్ పంత్ తిరిగి నిష్ఠ సాబూరీలను పొందెను.

దీనిని బట్టి **నాకు తెలిసిన సాయి** మరెవరో కాదు. ఎవరైతే ఏ మంత్రము లేదా ఉపదేశములనాశించక రెండు కాసులను అందు ఒకటి నిష్ట రెండవది ఓరిమి, భక్తి, శ్రద్ధ మరియు విశ్వాసములతో శ్రీసాయికి అర్పించిన శ్రీసాయి నిరాకార రూపములో నిశ్శబ్దముగా తనకు అర్పించిన దక్షిణనిచ్చిన భక్తునివెంట నిరంతరము ఉంటూ ఆ భక్తుని ఆలనపాలనలను ఏలోటూ లేకుండా

చూచుకుంటూఉంటాడు. **నాకు తెలిసిన సాయి** ఎవరంటే నిష్ఠమరియు ఓరిమిని ప్రేమించేవాడని, ఆప్రేమకు లోనై అర్పించినవారికి సాయి సర్వము సమర్పించే వాడే ఆ సాయి.

శ్రీసాయి మరియొక సందర్భములో ఇట్లనిరి. "ఇతరులు నిన్నెంతగా నిందించినను, నీవు కఠినముగా జవాబు ఇవ్వక ప్రపంచము తలక్రిందులైనను నీవు చలింపక నీవున్నచోటనే స్థైర్యముగా నిలిచి నెమ్మదిగా నీముందు జరుగుచున్న నాటకమును చూడుము. నీకు నాకు మధ్యనున్న గోడను నిర్మూలింపుము. మనమిద్దరము కలియు మార్గమేర్పడును. భగవంతుడే మనలను కాపాడేవారు కాని ఇతరులు కారు. వారి ఇఛ్ఛానుసారమే మనము నడచెదము." శ్రీసాయి నశ్వరమైన దేహము కనిపించకపయినను సాయి మాత్రము ఇప్పటికి అనంతశక్తివలె నిలిచి వారు సమాధి చెందకముందు భక్తులకు తోడ్పడినట్లే ఈనాటికి కూడా సాయి తన భక్తులను నిశ్శబ్దముగా సహాయపడుచున్నారు. వారు అన్ని పరిమితులకు అతీతులు. మనందరి ఎరుకలో నిలిచినది మాత్రము వారి అనంత తత్వమే. అటువంటి అనంతతత్వములోని ముఖ్యమైన తత్వమే పైన చెప్పబడినది. **నాకు తెలిసిన సాయి** మరెవరోకాదు. ఎవరైనా మనలను నిందిచినపుడు కఠినపు జవాబులివ్వక ఓర్చుకుని మనమున్నచోటనే స్థైర్యముగా చలించకుండా నిలిచి మనముందు జరుగుచున్న నాటకమును గమనించి మన ఎరుకలో నిలిచియున్న శ్రీసాయి అనంతతత్వమును గుర్తుచేసుకుని మనముందు అడ్డుగోడ కలదని ఆ గోడకవతల శ్రీసాయి కలడని గ్రహించి ఆ గోడను నిర్మూలించుటకు ప్రయత్నించినచో ఆ జరిగే నాటకములో మనతో శ్రీసాయి కలసి రక్షించును. అట్లు రక్షించేవారే ఆ సాయి. వారు ఆ సమయమున కనిపించరు. కాని శ్రీసాయి అనంతశక్తి. వారినాశ్రయించిన భక్తులకు మాత్రం ఆ సాయి నిశ్శబ్దముగా సహాయపడుతూ ఉన్నారు.

నాకు తెలిసిన సాయి వారే.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము - 20

శ్రీసాయి ఇట్లనెను. "సదా నా నిరాకార స్వభావమును ధ్యానించుము. అదియే జ్ఞాన స్వరూపము, చైతన్యము మరియు ఆనందము. నీవిది చేయలేనిచో రాత్రింబవళ్లు నీవు చూచుచున్న నా యీ ఆకారమును ధ్యానింపుము." శ్రీసాయిబాబా స్వయముగా వారు నిరాకారమనే చెప్పారు. ఎక్కువ భాగము అందరి ఎరుకలో సదా నిలిచినది శ్రీసాయి అనంత తత్వమే. తత్వము అంటే

స్వభావము లేదా తత్వజ్ఞానము. ఈ రెండు కోణములలో ఎటు చూచినా సాయి చెప్పినట్లుగా వారి నిరాకార స్వభావము కనిపించును. ఇవియే జ్ఞానరత్నములు ప్రతీవారికీ. ఎవరైతే నిరాకార స్వభావమును ధ్యానింపలేరో వారికి సాక్షాత్తు శ్రీసాయిబాబా చెప్పినట్లుగా అటువంటి వారికి మరియు అటువంటివారు చూచుచున్న "సాయి" అనే ఆకారమును ధ్యానింపమనెను. కావున **నాకు తెలిసిన సాయి** మరెవరోకాదు. సాక్షాత్తువారి నిరాకారస్వభావమే.

అటువంటి నిరాకార స్వభావము గుర్తించుటకు మరియొక సంఘటన విలేపార్లేలో జరిగినది. దాసగణు (సాయి ముఖ్య భక్తుడు) ఈశావాశ్యోపనిషత్తు మరాఠీ భాషలో వ్రాసిరి. కానీ అతను తృప్తి చెందలేదు. ఆ విషయమును శ్రీసాయికి చెప్పినపుడు బాబా ఇట్లనిరి. "విలే పార్లేలోని కాకా సాహెబ్ దీక్షిత్ పనిపిల్ల నీ సందేహమును తీర్చును." దాసగణు శ్రీసాయి మాటలను విశ్వసించి విలేపార్లే వెళ్లి కాకాసాహెబ్ దీక్షిత్ ఇంటనున్న ఒకబీద పనిపిల్లను చూచెను. ఆమె చింకిగుడ్డ కట్టుకుని పాత్రలు తోముచు ఆనందముతో ఎర్రచీర వర్ణనము చెప్పు పాటను పాడుచుండెను. దాసగణు ఆ పనిపిల్లను చూచి ముచ్చటపడి ఒక క్రొత్తచీరను రావుబహద్దూర్ తో ఇప్పించెను. మరునాడు ఆమె ఆ చీరను కట్టుకుని అందరితో ఆడి పెట్టెలో దాచుకొనెను. తిరిగి చింకి బట్టను కట్టుకుని యథావిధముగా ఆనందముతో ఉండెను. ఈ ఘటన చూచిన దాసగణు కష్టసుఖములనే భావములు మన మనోవైఖరిపై ఆధారపడి ఉండునని భగవంతుడిచ్చిన దానితో సంతసించవలెనని గ్రహించెను. ఈశావ్యాసోపనిషత్ మరాఠీభాషలో వ్రాయుటకు భగవంతుడే అనుమతి ఇచ్చెను కావున ఇచ్చిన దానికి సంతృప్తి చెందవలెనని రాసిన దానితో తృప్తి పడవలెననే నీతిని విలేపార్లే లోని ఆ చిన్న పనిపిల్ల సంఘటన ద్వారా గ్రహించెను. కావున **నాకు తెలిసిన సాయి** మరెవరో కారు. ఎవరైతే కష్టసుఖములను భావములు మన మనోవైఖరిపై ఆధారపడియుండునని మరియు భగవంతుడిచ్చిన దానితో సంతసించవలెనని అది మనమేలు కొరకేనని గ్రహించువారికి శ్రీసాయి నిశ్శబ్దముగా నిరాకారుడై వారివద్దకు వచ్చి జ్ఞానరత్నమునిచ్చే వాడే ఆ సాయి. దాసగణుని శ్రీసాయి విలేపార్లే పంపించి సాయి మటుకు శిరిడీలోనే ఉండి ఒక చిన్న పనిపిల్లస్వభావము చూపి సాయి నిశ్శబ్దముగనే ఉండి దాసగణుకి జ్ఞానమును బోధించెను. శ్రీసాయి స్వభావము ఎక్కడో ఉండి మరెక్కడో జరిగే విషయమున సాయి స్వభావముచూపెను.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము - 21

శ్రీసాయి యొక్క అనంత తత్వములో ముఖ్యమైనవి 3 కలవు. శ్రీసాయి ఇట్లనెను.

1. "ఊరకనే గ్రంథములు చదువుట వలన ప్రయోజనము లేదు. చదివిన విషయములు విచారించి ఆచరణలో పెట్టవలెను. గుర్వనుగ్రహము లేని పుస్తక జ్ఞానము నిష్ప్రయోజనము.
2. భగవంతుని అనుగ్రహము సంపాదించే నవవిధ భక్తులను తెలుసుకుని వాటిలో ఏదైనా ఒక మార్గమును మనస్ఫూర్తిగా అనుసరించిన ఎడల భగవంతుడు సంతృప్తి చెంది ఆ భక్తుని గృహమందు ప్రత్యక్షమగును. నవవిధ భక్తులు మరేవో కాదు. క) శ్రవణము ఖ) కీర్తనము గ) స్మరణము ఘ) పాదసేవనము జ+) అర్చనము చ) నమస్కారము ఛ) దాస్యము జ) సఖ్యత్వము ఝ) ఆత్మనివేదనము.
3. ఎవరినీ నిందించకూడదు. తృణీకరించరాదు మరియు ఇతరుల విషయములలో జోక్యము చేసుకోరాదు. "

పైన చెప్పబడిన అద్భుతమైన తత్వమును బట్టి **నాకు తెలిసిన సాయి** మరెవరో కారు. ఎవరైతే గ్రంథములను చదివి విచారించి ఆచరణలో పెట్టెదరో మరియు అట్టి పవిత్రగ్రంథములను మొదట గుర్వనుగ్రహముతో పొందెదరో (అనగా పారాయణమునకు మొదట గురువును తలచి అనుమతిని తీసుకుని చదువుట ప్రారంభించవలెను) అట్టివారికి సాయి నిశ్శబ్దముతో నిరాకారుడై పారాయణము చేసిన భక్తుల ఎదుట కనిపించకుండా ఆసీనుడై భక్తుడు చదివినదంతా విని ఆ భక్తునికి అర్థమయ్యేటట్లు ప్రసాదించువారే ఆ జ్ఞానసాయి. అలాగే ఎవరైతే నవవిధ భక్తులలో ఏదో ఒకమార్గమునైనను హృదయపూర్వకముగా అనుసరించిన భక్తుని ఇంట శ్రీసాయి సంతుష్టి చెంది కనిపించకుండా ఆ ఇంటనుంటూ ఆయింటిలో తిరిగేవాడే **నాకు తెలిసిన ఆ సాయి.** అలాగే ఎవరైతే ఎవరినీ నిందించకుండా తృణీకరించకుండా మరియు ఇతరుల విషయములలో జోక్యము కలుగ చేసుకోకుండా ఉంటూ ఉండేవారి వద్దకు శ్రీసాయి నిశ్శబ్దముతో నిరాకారుడై వచ్చి తన భక్తుని మౌనమును గ్రహించి ముగ్ధుడై సదా అతని వెంటఉండే ఆ గుప్తసాయే **నాకు తెలిసిన శ్రీసాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 22, 23

శ్రీసాయి మహారాష్ట్రమునందున్న శిరిడీలో మాత్రమే ఉన్నారని వారి నశ్వరమైన దేహము 1918 వ సంవత్సరమున వదలినారని ఎన్నడు అనుకోరాదు. వారు తన నశ్వరమైన దేహము మాయమైపోయినప్పటికీ శ్రీసాయి మాత్రము ఈనాటికికూడా అనంతశక్తి వలె నిలిచి 1918 సంవత్సరమునకు ముందు తమ భక్తులకు ఎట్లు తోడ్పడినారో వారు సమాధి చెందిన పిదపకూడా అసంఖ్యాక భక్తులకు శ్రీసాయి నిశ్శబ్దముగా నిరాకారుడై సహాయము చేయుచునేయున్నారు. మరి కనబడుటలేదుకదా అని ఎవ్వరూ ప్రశ్నించుకోరాదు. ఆకలి వేస్తే తినాలని ఎలా అనిపిస్తుందో అలాగే నిరంతరము ప్రతిజీవి పంచభూతములలో ఒకటైన గాలిని పీల్చుకుని బ్రతుకుచున్నాడు. ఒక్కసారి ఆలోచిస్తే మరి ఆకలి మరియు గాలి కనబడుచున్నవా లేదు మన ఎరుకలో అవి మాత్రం నిలిచిఉన్నవి. అలాగే ఎక్కువభాగం మన ఎరుకలో నిలిచినవి మాత్రం శ్రీసాయినాధుని అనంత తత్వమే.

శ్రీ సాయి ఇట్లనినారు. "నా ప్రకాశమును చూడవలెననంటే అహంకారమును విడిచి మిక్కిలి అణకువతో చూపుడు వ్రేలుకు మధ్యవ్రేలుకు మధ్యనున్న బొటనవ్రేలిపై దృష్టిని ఉంచినచో నా ప్రకాశమును చూడగలరు". అశాశ్వతమైన సాయియొక్క దేహము మాయమైనప్పటికీ శ్రీసాయి అనే శాశ్వతమైన అనంత శక్తి మాత్రము నిలిచియున్నదని తెలిసికొంటిమి. ఇది ఋజువు అగుటకు శ్రీసాయి చెప్పినట్లుగా సాయి ప్రకాశమును లేదా అనంతశక్తిని చూడవలెనంటే అహంకారమును విడువవలెను. ఎంతో అణకువతో సాయియొక్క చూపుడువ్రేలుకు మధ్య వ్రేలుకు మధ్యనున్న బొటనవ్రేలుపై దృష్టినిఉంచినచో శ్రీ,సాయి ప్రకాశమును చూడగలము. ఆ ప్రకాశమే అనిర్వచనీయమైన అనంతశక్తి. **నాకు తెలిసిన సాయి** శిరిడీలో మాత్రమే బండరాయిపై కూర్చుని ఉన్నవారే కాకుండా చివరకు సాయి కూర్చుని ఉన్న చిత్రపటములో ఎవరైతే సాయి కూర్చునే విధానమును గమనించి అహంకారమును విడిచి మిక్కిలి అణకువతో సాయి చెప్పినట్లుగా చూపుడువ్రేలుకు, మధ్యవ్రేలుకు మధ్యనున్న బొటనవ్రేలిపై దృష్టిని ఉంచిన ప్రకాశమును ఈనాటికి కూడా ఎక్కడ ఉన్నను చూడగలము. అట్టి కనిపించేప్రకాశమే **నాకు తెలిసిన శ్రీ సాయి.**

శ్రీ,సాయి దీర్ఘమౌనము పాటించేవారు. కానీ అదివారి బ్రహ్మబోధయే సందర్భానుసారముగా వారి ప్రబోధములు మనశక్తికి అందుబాటులో దొరకక కొద్దిగా ఆలోచించినచో లోతుగా వెళ్లినచో సాయి ప్రబోధములు అనేక విధములుగా అనేకమందికి కలుగుచుండును.

సాయి భగవంతుడైనప్పటికీ వారు భగవంతుని సేవకుడనని చెప్పేవారు. తనకొరకేమైనా చేయమని ఎన్నడు ఇతరులను కోరేవారు కాదు. ఎవ్వరినీ అనాదరించుట మరియు అవమాన

పరచుట వారు ఎరుగరు. నిరంతరం భగవంతుడే సర్వాధికారి అని అనేవారు. ఎవరైతే అనుక్షణం సాయి చూపిన నిరాడంబర తత్వము మరియు సహజత్వము గ్రహించెదరో శ్రీసాయి నిరాకారుడై నిశ్శబ్దముగా శ్రీసాయిని విశ్వసించిన వారి చెంత నిత్యము ఉండును. వారే **నాకు తెలిసిన శ్రీ సాయి.**

కాకాసాహెబ్ దీక్షిత్ ఒకసారి శ్రీ,సాయితో ఇట్లనెను. నీ అమృతము వంటి పలుకే మాకు చట్టము. మాకింకొక చట్టము ఏమియు తెలియదు. నిన్నే జ్ఞప్తియందుంచుకొనెదము. నీ ఆజ్ఞను పాటింతుము. అది విచారించము. కాకాసాహెబ్ దీక్షిత్ బ్రాహ్మణుడైనప్పటికి గురుభక్తిని పరీక్షించుటకై శ్రీసాయి ఒకమేకను నరకమని ఆజ్ఞాపించినపుడు కాకాసాహెబ్ దీక్షిత్ నరుకుటకు సిద్ధపడెను. శ్రీసాయి తిరిగి దీక్షిత్ ని బ్రాహ్మణుడై ఎట్లు మేకను నరికెదవని అన్నపుడు కాకాసాహెబ్ దీక్షిత్ పలికిన మాటలు పైన చెప్పబడినవి. ఆ పలుకులు ఆ సందర్భమునకే కాక ఆ పలుకులను భవిష్యత్తులో ప్రతీసాయిభక్తుడు ఆచరించేటట్లుగా శ్రీసాయి కాకాసాహెబ్ దీక్షిత్ నోటివెంట సాయి ప్రేరణ వల్ల జారిన పలుకులివి. ప్రతిసాయి భక్తుడు శ్రీసాయి పలికిన అమృతతుల్యమైన ఎన్నెన్నో పలుకులను జ్ఞప్తియందుంచుకొని ఆ సాయిపలుకులే చట్టముగా భావించి సాయి ఆజ్ఞలను పాటిస్తూ విచారించక ముందుకు సాగినచో శ్రీసాయి అటువంటి బద్ధునికి నిశ్శబ్దముగా నిరాకారుడై వారివెంట ఉంటూ సర్వకార్యములనూ సఫలీకృతము చేస్తూ సాదా వారి వెంటనే ఉంటారు. **నాకు తెలిసిన ఆ సాయి** సాయి పలికిన అమృతతుల్యమైన పలుకుల చట్టమే.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 24, 25

శ్రీసాయి హేమాడ్ పంత్ తో పలికిన పలుకులివి. " నీవు తినుటకు ముందు నన్ను స్మరింతువా? నేనెల్లప్పుడు నీ చెంతలేనా **? నీవేదైనా తినుటకు ముందు నాకు అర్పించుచున్నావా ? "** ఏ కార్యము నైనా ప్రారంభించుటకు ముందు సాయిని స్మరింపవలెను. విషయములను మొదట సాయికి అర్పించినచో ఆ విషయములో గల అభిమానము దూరమగును. కామము,క్రోధము,లోభము వంటి ఆలోచనలను సాయికి అర్పింపవలెను. అట్లుచేసినచో శ్రీసాయి ఆ ఆలోచనలను నిర్మూలనమగుటకు సహకరించును. కావున సాయి ఎల్లప్పుడు మనచెంతనే

ఉన్నట్లు భావించి ఆ విషయములను అనుభవించు ముందు మన వద్దనే ఉన్న సాయితో ఆ వస్తువు అనుభవించవలెనా ? లేదా ? అని ప్రశ్నించుకొనవలెను. శ్రీసాయి అప్పుడు ఏది అనుభవించుటకు తగతో దానిని ప్రక్కకు త్రోసివేయును. శిరిడీలో శ్రీసాయి మసీదులో ఎంతోమంది జనులకు ప్రతినిత్యము వారే స్వయముగా స్వయంపాకము చేసి వారి దివ్య హస్తములతో వచ్చిన జనులకు వారే స్వయముగా వారు సజీవముగా ఉన్నపుడు వడ్డించినారనే విషయము అందరకూ తెలిసినదే. శ్రీసాయి జనన మరణాలకు అతీతులు. కావుననే శ్రీసాయి నేనెల్లప్పుడు నీ చెంత లేనా అని ? అన్నారు. **నాకు తెలిసిన ఆ సాయి** మరెవరో కాదు. ఎవరైతే తినుటకు ముందు శ్రీసాయి వారిచెంతనే ఉన్నట్లు భావించి శ్రీసాయిని స్మరించి ఆ తినేపదార్థాలను శ్రీసాయికి సమర్పించుచున్నారో అట్టివారి భక్తి, ప్రేమ మరియు విశ్వాసములు స్వీకరించిన ఆ సాయి నిరాకారుడై నిశ్శబ్దముగా భక్తుడు అర్పించిన పదార్థములను ఎంగిలిచేయుచున్నాడు. అట్టి కనబడని ఆ అనంతశక్తి మరియు అనంతతత్వమే **నాకు తెలిసిన ఆ సాయి.**

సాయిని స్మరించనిదే ఏ వస్తువును కూడా పంచేంద్రియములతో అనుభవించరాదని మన మనస్సును ఆ విధముగా అలవాటు పరచినచో శ్రీసాయిని నిరంతరము జ్ఞప్తియందుంచుకొనెదము.

అట్లు సాయిని మనస్సునందు నిలుపుకునే వారికి ఆకలిదప్పులు ఎక్కడ. ఇక సంసారబాధలు కూడా ఎక్కడ. అన్నీ మరచిపోయి ఆనందముతో ఉంటారు. **నాకు తెలిసిన ఆ సాయి** ఎవరైతే సాయిని స్మరించి పిదప తన పంచేంద్రియములతో అనుభవించుచున్నాడో అట్టి మనస్కుడు తన మనసును ఆ విధముగా మరల్చుకొని సాయినే జ్ఞప్తియందుంచుకొనినాడో అట్టివాని మనస్సే **నాకు తెలిసిన ఆ సాయి.**

భగవంతుడిచ్చిన దానితో సంతుష్టి చెందక ఆకాశమున ఎగుర ప్రయత్నించకు. తనకున్న సగము రొట్టెతో సంతుష్టి చెంది లక్షలార్జించుటకు ఆయాస పడవద్దు. అని శ్రీసాయి దామూఅన్న అనే భక్తుడు జట్టీ వ్యాపారము చేయవచ్చునా లేదా అని ఉత్తరము వ్రాయగా శ్రీసాయి ఆ ఉత్తరమును చదవకముందే శ్యామాతో పలికిన పలుకులు. అత్యాశ ఎప్పటికీ పనికిరాదని భగవంతుడచ్చిన దానికి సంతృప్తి పడవలెనని అసలు రొట్టెయే దొరకని ఇంట భగవంతుని కృపచే సగము రొట్టె దొరికినపుడు సంతృప్తి చెందవలెనని ప్రతిఒక్కరు నేర్చుకోవలసినదిగా తెలియటమైనది. **నాకు తెలిసిన ఆ సాయి** ఏ ఇంట భగవంతుడిచ్చిన దానితో సంతుష్టి చెందే కుటుంబీకులు కలరో, ఏ ఇంట వారికున్న లేదా దొరుకుచున్న సగము రొట్టెతో తృప్తి పడుచున్నారో ఏ ఇంట లక్షలార్జించుటకు ఆలోచనలను ఆలోచించచకున్నారో అటువంటివారి గృహములందు శ్రీసాయి నిరాకారుడై నిశ్శబ్దముతో వారికి ఏ లోటు లేకుండా అన్నపూర్ణ వలె తెలియకుండా కాపాడుచున్నారు ఆ అన్నపూర్ణయే **నాకు తెలిసిన ఆ సాయి.**

చావు అనునది అహంకారము. దానిని సాయిముందు చంపుట ఒక ఆశీర్వాదమే. మరణము ఆత్మకు లేదని ఆత్మ అగ్నిలో కాలేది కాదని, నీటితో తడవదని, గాలికి బెదరదని భగవద్గీత చెప్తోంది. కావున ప్రతీజీవి తనకు ముందు రానున్న మరణాన్ని గురించి భయపడవలసిన అవసరంలేదు. ఎందుకంటే ఆత్మ శాశ్వతమైనది. ఒక్క శరీరమే అశాశ్వతము. మరి చావు అనునది దేనికి ? అశాశ్వతమైన శరీరమే తాను అనుకొనినపుడు అహంకారము తాండవించును. ఎవరైతే అట్టి అహంకారమును గుర్తించి శ్రీసాయి ముందు అనగా శ్రీసాయి పాదముల వద్ద వారి అహంకారమును సమర్పించుకొనినయెడల అట్టి అహంకారము చచ్చినట్లే. చావు అనునది ఆ అహంకారమునకే. ఎప్పుడైతే అహంకారమును శ్రీసాయి పాదపద్మముల వద్ద వదలినామో ఇక ఆ వదలిన వారికి శరీరధ్యాస పోయి

ఆత్మజ్ఞానము కలుగును. **నాకు తెలిసిన సాయి** ఎవరైతే శ్రీసాయి పాదపద్మములను శరణువేడి తమ అహంకారమును వదులుకొనెదరో, అలా చంపుకొనెదరో అట్టి అహంకార రహితులకు శ్రీసాయి నిశ్శబ్దముగా నిరాకారునిగా అంత ప్రకాశముతో శక్తితో ఆ అహంకార రహితుని తనలో ఐక్యముచేసుకొనును. అనగా అహంకార పూరితుడుగా ఉన్నవాడు తన శరీరమే నేను అని అనుభవించువాడు ఎప్పుడైతే అట్లు శరీరమే నేను అనుకున్నాడో వాడే జీవాత్మ. అట్టివాడు తన అహంకారమును సాయి దివ్య చరణములవద్ద చంపుకుని అహంకారరహితుడై తాను శరీరముకాదని గ్రహించినవాడే ఆత్మే సత్యము-మిగతాదంతా అసత్యమని గ్రహించగనే ఆ జీవాత్మ పరమాత్మలో కలసి ఏకత్వమైన పరమాత్మగనే అంతా గోచరిస్తుంది. అప్పుడిక అంతా పరమాత్మయే. అనంత శక్తియే. అనంత ప్రజ్వలమే. అట్టి అనంత తత్వమే **నాకు తెలిసిన శ్రీ సాయి.** "ఎక్కడైనను, ఎప్పుడైనను నా గురించి చింతించినపుడు నేనక్కడనే యుండెదను సమాధిచెందినప్పటికి నా సమాధిలోనుండి నా ఎముకలు మాట్లాడును మనఃపూర్వకముగా నన్ను శరణుజొచ్చిన వారితో నా సమాధికూడా మాట్లాడును వారి వెన్నంటి కదులును." అని శ్రీసాయి వారు సజీవముగా ఉన్నప్పుడు ఆయనను నమ్ముకున్న భక్తులందరికీ సాయి ఇచ్చిన వాగ్దానము. వారు అన్నమాటలలో వారు శరీరులు కారని అశరీరులని నిరూపించబడినది. ఎవరికైతే విశ్వాసము కలిగి మనఃపూర్వకముగా సాయిని శరణుకోరినచో సాయి సమాధిలోనుండి జవాబు ఇచ్చునని, వారివెంట నుండెదనని చెప్పినారు. సాయి ఒక అనంతశక్తి అని అనంత తత్వమని ఎన్నోసార్లు శ్రీసాయి సజీవముగా ఉన్నపుడు ఎన్నో బోధలలో సూచిస్తూనేయున్నారు. **నాకు తెలిసిన ఆ సాయి** మరెవరోకారు. వారు సమాధి చెందినప్పటికీ ఏ భక్తుడైతే విశ్వాసముతో మనఃపూర్వకముగా సాయిని శరణువేడుచున్నారో అట్టి వారితో శ్రీసాయి సమాధి నుండి జవాబిస్తూ అనుభూతులను కలుగచేస్తూ అట్టి భక్తుల మనసులోనే తళుక్కుమనే తమ ప్రశ్నలకు జవాబులు ఇస్తూ వారి వెన్నంటి కదిలే ఆ సాయి నిశ్శబ్దముతో నిరాకారుడై ఈనాటికీ

కూడా ఏదో ఒక రూపములో ఏదో ఒక విధముగా గొప్ప అనుభూతులతో ఎన్నో సమస్యలను ఎంతోమంది భక్తులకు పరిష్కరిస్తున్నారో వారే **నాకు తెలిసిన శ్రీ సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 26, 27

కనిపించే జగత్తునందు ఉన్న రకరకాల వస్తువులు నిజానికి అసత్యమే. సత్యమైనది ఒక్కటే అదే భగవంతుడు. వారే శ్రీసాయి. కావున కనిపించే జగత్తుపై అందున్న వస్తువులపై గల ఆసక్తిని పోగొట్టి సాయిపై దృష్టి ప్రసరింపవలెనని ఆ పరమాత్మ సాయిని మనందరం ప్రార్థిద్దాం.

శ్రీసాయి ఇట్లనినారు. "ఏమైనా కానిండు. పట్టు విడువరాదు. నీ గురువునందే ఆశ్రయము నిలుపుడు. ఎల్లప్పుడు నిలకడగా ఉంటూ ధ్యానమునందే మునిగియుండుము. ఎవరికైతే నమ్మకము, ఓపిక కలవో వారిని భగవంతుడు కాపాడును." సాయి పలికిన ఈ అమృతతుల్యమైన వాక్కులయందు అమృతబిందువులేమనగా ఎవరి గురువు యందు నమ్మకమున్నదో ఆ గురువుయందే ఆశ్రయము నిలుపవలెను. అట్టి గురువుపై నమ్మకముంచి పట్టు విడువరాదని నిలకడగా ఉంటూ తాను నమ్ముకున్న గురుధ్యానమునందే మునిగియుంటూ ముఖ్యమైన ఓపిక, నమ్మకము కలిగి ఉండవలెను. అటువంటి వారికే పరమాత్మ రక్షకలదు. ఏ భక్తుడైతే సాయి చెప్పిన అమృత బిందువులను స్వీకరించునో అటువంటి వారి చెంత వారి చింతలను ఎంతవైనప్పటికి అంతం చేయుటకు శ్రీసాయి నిశ్శబ్దముగా వారికి కనిపించకుండా వారి మధ్యలోనేయుంటూ రక్షించెదరు. కారణం శ్రీసాయికి కావలసినది నమ్మకము మరియు ఓపిక. అటువంటి కరుణామూర్తి దయార్ద్రహృదయుడు ఆ కనిపించని సాయియే **నాకు తెలిసిన శ్రీ సాయి.**

శ్రీసాయి విష్ణు సహస్రనామము యొక్క ప్రాముఖ్యతను తెల్పుటకై వారి ముఖ్య భక్తుడైన శ్యామా అను భక్తునితో ఇట్లనినారు. “ఒకప్పుడు నేను మిగుల బాధ పడితిని. నా హృదయము కొట్టుకొనెను. నా జీవితము అపాయములో ఉండెను. అట్టి సందిగ్ధ స్థితియందు నేను ఈ పుస్తకమును నా హృదయానికి హత్తుకుంటిని. నాకు గొప్ప మేలు చేసెను.” విష్ణుసహస్ర నామము ఎంత పవిత్రమైనదో అసలు ఆ పుస్తకము చదువకున్నను మనసా వాచా మరియు విశ్వాసముతో నమ్మి పుస్తకాన్ని కేవలం హృదయానికి హత్తుకొనిన మాత్రమున గొప్పమేలు కలిగెనని పరమాత్మ అయిన శ్రీసాయియే అందుగల రహస్యముని బైటపెట్టినారు. కొందరు విష్ణుసహస్రనామము పఠించవలెనన్న నోళ్లు తిరుగవని, తప్పులు దొర్లునని అనుకొనినవారూ కలరు. అటువంటి వారందరికీ శ్రీసాయి బయటపెట్టిన రహస్యమును ఆచరణలో పెట్టినచో పరమాత్మ సాయి చెప్పినట్లుగా వారికి గూడా గొప్పమేలు తప్పక జరుగును. కారణం శ్రీసాయి చెప్పిన మాటలు ఎన్నటికీ అసత్యములు కాలేదు. వారు పలికే పలుకులు అక్షరసత్యములే. శ్రీసాయి మరియొక రహస్యముకూడా చెప్పెను. విష్ణుసహస్ర నామాలను ఓపికగా చదువ వలెనని మరియు రోజునకు ఒక నామమైనా చదివినను మేలు కలుగునని పలికెను. నాకు తెలిసిన శ్రీమన్నారాయణుని అవతారమైన ఆ సాయి మరెవరో కారు. ఎవరి హృదయము కొట్టుకొనెనో మరియు వారి జీవితమపాయములో ఉండెనో అట్టి సమయమందు విశ్వాసముతో భక్తి మరియు ప్రేమలతో ఆ పుస్తకమును హృదయమునకు హత్తుకొనిన వారి వద్ద లేదా ఎవరైతే విష్ణుసహస్రనామమును ఓపికగా చదివి కనీసం రోజుకొక నామమైనా చదివెదరో అటువంటి వారి వద్దకు కూడా శ్రీసాయి నిశ్శబ్దముగా నిరాకారుడై వ్యాపించి అటువంటి భక్తులకు గొప్పమేలు చేసెదరు. విష్ణువు అంటేనే సమస్తము వ్యాపించిన వారని, అటువంటి

వ్యాపించియున్న ఆ అనంతశక్తి ఎవరికైతే మేలు చేయుచున్నారో వారేను తెలిసిన శ్రీ సాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము – 28

శ్రీ సాయి ప్రతి అధ్యాయములో నిర్గుణ రూపముగా పరిగణింపబడినారు. నిర్గుణమైతే అసలు రూపమేమిటి ? అనే ప్రశ్నకూడా వస్తుంది. నిర్గుణమంటే సర్వవ్యాపకత అని అసలు కనిపించేదికాదని అంతా వ్యాపించియున్న శ్రీసాయి అనంతశక్తి లేదా వారి తత్వమే నిర్గుణరూపముగా చెప్పబడినది. శక్తిని లేదా వారి తత్వమును చూడలేము. కానీ అనుభవముతో తెలుసుకొనవచ్చును. అటువంటి చెప్పలేని అతీతమైన ఆ స్థితియే నిర్గుణత్వము. పైన చెప్పబడినట్లుగా ఆకలిగాని, దాహముకానీ అలాగే వాయువు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు తీసుకుని ఏ విధముగా ప్రతిజీవి బ్రతుకుచున్నాడో కానీ వాటి స్థితులనైతే అనుభవిస్తున్నారు. కానీ వాటి ఆకారములను చెప్పలేకున్నారు. అలాగే పరమాత్మ నిర్గుణత్వము కూడా. తత్వమంటే ఇదివరకు చెప్పినట్లుగా లేదా తత్వజ్ఞానమని అనవచ్చు. శ్రీసాయి స్వభావమును లేదా సాయి బోధించిన తత్వముబట్టి ఆ పరమాత్మ సాయి యొక్క నిర్గుణత్వము తెలుసుకొనవచ్చును. అటువంటి అనంతశక్తిలో కొంతశక్తి అయిన లేదా సాయిబోధించిన తత్వజ్ఞానములో మరికొన్ని ముఖ్యమైన జ్ఞానరత్నాలుగలవు.

1. నా మనుష్యుడు ఎంతదూరమున ఉన్నప్పటికీ (వెయ్యిక్రోసుల దూరమైనను) పిచ్చుక కాళ్లకు దారము కట్టి ఈడ్చినట్లు అతనిని శిరిడీకి లాగెదను.
2. నన్ను గురించి ఇతరులను విచారించుచుండును. ఇతరుల నడుగనేల ? మనకళ్లతో సమస్తము చూడవలెను. ఇతరుల నడుగవలసిన అవసరములేదు.

3. ప్రవేశించుటకు నాకు వాకిలి అవసరములేదు. నాకు రూపములేదు. నేనన్ని చోట్ల నివసించుచున్నాను. ఎవరైతే నన్నే నమ్మి నా ధ్యానమునందే మునిగియుందురో వారి పనులన్నియు సూత్రధారియై నేనే నడిపించెదను.

సాయి భక్తులు ఏ మూలనున్నను, ఎంతదూరములోనున్నను సాయి అటువంటి భక్తులకాళ్లకు ఆ భక్తునికి తెలియకుండానే దారము కట్టి శిరిడీకి లాగును. ఒక్క శిరిడీకే సాయిలాగి ఆ భక్తునికి దర్శనభాగ్యము ఇచ్చెదరని అనుకోక ఎవరైతే సాయిని నమ్ముకొని ఉన్నారో ఆ భక్తుడు వేయిక్రోసుల దూరమునందున్నను ఆ నిర్గుణసాయి కనిపించకుండా నిశ్శబ్దముతో ఆ భక్తుని అనుగ్రహించుటకై తనవైపుకు లాగుకొనును. సాయి అంటేనే సర్వవ్యాపి. అంతట ఎక్కడ ఖాళీ లేకుండా వ్యాపించియున్న ఆ సాయి ఒక్క శిరిడీలోనే ఉన్నారని అనుకొనుట మిథ్య. **నాకు తెలిసిన సాయి** ఎవరంటే అంతటా వ్యాపించియున్న ఆ నిర్గుణ నిశ్చల అనంతశక్తియే ఆశ్రీసాయి.

సాయి భక్తులు ఒక్కసారి సాయిని నమ్ముకున్న ఎడల చంచలబుద్ధితో సాయిని గురించి సాయిలీలలను గురించి ఇతరులతో విచారించరాదు. నమ్మిన భక్తుడు ఎంతో విశ్వాసముతో సాయిని పట్టుకొనవలెను కానీ ఇతరులనడగరాదు. పరమాత్మ సాయి ఇచ్చిన కండ్లతో సమస్తము చూడవలెను కానీ ఇతరులపై ఆధారపడి ఇతరుల నడుగరాదు. **నాకు తెలిసిన సాయి** ఎవరైతే సాయిని విశ్వాసముతో నమ్మి పట్టువదలక సాయినే పట్టుకొనిన ఎడల ఆ పరమాత్మసాయి నిశ్శబ్దముగా నిరాకారుడై ఆ ఒంటరిభక్తుని ఇంట ఇలవేలుపు అయి ఇహపరసుఖములను అందిచేవాడే **ఆ శ్రీ సాయి**

తాను నమ్ముకున్న భక్తునియింట ఆ ఇంటి వాకిలి తాళము వేసి ఉన్నను సాయికి ఆ వాకిలితో అవసరము లేదు. స్వయముగా శ్రీసాయి తన భక్తుడైన

మేఘశ్యామునితో " నాకు రూపములేదు. నేనన్ని చోట్ల నివసించుచున్నాను. నన్ను నమ్మినవారి పనులన్ని నేనే చేయుచున్నాను"అని అన్నారు. కావున సాయికి రూపము లేదని అన్నిచోట్ల అంతట వ్యాపించి ఉన్నారని వారే చెప్పుటచే అది అక్షరసత్యం. **నాకు తెలిసిన శ్రీ సాయి** అంతట ఉన్న ఆ సాయి. అంతా సాయిమయం. మరియు ఎవరైతే సాయిని నమ్మియున్నారో వారికి తెలియకుండానే వారు నమ్మిన దైవమైన ఆ సాయి నిశ్శబ్దముగా నిరాకారుడై ఆ భక్తుల పనులన్నియు శ్రీసాయియే చేస్తూ భక్తులు చేస్తున్నట్లుగా నాటకమాడి ఆ నాటకానికి తెరవెనుక కన్పించకుండా ఉన్న ఆ సూత్రధారియే **నాకు తెలిసిన శ్రీ సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము – 29

సాధారణముగా ఎవరు చేసిన కర్మ వారు అనుభవించక తప్పదని ఆ కర్మ చివరకు గతజన్మలోదైనను ఆ కర్మ అనుభవింపవలసినదే. అయితే మరి సద్గురువుల యొక్క ప్రాముఖ్యము దేనికి ? అటువంటి సద్గురువులు కర్మను తప్పింపలేరా అనే ప్రశ్నకూడా వస్తుంది. అలాంటి ప్రశ్నే ఒక అతను శ్రీసాయితో ఇట్లనినారు. "గతజన్మలో ఏమైనా పాపము చేసియున్నచో నీ సముఖమున దానినేల నిప్పు ముందర ఎండుగడ్డివలె దహనము చేయరాదు?" అని ప్రశ్నింపగా శ్రీసాయి వెంటనే "నీకట్టి విశ్వాసము కలదా?" అని సూచించినారు. సాయి కోరేది తన భక్తుల వద్దనుండి ఎప్పుడు విశ్వాసమే. శ్రీసాయి సూచించిన దానికి ఒక్కసారి గ్రహించినచో ఏ భక్తునికైతే సాయిపై తరగని ధృఢమైన విశ్వాసము ఉండునో అట్టి భక్తునియొక్క గతజన్మ పాపములను కూడా శ్రీ,సాయి దహించివేయగలరని రహస్యము తెలియుచున్నది. సద్గురువు ఎంత గొప్పవారో చివరకు కర్మఫలితమును కూడా వారు తలుచుకుంటే తారుమారు చేయగలరని

తెలియుచున్నది. **నాకు తెలిసిన సాయి** ఏ భక్తుడైతే తనకున్న పాపకర్మ ఫలితములతో నరకము అనుభవించుచున్నను ఆ భక్తుడు సాయిపై గట్టి విశ్వాసము కలిగియుండి తన గతజన్మ పాపాలను నిప్పుముందర ఎండుగడ్డి వలె దహనము చేయగలరని పూర్తివిశ్వాసము కలిగియున్న వారిచెంత సాయి నిరాకారుడై నిశ్శబ్దముతో ఆ కర్మ ఫలితములను అనుభవించుచున్న వానికడకు కనిపించకుండా వచ్చి వాని పాపములను దహనము చేయగలడు. ఆ దహనము చేసే సాయియే **నాకు తెలిసిన శ్రీ సాయి.**

కర్మ ఫలితములనే తప్పించి బంధవిముక్తుని చేసే సాయిముందర ఇక గ్రహములు ఎంత ? గ్రహములు వ్యతిరేకముగా ఉన్నను సాయి కటాక్షముచే అనుకూలమగును. తెండూల్కర్ కుమారుడు బాబూ తెండూల్కర్ వైద్య పరీక్షకు చదువుచుండగా అతని జాతకరీత్యా గ్రహములు అనుకూలముగా లేకపోవుటచే జ్యోతిష్యులు అతని పరీక్షకు వెళ్లవద్దని సలహాయిచ్చిరి. అతని తల్లి సాయిని కోరగా సాయి ఇట్లనెను. " నాయందు నమ్మకముంచిన జాతకములు వాని ఫలితములు సాముద్రిక శాస్త్రజ్ఞుల పలుకులు ప్రక్కకు పెట్టి చదువుకొనమనెను. నాయందే నమ్మకముంచుము. నిరుత్సాహము చెందవద్దు." నమ్మకము ఎంతవిలువైనదో సాయి నొక్కి చెప్పెను. జాతకరీత్యా గ్రహములు అనుకూలముగా లేకపోయినప్పటికి ఏ భక్తుడైతే సాయియందే అపారమైన నమ్మకముండునో సాయి అట్టిభక్తునికి గ్రహములు వ్యతిరేకముగా ఉన్నను తమ పరీక్షలలో ఉత్తీర్ణులుగా చేయగలరు. **నాకు తెలిసిన శ్రీ సాయి** గతజన్మలో చేసిన పాపములవల్ల తన కర్మ ఫలితములను నరకముగా అనుభవించే భక్తుని మరియు ఆ భక్తునికి గల విశ్వాసము చూచి సాయి నిశ్శబ్దముగా నిరాకారుడై వచ్చి తన కర్మలను అరికట్టేవాడు. మరియు ఎవరి గ్రహములు వ్యతిరేకముగా ఉన్నను అట్టి భక్తుడు నిరుత్సాహము చెందక సాయి యందే నమ్మకము

ఉంచేవాడి వద్ద సాయి నిరాకారుడై నిశ్శబ్దముగా ఆ భక్తుని కంటపడక ఆ భక్తునికి గ్రహములను తారుమారు చేసి ఆ భక్తుని చేతిలో రాతలను మరియు నుదుటిపై రాతలను ఆ భక్తునికి తెలియకుండా సరిదిద్దేవాడే ఆ సాయి. ఆయనే **నాకు తెలిసిన శ్రీ సాయి.** నమ్మకమే ఆ సాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 30,31.

కాకాజీ అనే సాయిభక్తుడు అనేక కష్టములపాలై తన మనశ్శాంతిని పోగొట్టుకొనినపుడు శిరిడీలోనున్న శ్రీసాయిని దర్శించగా అతని కండ్లనిండా నీళ్లతో నిండి ఒక్కసారిగా అతని మనస్సంతా శాంతించి చంచలత్వము మాయమయ్యేను. అతనిట్లనుకొనెను. "బాబా ఏమీ పలుకలేదు. కేవలము వారి దర్శనమే సంతోషానికి కారణమయ్యేను. మనచ్చాంచల్యము పోయెను. అంతరంగమున ఆనందముద్భవించెను. ఈ సంఘటనను జాగ్రత్తగా గమనించినయెడల ఇది శ్రీసాయి సజీవముగా ఉన్నపుడు జరిగిన సంఘటయిది. కాకాజీ తన మనశ్శాంతిని పోగొట్టుకొని కష్టదశలో ఉన్నపుడు సాయిని దర్శించగా సాయి ఏమీ పలుకక ఉత్తర ప్రత్యుత్తరములు కూడా జరుపక ఆశీర్వాదము ఇచ్చినట్లుకూడా చూపక మౌనముగా ఉండెను. కానీ ఆ దర్శనభాగ్యముచే కాకాజీకి మటుకు తన మనస్సులోని చంచలత్వమంతయు పోయి ప్రశాంతి లభించెను. ఈ సంఘటనలో సాయి ఏమీ పలుకక ఎటువంటి సూచనలు కూడా ఇవ్వలేదు. వారు సజీవముగా ఉన్నప్పటికీ నిర్జీవముగా ఉన్నట్లుగా చూపించిరి. దీనిలోని మర్మమేమిటంటే ఎవరికైనా మనశ్శాంతి కరువైనపుడు కష్టములతో ఉన్నపుడు, మనసు చంచలమైనపుడు కాకాజీ వలె సజీవముగా ఉన్న సాయివద్దకు పోవనవసరములేదు. ప్రస్తుతము సాయి సమాధి చెందినారు. అయినప్పటికీ అటువంటి భక్తుడు సాయిపటము ముందరైనను సాయిని మనసారా చూచినచో వారి కళ్లనుండి కూడా నీరు నిండి ఆ దర్శనభాగ్యముచే

వారికి కూడా కాకాజీవలె ప్రశాంతత లభించును. భవిష్యత్తులో జరుగవలసిన దానిని సాయి ముందుగనే కాకాజీని విషయములో వారు సజీవముగా ఉన్నప్పటికీ నిర్జీవి వలె చూపి కాకాజీని ఆశీర్వదించెను. **నాకు తెలిసిన శ్రీ సాయి** ఆర్తితో వేడిన భక్తులకు ఏమియు పలుకక ఉత్తరప్రత్యుత్తరములు జరుపక కేవలం వారి దర్శన భాగ్యముచే ఆ భక్తుని కండ్లలో కన్నీరు చూచినవెంటనే ఆ భక్తుని కన్నీటిని తుడుచుటకు నిశ్శబ్దముగా నిరాకారుడై ఆ భక్తునికి కనిపించక అతని మనసులోని చంచలత్వమును పోగొట్టిప్రశాంతతనిచ్చువాడే ఆ ఆనంద సాయి.

"నీ తల్లిని అంత ప్రేమించువాడవైతే సన్యాసము ఎందుకు పుచ్చుకున్నావు ? కాషాయ వస్త్రాలు ధరించువానికి దేనియందు అభిమానము వలదు." అని శ్రీసాయి విజయానంద్ అనే సన్యాసితో పలికినారు. ఒకసారి కాషాయ వస్త్రాలు ధరించినచో దేనియందు అభిమానము ఉండకూడదని ఒకవేళ వస్తువులయందు అభిమానము లేదా బంధుత్వమున్నచో సన్యాసము పనికిరాదని సాయి సూచించెను. అసలు సాయికి ఇవన్నీ కాదు కావలసినవి. వారు కోరుకునేవి భక్తి, ప్రేమ మరియు విశ్వాసము. "ఎవరైనా భక్తిప్రేమలతో భగవంతుని ధ్యానముచేసినచో వారికి పరమాత్మ పరుగెత్తి పోయి సహాయము చేయును." అని సాయి సూచించెను. **నాకు తెలిసిన శ్రీ సాయి** మరెవరోకాదు. ఏ భక్తుడైతే భక్తి, ప్రేమ, విశ్వాసములు కలిగియుండునో అట్టివారి వద్దకు సాయి ఎంతో వేగముగా పరుగెత్తుకుని వచ్చును. కాని వారి అడుగుల చప్పుడు కాని రూపము కాని చూపించక నిశ్శబ్దముగా నిరాకారుడై వచ్చి ఆ భక్తుని రక్షించువాడే **నాకు తెలిసిన శ్రీ సాయి.**

శ్రీసాయి బలరామ్ మాన్ కర్ తో ఇట్లనెను. "నీ చంచల మనస్సును నిలకడ కలుగచేయుటకై ఇచ్చటకు పంపితిని. నీవు పంచేంద్రియములతో మూడున్నర మూరల మనిషిగా నన్ను భావించితివి. నేనెల్లప్పుడు శిరిడీలోనే

ఉండెదననుకొంటివి." శ్రీసాయి వారు పంచేంద్రియములతో మూడున్నర మూరల మనిషి కాదని మరియు వారెల్లప్పుడు శిరిడీలోనే ఉండరని ఋజువుచేయుటకై బలరామ్ మాన్ కర్ ను మఛ్చీంద్రగడ్ కు పంపి అక్కడ కూడా సాయి దర్శనమిచ్చారు. కావున సాయిలేని చోటులేదు. సాయి ఒకే చోటున ఉన్నారని అనుకొనుట మూర్ఖత్వమే. వారికి రూపులేదు. సర్వాంతర్యామి. వారి శక్తి అనంతముగా అన్ని మూలలా వ్యాపించి ఉన్నది. నాకు తెలిసిన శ్రీ సాయి ఆశక్తిస్వరూపుడు.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 32,33.

ఇదివరకు చెప్పినదే మళ్లీ మళ్లీ చెప్పుచున్నాను. ఏమిటంటే ఎవరైతే సాయి శిరిడీలో మాత్రమే ఉన్నాడని అనుకొందురో వారు సాయిని నిజముగా గ్రహింపలేదని అనుకోవాలి. సాయి అశ్వరమైన దేహము వెళ్లిపోయినప్పటికీ దానిలోనున్న సాయితత్వము మాత్రము ఈనాటికి అనంత శక్తివలె నిలిచి వారు సమాధిచెందక ముందు భక్తులకు తోడ్పడినట్లే ఈనాటికి వారిని నమ్ముకున్న ఎందరో భక్తులకు సాయి నిశ్శబ్దముగా అనుక్షణము సహాయపడచున్నారు. మరువవద్దు. మన అందరి ఎరుకలో నిలిచినది ఆ అనంతతత్వమే. అదే శాశ్వతమైనది. సాయి పలికిన పలుకులను ప్రతిభక్తుడు మనసులో నాటుకుని ఆచరణలో పెట్టినఎడల అటువంటి నమ్మినభక్తులకు సాయి ఎప్పటికీ సహాయపడెదరు. ఈ చెప్పిన విషయమునే మళ్లీ మళ్లీ చెప్పవలసి వస్తుంది. కారణం సాయి ఒక మామూలు మానవుని వలె రూపము దాల్చి లీలలు చేసి తన అవతారము ముగించినప్పటికీ ఆ అవతారములో నున్న రూపమే శాశ్వతమని, వారు అవతారము ముగించిన పిదప ఇకలేరని సాయి సాకార

రూపమునే మనసులో ఉంచుకుని గడుపుట కన్న మన ఎరుకలో ఎప్పటికీ ఉన్నవారి అనంత తత్వమును జ్ఞప్తియందుంచుకుని ఆ అనంతతత్వమే శాశ్వతమని సాకార రూపము అశాశ్వతమని ఎరగినచో సాయి అను శాశ్వతమైన ఆ అనంతశక్తి మాత్రము ఎప్పటికీ నిలిచిఉండి తనను నమ్ముకున్న భక్తులను నిశ్శబ్దముతో అదే తత్వము కాపాడుచుండును.

సాయి ఒక సందర్భములో ఇట్లనెను. " నా ప్రభువు తీసుకో తీసుకో అనును కానీ ప్రతివాడు నా వద్దకు వచ్చి తే. అనుచున్నాడు. నేనేమి చెప్పుచున్నానో గ్రహించువాడు ఒక్కడూలేడు నా సర్కారుయొక్క ఖజానా(ఆధ్యాత్మిక ధనము) నిండుగాయున్నది. అది అంచువరకు నిండి పొంగిపోవుచున్నది. ఎవరైతే నా పలుకులను జ్ఞప్తయందుంచుకొనెదరో వారు అమూల్యమైన ఆనందము పొందెదరు." ఒక్కసారి సాయి చెప్పిన ఈ అమూల్యమైన వాక్యములను పైన చెప్పబడిన సాయితత్వముతో పోల్చిచూచినఎడల ఎంతసత్యమో తేటతెల్లమగుచున్నది. నేనేమి చెప్పుచున్నానో గ్రహించువాడు ఒక్కడూలేడు-- అనగా సాయిచెప్పేది ప్రతివిషయము గ్రహించినచో ఆ తత్వము గ్రహించిన వారి వెంట ఉంటూ ఆ సాయి తత్వమే ఆ గ్రహీతకు ధైర్యమునిచ్చి సాయి యొక్క ఖజానా(ఆధ్యాత్మిక సంప)లో కొంతధనమును ఆ గ్రహించువానికి లభ్యమగును మామూలు ధనము కన్న ఆధ్యాత్మికధనము ఎంతో గొప్పది కావుననే ఆ ఆధ్యాత్మిక ధనమునే సాయియొక్క ఖాజానాలో నున్న వాటిలో సరియైన వాడు దానినే కోరవలెనని సాయి సూచించినారు. ఆ ధనము పొందిన వారికి ఇక మామూలు ధనముతో సంపదలతో కీర్తిప్రతిష్ఠలతో సంబంధించినవేమైనా ఉపయోగము లేనివే సాయి ముందుగనే వారు చెప్పేది గ్రహించమని జ్ఞప్తియందుంచుకొనమని సూచించెను. అందుకే సాయి "ఎవరైతే నా పలుకులను జ్ఞప్తియందుంచుకొనెదరో వారు అమూల్యమైన ఆనందమును పొందెదరు". అని అన్నారు. **నాకు తెలిసిన శ్రీ సాయి** ఏ భక్తుడైతే సాయి చెప్పిన విషయాలను గ్రహించి సాయి ఖజానాలోని ఆధ్యాత్మికధనమును సంపాదించుటకై అర్హతపొంది అట్టి సాయి విషయములను జ్ఞప్తియందుంచుకొని వారి వద్దకు సాయి నిశ్శబ్దముతో నిరాకారుడై వారి మధ్య

కనిపించకుండా ప్రత్యక్షమై వారికి ఆనందమును కలుగచేసే ఆ అనంతత్వము మరియు అనంతశక్తియే ఆ సాయి . ఆనందమునకు ప్రతిరూపమే ఆ సాయి.

సాయి సంకీర్తనాకారుడైన బాలబువసుతార్ అనునతనితో ఇట్లనినారు. "నేనితనిని 4 సంవత్సరములనుండి ఎరుగుదును." నిజానికి ఆ భక్తుడు శిరిడీకి మొట్టమొదటసారిగా వచ్చెను. తదుపరి అతను తీవ్రముగా ఆలోచించగా ముంబాయిలో 4 సంవత్సరముల క్రిందట సాయి ఫోటోకు నమస్కరించెను. **నేనెరిగిన సాయి** మరెవరోకాదు. ఏ భక్తుడైతే తానెక్కడున్నను సాయి ఫోటోకు నమస్కరించిన లేదా ఆ భక్తుడి మనసులో సాయిని తలచినంత మాత్రముననే ఆ భక్తుడి నమస్కారము లేక పిలుపును సాయి వెంటనే స్వీకరించి నిశ్శబ్దముగా ఆ భక్తునివద్దకు నిరాకారుడైన సాయి వచ్చి కనిపించకుండానే అతనికి సహాయము చేసి తోడునీడగా ఉండే సాయియే **నాకు తెలిసిన శ్రీ సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయము – 34.

సాయి అద్భుతమైన మూడు విషయాలను బోధించిరి. పిళ్లే అనునతడు డాక్టరు అయినప్పటికీ నారిపుండుతో బాధపడుచున్నపుడు ఆ బాధను ఓర్చుకొనలేక రాబోవు జన్మలకు తన బాధను పంచిపెట్టమని శ్రీసాయిని కోరగా సాయి మూడు అద్భుతమైన విషయములను చెప్పెను.

1. అతడేల పది జన్మల వరకు బాధపడవలెను ? పదిరోజులలో గతజన్మ పాపములు హరించి వేసెదను.
2. అసలైన విరుగడేమనగా గత జన్మపాపము అనుభవించి విమోచనము పొందవలెను. మన కష్టసుఖములకు మన కర్మయే కారణము. వచ్చినదానిని ఓర్చుకొనుము. అల్లా తీర్చేవాడు. కావున వానిని

ధ్యానించుము. అతడే నీ క్షేమమును చూచును. వారిపాదములకు శరీరము, మనస్సు, ధనము, వాక్కు సమస్తము అర్పింపుము. అటుపై వారేమి చేసెదరో చూడుము.

3. కర్మయొక్క మార్గము చిత్రమైనది. నేనేమి చేయకున్నను నేను కారణభూతుడుగా ఎంచెదరు. నేను భగవంతుని బంటును. ఎవరైతే తమ అహంకారమును ప్రక్కకు తోసి భగవంతునికి నమస్కరించెదరో, మరియు పూర్తిగా నమ్మెదరో వారి బంధములూడి మోక్షము పొందెదరు.

తన భక్తుడు బాధపడుచున్నపుడు సాయి పైనచెప్పిన మొదటి విషయము పలికెను. ఆ పలుకులవలన భక్తునికి ధైర్యము వచ్చెను. సాయి తన భక్తుడు ధైర్యము కోల్పోరాదనే ఉద్దేశ్యముతో పలికినను అందులో ఒక రహస్యము కూడా దాగియున్నది. అదే 10 రోజులలో సాయి తలచుకొనినయెడల అతని గతజన్మ పాపములు హరింపజేయగలడని.

పైన చెప్పబడిన రెండవవిషయములో సాయి ఒకసత్యముకూడా సూచించెను. గతజన్మ పాపములకు అసలైన విరుగుడు ఆ పాపములను అనుభవించుటయే. కర్మానుగుణముగనే కష్టసుఖములు వచ్చునని వాటిని ఓర్చుకొనవలెనని పరమాత్మయే ఆర్చితీర్చువాడని కావున పరమాత్మను నిత్యము ధ్యానించి వారి పాదములకు సమస్తము సమర్పించనచో పరమాత్ముడేమి చేసెదరో చూడుము అని సాయి సూచించినారు. అనగా అట్లు చేయు భక్తునికి పరమాత్మ తన భక్తుని గతజన్మ పాపములను తుడిచివేయగలడనే అర్థముకూడా సూచించబడినది.

పిళ్ళే సాయిని నమ్ముకుని తన బాధను సాయిపాదముల వద్ద ఉంచుటచే సాయి అతని బాధను నివారించెను. అనగా తన గతజన్మ పాపకర్మములను తప్పించెను. వెంటనే సాయి పైన చెప్పబడిన మూడవవిషయమును అందరిముందు పలికెను.

నాకు తెలిసిన శ్రీ సాయి ఎవరైతే పూర్తి విశ్వాసముతో సాయిని నమ్ముకుని తన గతజన్మ పాపములను అనుభవిస్తూ విమోచనమునకై ప్రయత్నిస్తూ తన కష్టములను ఓర్చుకొనుచూ ఒకప్రక్క ధైర్యముతో సాయియే ఆర్చితీర్చువాడని ధ్యానిస్తూ సాయిపాదముల కడ సమస్తమును అర్పించిన ఎడల సాయి ఆ భక్తుడు వదిలిన అహంకారమును చూచి ముగ్ధుడై అతని నమ్మకమునకు ప్రశంసించి ఆతని కర్మబంధములను తెంచివేయుటకు నిశ్శబ్దముగా నిరాకారుడై తన భక్తుని వద్దకు పరుగిడి కర్మబంధమనెడు సంకెళ్లను త్రెంచివేసి అతనికి తెలియకుండగనే ప్రసాదించువాడే **నాకు తెలిసిన ఆ సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 35,36

సాధారణముగా ఒకవ్యక్తి మరొక వ్యక్తి వద్ద పనిచేయుచున్నడు ఆ పని కల్పించువానిని పనిచేయువాడు అతనికి యజమానిగా తలచెదరు. ఇదే సంఘటన ఒకసారి ఠక్కర్ అనునతడు శిరిడీకి వచ్చినపుడు సాయి ముఖ్యభక్తుడైన శ్యామా ఆ ఠక్కర్ ను కాకా యజమానిగా సాయికి పరిచయము చేసెను. సాయి వెంటనే "అతడెట్లు వానికి యజమాని కాగలడు? అతని యజమాని వేరొకరు కలరు." సాయి పలికిన ఈ అమూల్యమైన వాక్కులు నిజానికి సత్యము. ఒకవ్యక్తికి పనికల్పించేవాడు యజమానియే అయినప్పటికీ ఆ యజమానికి కూడా మరియొక యజమాని ఉండును. ఆ యజమానిని మరువకూడదనే ఉద్దేశ్యముతోనే సాయి అట్లనెను.

సాయి ఠక్కర్ గురించి మరికొన్ని సూచనలు కూడా యిచ్చెను. సాయి అతనిని చూచి ఇట్లనెను. "అనవసరమైన ఆరాటము పైన వేసుకుని అక్కడ ఇక్కడ తిరుగుచూ మనశ్శాంతిని

పోగొట్టుకొనుచున్నాడు. ఒక్కొక్కసారి భారములన్నియు వదలివేయుచుండెను. మరొకసారి వానిని మోయుచుండును. అతని మనస్సునకు నిలకడ లేకుండెను. ఒకే చోటుని ఆశ్రయించుకొని నిలకడగా ఉండుము. ”

ఠక్కర్ కు మరియొక అనుభవము కూడా కలిగెను. సాయి కాకాని దక్షిణ అడుగుచు ఇట్లనెను. “నేను ఒకరూపాయి తీసుకునినచో దానికి 10 రెట్లు ఇవ్వవలెను. గతజన్మనుంచి బాకీయున్నచో వానివద్దనే ధనము అడిగెదను. ధర్మము చేయుటకు ధనమును ఉపయోగించవలెను. దక్షిణనిచ్చినచో వైరాగ్యము కలిగి భక్తిజ్ఞానములు పెరుగును.” ఠక్కర్ కు జరిగిన మూడు సంఘటనలు ప్రతిసాయి భక్తుడు గుణపాఠముగా నేర్చుకొనవలెను. సాయికి భక్తుడైనవాడు సాయి వద్ద ఏమైన అద్భుతములు జరుగునా అని కాంక్షించకూడదు. కానీ అదే భక్తుడు ప్రేమతో కాంక్షించినచో తప్పకజరుగును. ఈ ప్రపంచములో ఎవరూ ఎవరికి యజమాని కాదు. అసలైన యజమాని ఒకేఒక్కడు. వారే సమర్థ సద్గురు శ్రీసాయినాథుడు. ఎక్కువభాగం మన ఎరుకలో నిలిచిన ఆ అనంతతత్వములో అతి ముఖ్యమైనది మరువకూడనిది అనుక్షణము గుర్తుంచుకొనవలసినది యావత్ ప్రపంచమునకు యజమాని ఆ సాయి. అలాగే మనస్సును ఎల్లప్పుడు ఒకేచోట ఆశ్రయించుకొని నిలకడగా ఉంచుకొనుటకకు ప్రయత్నించవలెను. అనవసరముగా ఆరాటములు పైనవేసుకుని అక్కడాఇక్కడా తిరుగుచూ మనశ్శాంతిని పోగొట్టుకొనరాదు. ఒక్కసారి భారములను నేనే మోస్తానని ప్రగల్భములు పలుకరాదు. మరొక్కసారి అదేభారములను వదిలివేయరాదు. మనస్సు నిలకడలేకపోతే అట్లేచేయుదురు. మన ఎరుకలో నిలిచిన ఆ సాయి అనంతతత్వములో ఇదికూడా ముఖ్యమైనది. ఇక దానము చేయుట ఎంతగొప్పదో సాయి చెప్పెను. మనము సంపాదించిన

ధనమును దానము చేయవలెనని మన గతజన్మలో బాకీ ఉన్న ఎడల సద్గురువులు ఆ బాకీని ఏ రూపములోనైనా గ్రహించెదని అట్టి దానము చేయుటచే వైరాగ్యము పెరిగి తద్వారా భక్తిజ్ఞానములు కూడా కలుగును.

నాకు తెలిసిన సాయి యావత్ ప్రపంచానికి ఒకే ఒక్కడు యజమాని కలడని వారే శ్రీసాయి ప్రభువని మరియు అట్టినమ్మకము కలిగియున్న భక్తుని మనస్సు ఎల్లప్పుడు ఒకేచోట ఆశ్రయించుకొని నిలకడగా ఉంచుకుని మరియు అటువంటి భక్తుడు తాను సంపాదించిన సొమ్ములో కొంత దానధర్మములు కూడా చేయవలెననే వైరాగ్యము పొందిన అటువంటి గుణములు కల భక్తుని వద్దకు సాయి నిశ్శబ్దముతో నిరాకారుడై ఆ భక్తుడు ఎక్కడఉన్నను అక్కడేఉంటూ అతనికి సహాయము చేయుచుండే ఆ సాయియే **నాకు తెలిసిన ఆ సాయి.**

సాయి ఒకసారి శ్యామాతో ఇట్లనెను. "బాకీయున్న వాడు చెల్లించి ఋణవిమోచనము పొందవలెను. నాకేమీ అక్కరలేదు. నేనెప్పుడు స్వతంత్రుడని. ఋణము, శత్రుత్వము, హత్యచేసిన దోషము చెల్లించియే తీరవలెను. దానిని తప్పించుకొను మార్గములేదు." సాయి తత్వములో ఇది కూడా చాలా సందేశాత్మకమైనది. ఒక్కొక్కప్పుడు మన జీవితములోనే సంఘటనలను గుర్తుతెచ్చుకొనిన ఎడల మనము 10 రూపాయలు ఖర్చు పెట్టవలసిన చోట ఒక్కొక్క సందర్భములో 100 రూపాయలు ఖర్చు పెట్టవలసి వచ్చును. ఇంటికి వచ్చి ఆలోచించిన ఎడల అనవసరముగా తక్కువలో పోయేది ఎక్కువైనదని బాధపడెదము. కానీ మనము బాకీయున్నామని అనుకోము. అటువంటి సంఘటనలు జరిగినప్పుడు ద్వారకామాయికి మనము బాకీ ఉన్నామని తలచి ఆ ఋణము చెల్లించి విమోచనము పొందినామనే జ్ఞానము కలిగియుండవలెను. నిజానికి సాయి చెప్పినట్లుగా సాయి స్వతంత్రుడు.

యావత్ ప్రపంచమే వారిది. వారు యావత్ ప్రపంచమానికి యజమాని. మనమందరము వారివద్ద వారి ప్రపంచములో అద్దెకుంటున్నాము. అది మరువకూడదు. అయినను సాయికేమీ అక్కరలేదు. వారు మన యోగక్షేమము కొరకు మనబాకీని తీర్చుటకు ఋణవిమోచనము కలుగచేయుటకు సాయి అప్పుడప్పుడు ఇటువంటి ఖర్చులు తెచ్చి పెట్టుచుండును. కావున అట్టి ఋణమును చెల్లించియే తీరవలెను. **నాకు తెలిసిన ఆ సాయి** మరెవరోకాదు. బాకీ ఉన్నవాడి ఋణము చెల్లించి విమోచనము కలుగజేసే జ్ఞానమును ప్రసాదించే వాడే ఆ సాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 37,38

శ్రీసాయి సచ్చరిత్రమున 37 వ అధ్యాయమున చావడి ఉత్సవము గురించి వివరించపబడినది. శ్రీసాయి సమాధి చెందువరకు ఒకరోజు మసీదులో మరియొకరోజు చావడిలో నిద్రించుచుండిరి. 1910 డిసెంబరు 10 నుండి ఆ చావడిలో భక్తులు సాయికి పూజాహారతులు ఇచ్చుచుండిరి. చావడిలో నిద్రించు సమయము రాగా భక్తులు శ్రీసాయిని మసీదు నుండి చావడికి ఘనస్వాగతము పలుకుచు సాయిని చావడికి తెచ్చేవారు. సాయికి నమస్కరించి తమ ఇండ్లకు పోవు సమయమున సాయి తన భక్తుడైన తాత్యాతో ఇట్లనెను. "నన్ను కాపాడుము. నీకిష్టమున్నచో వెళ్లుము. కానీ రాత్రి ఒకసారి వచ్చి నా గురించి కనుగొనుము". ఈ విచిత్రమైన సాయి వాక్యములను ఒక్కసారి గమనించినచో పరమాత్ముడగు సాయిని మనము కాపాడుటయేమి ? అలాగే కనుగొనుటయేమి? నిజానికి సాయి పలికిన ఆ వాక్యాలలో అంతరార్థం గ్రహించిన ఎడల ఆ వాక్యములు (సాయి పలికినవి) వారికి ఉద్దేశించినవి కావు. కానీ ఆ

వాక్యములు ప్రపంచములోని యావత్ జీవులకు సంబంధించినవి. సాయి భక్తులైనవారు ప్రతిరోజు తాను పడుకునే ముందు ఒకసారి శ్రీసాయి సచ్చరిత్రములోని 37 వ అధ్యాయమున గల చావడి ఉత్సవమును జ్ఞప్తికి తెచ్చుకుని సాయిని మనస్సులో ఇట్లనుకొనవలెను. "ఓ సాయీ ! నన్ను కాపాడుము. నీ కిష్టము వచ్చిన వారి వద్దకును వెళ్లుము. కాని రాత్రి ఒకసారి వచ్చి నా గురించి కనుగొనుచుండుము." అని ప్రతి సాయి భక్తుడు శ్రీసాయి పలికిన పలుకులలో అంతరార్థాన్ని ఈవిధంగా గ్రహించవలెను. **నాకు తెలిసిన సాయి** ఇంకెవరు? ఏ భక్తుడైతే తాను నిదురించు ముందు చావడి ఉత్సవమును తలచి కాపాడమని సాయిని వేడి రాత్రి సమయమున తన గురించి కనుగొనమని సాయిని వేడినవాని వద్దకు ఆ సాయి నిశ్శబ్దముగా నిరాకారుడై తన భక్తుని వద్దకు వచ్చి తన భక్తుని కొరకు తెల్లవారులు జాగారము చేసి ఆ భక్తుని మాత్రం సుఖముగా నిదురపోనిచ్చే కరుణామూర్తియే **నాకు తెలిసిన సాయి.**

సాయి తన బిడ్డలకు అన్నం పెట్టవలెనని నిశ్చయించుకొనినపుడు మొదటినుంచి చివరివరకు సాయి స్వయముగా అన్ని ఏర్పాట్లు వారే చూచుకొనేవారు కాని ఇతరులపై ఆధారపడక ఎవరికిని బాధ కలిగించేవారు కారు. ఐతే ఒక్కొక్కసారి తనను నమ్ముకున్న భక్తులను పరీక్షించేవారు. అలాంటి పరీక్ష దాదాకేల్కర్ కు ఒకసారి ఎదురైనది. కేల్కర్ బ్రాహ్మణుడు మరియు ఆచారవంతుడు. ఒకసారి పొయ్యిమీదనున్న పులావ్ ఉడికినదో లేదోనని సాయి కేల్కర్ ని ప్రశ్నించగా అతను దానిన పరీక్షింపకయే సరిగ్గా ఉన్నదని చెప్పెను. అంతసాయి "నీవు కళ్లతో చూడలేదు. నాలుకతో రుచిచూడలేదు. నీచేయిని తీసి నీ ఆచారము ఒక ప్రక్కకు పెట్టి ఒక తెడ్డుతో తీసి తెలుసుకొనుము." అని సాయి పల్కెను. ఇందు గమనించవలసినది సాయి వారి భక్తునికి నిషిద్ధాహారము

తినమని ఉద్దేశ్యము కాదు. కాని సాయికి ధనము,ధాన్యము,వస్త్రములు, ఆభరణములు మొదలైనవి ఇచ్చుటకంటే సాయి ఆజ్ఞను అక్షరాల పాటించుటయే భక్తుని కర్తవ్యము. అనగా గుర్వాజ్ఞ పాటించుటయే ముఖ్యము. ఈ సత్యమును తెలుపుటకే సాయి ఆ నాటకము ఆడినారు. **నాకు తెలిసిన ఆ సాయి** మరెవరోకారు. ఎవరైతే సాయిని గురువుగా భావించి తదుపరి సాయి గురువులకే సద్గురువుని గ్రహించి ఆ సద్గురు సాయిని నిరంతరము మనసులో ధ్యానించి సాయి చెప్పిన బోధనలను, సాయి తత్వమును పరిపూర్ణముగా జీర్ణించుకుని సాయి వాక్యములే ముఖ్యమని తలచి వాటిని అమలు పరచిన సాయి భక్తునియింట శ్రీసాయి నిశ్శబ్దముతో నిరాకారుడై వచ్చి ఆ ఇంటివారికి అన్నపూర్ణయై వారి ఇంట ఏ కొరత మరియు అన్నవస్త్రములకు లోటులేకుండా కాపాడే ఆ మాతృమూర్తి అన్నపూర్ణయే **నాకు తెలిసిన ఆ సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 39,40

శ్రీ,సాయి తనభక్తుడైన నానాసాహెబ్ చాందోర్కర్ కు ఒకసారి అందరికీ ఆశ్చర్యము కలిగేటట్లు భగవద్గీతలోని ఒకానొక సంస్కృతశ్లోకమునకు చక్కని అర్థమును చెప్పెను. సాయి సకల దేవతాస్వరూపుడని ఋజువుచేసెను. కావుననే బాపూసాహెబ్ బూటీ శ్రీకృష్ణుని ప్రతిమను ప్రతిష్ఠింపవలెనని ఉద్దేశ్యముతో కట్టిన 'బూటీవాడా' లో చివరకు మురళీధరునికి బదులుగా సాయి సమాధిని నిర్మించి అక్కడే శ్రీసాయియొక్క పాలరాతి విగ్రహమునును ప్రతిష్ఠించిరి. శ్రీసాయి నానాసాహెబ్ కు బోధించిన గీతాశ్లోకములో ముఖ్యమైనది సద్గురువునకు శరణాగతి ఎట్లు కావలెననో చెప్పబడినది. సాయి ఈ విధముగా బోధించిరి.

1. జ్ఞానుల ముందు లేదా సద్గురువుల ముందు సర్వస్య శరణాగతిని చేయవలెనని.
2. వారిని ఊరక ప్రశ్నించక ఆధ్యాత్మికాభివృద్ధికై అడుగవలెను.
3. వారికి సేవ చేయవలెనని అట్టి సేవ కొరకే శిష్యుల శరీరమున్నదని తలువవలెను.
4. అజ్ఞానమును నశింపజేయుటయే జ్ఞానము.
5. సద్గురువు నిర్గుణుడు, సచ్చిదానందుడు. కాని మానవాకారము దాల్చుటకు జగత్తును మరియు మానవాళిని ఉద్ధరించుట కొరకు మాత్రమే.
6. ఇట్లుచేయుటచే సద్గురువు యొక్క నిర్గుణ స్వభావము కొంచము కూడా వికారము చెందదు.
7. అనేక జన్మల అజ్ఞానము చేత శిష్యునికి తానే శుద్ధచైతన్యమను సంగతి మరచును.
8. కావున గురువు అటువంటి అజ్ఞానమును తీసివేయవలెను.
9. నేను జీవిని, శరీరమే ఆత్మ- ఈశ్వరుడు జీవుడు మరియు జగత్తు వేరని, నేను దేవుడను కానని అనుకొనుటయే అజ్ఞానుని లక్షణాలు.
10. శరీరమును, మనస్సును, ఐశ్వర్యమును(తను,మన,ధన)అర్పించుటయే శరణాగతికి అసలైన అర్థము.

నాకు తెలిసిన సాయి ఎవరైతే సాయిని సర్వస్య శరణాగతి వేడి అతని శరీరము తనదికాదని భావించి సాయిసేవ కొరకే శరీరమున్నదని తలచి సాయి జగత్తును మరియు మానవాళిని ఉద్ధరించుటకే సాకారరూపము దాల్చెనని కాని వారు నిర్గుణులు, సచ్చిదానందులు అనే సత్యాన్ని గ్రహించి ఆ భక్తుడు అసలైన ఆ సాయియొక్క నిర్గుణస్వభావమును గుర్తుతెచ్చుకుంటూ ఆ భక్తుడుకూడా తన శుద్ధచైతన్యమును

గుర్తించి తన అజ్ఞానమునకు కారణమైన లక్షణములను వదిలి సాయికి ఆ భక్తునియొక్క శరీరమును మనస్సును మరియు ఐశ్వర్యమును సాయి పాదములపై ఉంచిన ఎడల అటువంటి భక్తుని వద్దకు నిశ్శబ్దముతో నిరాకారుడై సాయి వచ్చి వారి దివ్యఆశీస్సులనిచ్చి ఆ భక్తుని ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడే ఆ సాయయే **నాకు తెలిసిన ఆ సాయి.**

సాయి ఇట్లనెను. "నన్నే గుర్తుంచుకొను వారిని నేను మరువను. నాకు బండీగానీ, టాంగా గానీ, రైలుగాని, విమానము గాని అవసరములేదు. నన్ను ప్రేమతో పిలుచు వారి వద్దకు నేను పరిగెత్తుకుని పోయి ప్రత్యక్షమయ్యెదను." సాయికి కావలసినది తన భక్తుడు సాయిని గుర్తుంచుకొనుటయే. మరియు ఆ భక్తుడు సాయిని ప్రేమతో పిలువవలెను. ప్రేమ ఉన్నచోట సాయి ఉండుననే సత్యాన్ని సాయి చూపుటకే సాయి పైన చెప్పిన వాక్యములను బోధించెను. **నాకు తెలిసిన సాయి** ఏ భక్తుడైతే నిరంతరము సాయిని మరువక గుర్తుంచుకొనునో మరియు ఆ భక్తునికి సలహానిచ్చుటకు కాని సమస్యను పరిష్కరించుటకు కాని అవసరమైనప్పుడు ఆ భక్తుడు తాను నమ్మిన మరువని సాయిని ప్రేమపూర్వకముగా ఆ భక్తుడు సాయిని పిలిచినయెడల సాయి నిశ్శబ్దముతో నిరాకారుడై తన భక్తుని వద్దకు పోవుటకు ఎటువంటి బండి,రైలు,టాంగా,విమానము లాంటి వాహనాలను ఉపయోగించకయే నిమిషములోనే కనిపించకుండా ఆ భక్తునివద్ద ప్రత్యక్షమై సమస్యను ఏదో రూపేణా పరిష్కరించే ఆ సాయియే **నాకు తెలిసిన సాయి.** అటువంటి భక్తుని, భక్తుడు ఏ విధముగా నిరంతరము సాయిని గుర్తుంచుకొని మరువడో అదే విధముగా శ్రీసాయికూడా అటువంటి భక్తుని నిరంతరము గుర్తుంచుకొని మరువడనే ఋజువు చేయును.

1917 వ సంవత్సరమున ఒక హోళీ పండుగరోజున సాయి తన భక్తుడైన హేమాడ్ పంత్ స్వప్నములో కనిపించి వారి ఇంటికి భోజనమునకు వచ్చెదనని చెప్పెను. అదేరోజు సరిగ్గా మధ్యాహ్నము 12 గంటలకు సాయి తన ఫోటో రూపమున ఆయింటికి వచ్చెను. ఈ సంఘటన బట్టి సాయి సాకారముగా ఉన్నపుడు తన భక్తునికి స్వప్నదర్శనమునిచ్చి భోజనమునకు వచ్చెదనని చెప్పి అదేరోజు సాయి తనఇంటికి ఒక ఫోటోరూపమున సాక్షాత్కరించి తన భక్తుని కోరిక నెరవేర్చెను. సాయి ప్రేమ, కరుణ మరియు దయ చూపించుటకు సాకార రూపమే అవసరమని కాకుండా వారు ఏ రూపములోనైనా తన భక్తునియింటికి వచ్చునని ఋజువుచేసిరి. ఈనాటికి కూడా సాయి సమాధిచెందిన పిదప సాయి తనను నమ్ముకున్న భక్తులయింట పర్వదినములలో, గురువారమున వచ్చి ఏదో రూపములో భక్తులయింట భుజించి వెళ్తున్నారు. కాని సామాన్యులైన మనము అది గమనింపలేకపోతున్నాము. సాయిప్రేమకు కరుణకు మరియు దయకు నిరాకారము అడ్డు అనుకోవడము మన మూర్ఖత్వమే. సాయి సర్వత్రా సర్వవ్యాపిగా వ్యాపించియున్నారు. శాశ్వతమైన సాయి అనంతశక్తి ఎల్లప్పుడు నిలిచియుంది. అలాంటి తత్వమును తెలుసుకున్న భక్తునికి సాయి ఎల్లప్పుడు నిరాకారుడై నిశ్శబ్దముతో వారివెంట ఉంటూ సహాయము చేస్తూనే ఉంటారు. వారే **నాకు తెలిసిన సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 41,42

అది 1914 వ సంవత్సరము. బి.వి.దేవ్ గారు బాలకరామునితో ఇట్లనినారు. శ్రీసాయి నీకేమి చెప్పెను ? మరియు ధ్యానము నీకు ఎట్లు నేర్పిరి ? అని ప్రశ్నింపగా బాలకరాముడు తన ప్రశ్నలకు జవాబు మరియు సాయియొక్క కీర్తిని

చెప్పబోవునంతలో చంద్రు అనునతను వచ్చి బి.వి. దేవ్ గారిని శ్రీసాయి పిలుచుచున్నారని తన వెంట తీసుకుని వెళ్లెను. బి.వి.దేవ్ గారిని సాయి చూచి ఇట్లనెను. “నా గుడ్డపీలికలను నాకు తెలియకుండా దొంగిలించితివేల ? నేను నీకు జల్తారు శెల్లా ఇచ్చుటకు ఇచ్చట కూర్చునియున్నాను. ఇతరుల వద్దకు పోయి దొంగిలించెదవేల ? ” అని శ్రీసాయి హెచ్చరించెను. మొదట బి.వి.దేవ్ గారు సాయి అనిన మాటలను అర్థము చేసుకోలేకపోయెను. తరువాత శాంతముగా ఆలోచించిన పిదప శ్రీసాయి మాటలలోని అంతరార్థమును గ్రహించెను. అదేమనగా బాలకరాముని ప్రశ్నించుటయే గుడ్డపీలికలు దొంగిలించుట. ఏ ప్రశ్నకైనా సమాధానము నిచ్చుటకు సాయి సిద్ధముగా ఉండగా ఇతరుల నడుగుట సాయికి ఇష్టములేదు. సాయికి అట్టి వైఖరి నచ్చదు. ఇతరులనడుగకుండానే సాయినే సర్వము అడిగి తెలుసుకొనవలెనని, ఇతరులను ప్రశ్నించుట నిష్ప్రయోజనమని సాయి హెచ్చరికలోని అంతరార్థము. నిజముగా సాయి భక్తులే కాక మరి ఏ ఇతర దేవతల భక్తులైనను ఒకసారి తాను నమ్ముకున్న దైవాన్ని పట్టుకున్న తరువాత ఎటువంటి ప్రశ్న అయినా, బాధనైనా, సమస్యలైనా మరియే ఇతర విషయములైనను, అవి చిన్నవైనను, పెద్దవైనను, వాటిని తాను నమ్ముకున్న దైవాన్నే అడిగి సమాధానము పొందవలెను. తాను నమ్ముకున్న దైవము ఆ భక్తునికి ఏదో ఒక రూపేణ తప్పక సమాధానము వస్తుంది. తాను నమ్ముకున్న దైవము ఏ ప్రశ్నకైనా సమాధానము ఇచ్చుటకు సిద్ధముగా ఉండగా అటువంటి సమయములో నమ్ముకున్న భక్తుడు నిరుత్సాహపడి విశ్వాసమును కోల్పోయి ఆశతో ఇతరులను అడిగినచో తాను నమ్ముకున్న దైవము ఆ భక్తుని వైఖరిని యిష్ట పడరు. అటువంటి ప్రవర్తన కలవారు ఇతరుల వద్దకు పోయి దొంగిలించుటయే అగును. ఆ దొంగతనము చివరకు అలవాటై తాను నమ్ముకున్న దైవాన్నే దూరము చేసుకునే

ప్రమాదము వస్తుంది. కావున సాయి భక్తుడు ఈ రహస్యాన్ని గ్రహించి సాయి చెప్పినట్లుగా పీలికలు దొంగిలించుటకు ప్రయత్నము మానవలెను. సాయి భక్తుల కొరకు జల్తారు శెల్లాయే ఇచ్చుటకు సిద్ధముగా రాయిపై కాలుమీద కాలువేసుకుని కూర్చునిఉండగా ఇతరుల వద్దకు పోయి దొంగిలించుటకు ప్రయత్నము చేయరాదు. భక్తి, ప్రేమ మరియు విశ్వాసము అనే మూడు వత్తులను ప్రతిజీవి తన హృదయములో వెలిగించుకుని త్రిమూర్త్యాత్మక రూపుడైన శ్రీసాయికి ఆ భక్తి ప్రేమ మరియు విశ్వాసములనే వత్తులనర్పించి ఆ వత్తుల వెలుగు (జ్వాల) నిరంతరమును వెలుగుతూ ఉండవలెనని త్రిమూర్త్యాత్మక రూపుడైన సాయియే ఒక ప్రమిద రూపములో ప్రతిజీవి హృదయములో ఉన్నాడని ఆ ప్రమిదలో వెలిగించిన ఈ మూడు వత్తుల జ్వాల వలన క్రొత్త వెలుగు కనిపించి ఆ క్రొత్తవెలుగులో సన్మార్గము అగుపించి అట్టి సన్మార్గములో జీవి నడవాలని ఆ వెలుగు ఆరిపోక నిరంతరము వెలుగుతూనే ఉండాలని తద్వారా జీవియొక్క భక్తి,ప్రేమ మరియు విశ్వాసము ఇంకా గట్టిపడాలని సాయిని కోరవలెను.

నాకు తెలిసిన సాయి ఎవరో కాదు. ఏ భక్తుడైతే ఏ ప్రశ్నకైనను తాను నమ్ముకున్న సాయి సమాధానము ఇచ్చుననే ధైర్యముతో ఉండి తన మనస్సులో సాయి ప్రమిదను భక్తి, ప్రేమ మరియు విశ్వాసములనే 3 వత్తులతో వెలిగించి ఆ వెలుగు నిరంతరము వెలుగుచూనే ఉండాలని తద్వారా సన్మార్గము కనబడాలని అనుకొనెదరో అట్టి భక్తుని వద్దకు సాయి నిరాకారుడై నిశ్శబ్దముతో పరుగెత్తుకుని వచ్చి పీలికలు దొంగిలించుటకు పోని ఆ భక్తునికి జల్తారు శెల్లా సాయి ఇచ్చి మరియు అతని మనస్సులోని ప్రమిదను ఆరిపోకుండా నిరంతరము వెలిగేటట్లు అఖండజ్యోతిగా మారేటట్లు సాయి చేయును. అట్టి వెలిగే అఖండజ్యోతియే **నాకు తెలిసిన సాయి**

శ్రీసాయి సర్వజీవులయందు కలడని తెలిసికొనుటకు ఒకసారి సాయి తనభక్తురాలైన లక్ష్మీబాయి శిండేతో వారికి ఆకలిగా ఉన్నదని చెప్పి రొట్టెను తెప్పించుకున్న పిదప సాయి ఆ రొట్టెను తినక కుక్కకు విసిరెను. అంత లక్ష్మీబాయి రొట్టెచేయుటలో తనకు కలిగిన శ్రమను తలచి చింతించగా సాయి ఇట్లనెను. "ఎవరైతే ఆకలితో ఉన్నవారికి భోజనము పెట్టెదరో వారు నాకు అన్నము పెట్టినట్లే. కావున కుక్క ఆకలి తీర్చుట నా ఆకలి తీర్చినటువంటిది." అని సాయి తన తత్వమును ప్రదర్శించెను. **నాకు తెలిసిన సాయి** ఏ భక్తుడైతే సాయి సర్వజీవులయందు కలడని నమ్మి ఎవరికి ఆకలిగా ఉన్నదో వారికి భోజనము పెట్టెదడో అట్టి భక్తుని కడకు సాయి నిశ్శబ్దముగా నిరాకారుడై భక్తుని ప్రక్కన నిలబడి ఆకలిగొన్న జీవి అన్నము తిన్న పిదప సాయి అన్నము పెట్టిన భక్తుని ప్రక్కనే నిలబడి వారు ఆ అన్నమును తినకున్నను భక్తునికి వినపడకుండా త్రేన్పు త్రేన్చి ఆనందించే ఆ సాయియే **నాకు తెలిసిన సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 43,44

సాయిబాబా 1918 వ సంవత్సరము అక్టోబరు 15 వ తేదీన మంగళవారము నాడు 2 గంటల 30 నిమిషాలకు తమ భౌతిక శరీరమును విడచిరి. ఆరోజు విజయదశమి కూడా అయినది. సాయి అశ్వరమైన శరీరము విడిచినప్పటికీ అందు సాయి మాత్రము అప్పటికీ,యిప్పటికీ,మరెప్పటికీ కూడా అనంతశక్తి వలె నిలిచి ఆ శాశ్వతమైన అనంతశక్తితో ఎందరో భక్తులకు నిశ్శబ్దముగా సహాయపడుతున్నారు. ఇది ఋజువు చేయుటకే సాయి తమశరీరమును మంగళవారము నాడు విడిచినను మరుసటిరోజు అనగా బుధవారము నాడు సాయి లక్ష్మణ్ మామ జోషి అనునతని స్వప్నంలో ఇట్లనిరి. "త్వరగాలెమ్ము.

బాపూ సాహెబ్ నేను మరణించితినని అనుకొనుచున్నాడు. అందుచేత అతను రాడు. నీవు పూజచేసి కాకడహారతినిమ్ము." సాయి చెప్పిన తత్వములో సాయికి మరణము లేదని, వారు కేవలము భౌతికశరీరము విడిచిరని కాని అందులోనున్న శాశ్వతమైన అనంతశక్తి ఉన్నదని కావుననే సాయి జోషికి స్వప్నమునందు కనిపించి హెచ్చరించెను.

సాయికి మరణము లేదని ఋజువు చేయుటకు మరియొక అద్భుతసంఘటన సాయి తమ సమాధి చెందక ముందు అనగా సుమారు 32 సంవత్సరములకు పూర్వము 1886 వ సంవత్సరమున ఆయన ఉబ్బసవ్యాధితో బాధపడుచు తమ ప్రాణములను పైకి తీసుకునిపోయి మూడు దినముల తరువాత తిరిగి తమప్రాణములను తమ శరీరములోనికి తెప్పించుకుని అందరినీ ఆశ్చర్యపరచినారు. దీనిని బట్టి శరీరము అశాశ్వతమని దానిలోనున్న ఆత్మ మటుకు సత్యము,నిత్యము మరియు శాశ్వతమన ఋజువు చేయుటకే సాయి ఈ అద్భుతసంఘటన చూపినారు. కావుననే సాయి తమ శరీరమును విడిచి మరునాడు అనగా 1918 అక్టోబరు 16 న జోషికి స్వప్నదర్శనమిచ్చి బాపూ సాహెబ్ నేను మరణించితిని అని అనుకొనుచున్నాడని హెచ్చరిక చేసినారు.

నాకు తెలిసిన సాయి మరెవరో కాదు. ఏ భక్తుడైతే సాయి మూడు మూరల శరీరము కాదని లోనున్న ఆత్మయని ఆ ఆత్మయే సాయి అని వారే సత్యము,నిత్యము మరియు శాశ్వతమని ఆ శుద్ధ సత్తాయే బ్రహ్మమని ఆ బ్రహ్మమే సాయిని విశ్వసించి ఆ భక్తుడు తన ఎరుకలో ఎక్కువభాగము సాయి అనంత తత్వమును గుర్తుంచుకుని ఆ శాశ్వతమైన సాయియే నిజమని నమ్మిన భక్తుని వద్దకు సాయి నిశ్శబ్దముగా వారికి ప్రతీక్షణము సహాయము చేయువాడు ఆ సాయియే **నాకు తెలిసిన సాయి.**

సాయి ఒకసారి ఇట్లనినారు. "నన్ను వెతుకుటకు నీవు దూరముగా పోనవసరంలేదు. నీ నామము నీ ఆకారము విడిచినచో నీలోనే కాక అన్ని జీవులలోను ఉన్న చైతన్యమే నేను." పైన చెప్పిన సంఘటనలను సాయి చెప్పిన ఈ అమృతతుల్యములగు పలుకులను పోల్చిచూస్తే సాయి అంటే ఎవరో తెలియుచున్నది. సకలజీవులలో ఉన్న చైతన్యము సాయికాక మరెవరు ? కావున **నాకు తెలిసిన సాయి** సకలజీవులలో ఉన్న చైతన్యమే. అటువంటి చైతన్యమనే ఎరుక కలిగి ఆ చైతన్యమే సాయి అని విశ్వసించిన భక్తునికి మరియు ఆ భక్తుడు ఎవరిని నిందించక తాను బాధ అనుభవించినను ఓర్చుకొనుచు చివరికి తనను నిందించిన వాని చైతన్యము కూడా సాయేకదా అని ఉద్దేశ్యము కలిగిన భక్తుని మనస్సును మెచ్చుకుని నిశ్శబ్దముతో సాయి అటువంటి భక్తునికి సహాయము చేయుటయే కాక ఆ భక్తునికి సాయి ఋణగ్రస్తుడై ఆతని ఋణమును తీర్చుటకై సాయి ఆతనికి మోక్షమిచ్చును. అటువంటి త్యాగ గుణశీలుడే **నాకు తెలిసిన సాయి.** సాయి ఒక సందర్భములో ఇట్లనినారు. "ఎవరైతే ఇతరులను నిందించెదరో వారు నన్ను హింసించిన వారగుదురు. ఎవరైతే బాధలనుభవించెదరో మరియు ఓర్చుకుందురో వారు నాకు ప్రీతి గూర్చెదరు." కావున సాయి సర్వములోను ఐక్యమైయున్నారు. ప్రేమిచుటయే వారితత్వము. అలాగే ప్రతిజీవి కూడా ఇతరులను ప్రేమించవలెనన్నదే వారి తత్వము. ప్రేమకు మారుపేరే సాయి. ఎవరెక్కువగా ఇతరులను ప్రేమిస్తూ సాయిని ప్రేమించెదరో ఆ ప్రేమ సాయి వారిచుట్టూ ఉంటారు.

అటువంటి భక్తులకు సాయి లోపల వెలుపల అంతయు వ్యాపించి ఆ అనంతశక్తితో ఆ భక్తుని కాపాడుచుండును. **నాకు తెలిసిన సాయి** అంటేప్రేమే.

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 45,46

జీవుడు భవసాగరమును దాటుటకు ఎంతో కష్టపడును. అయితే సాయి భక్తులకు ఒక రహస్యము చెప్పెను. ఆ రహస్యమును పాటించిన, ఇక జీవుడు దాటలేని భవసాగరము లేదు. ఆ రహస్యమేమనగా గురువే అసలైన తండ్రి అని, గురువుయొక్క పలుకులను మరువకూడదని, గురువును ప్రేమించి వారిని సర్వస్యశరణాగతి వేడి భక్తితో వారి పాదములకు మ్రొక్కవలెనని సాయి చెప్పెను. ఈ రహస్యమును నిదర్శనముగా చూపుటకు ఆనందరావ్ పాఖడే అను భక్తుని స్వప్నములో సాయి కనిపించి ఆ స్వప్నము వల్ల కాకాసాహబ్ దీక్షిత్ కు గుణపాఠము చెప్పెను. ఒకసారి కాకాసాహెబ్ నవనాధుల భక్తిగురించి ఇతరులతో చర్చిస్తూ అటువంటి భక్తిని ఏనాడైనా పొందగలమా అనే దీక్షిత్ సంశయించి నిరాశ చెందెను. అంత సాయికి ముఖ్యభక్తుడైన శ్యామా, మరియొక భక్తుడైన దీక్షిత్ తో ఇట్లనెను. ఎవరైతే వారి అదృష్టము వలన సాయి వంటి ఆభరణము పొందిరో అట్టివారు నిరాశ చెందరాదని, ఏడ్చుట, విచారకరమని సాయియందు నిశ్చలమైన విశ్వాసమే ముఖ్యమని హెచ్చరించెను. అయినా దీక్షిత్ తృప్తిచెందలేదు. అదేరోజు రాత్రి సాయి ఆనందరావ్ పాఖడే అను భక్తుని స్వప్నములో లోతైన సముద్రములో పాఖడే నడుము వరకు దిగి యుండగా అక్కడ రత్నములతో కూడిన సింహాసనముపై సాయి కూర్చునియుండెను. కాని సాయి పాదములు మటుకు ఆ నీటిలోఉండెను. అవి కనిపించకుండా ఉండెను. శ్యామా కూడా అక్కడే ఉన్నట్లు పాఖడే స్వప్నమునందు కాంచెను. అంతశ్యామా ఆ పాఖడేని సాయి పాదములపై పడమని సలహా ఇవ్వగా పాఖడే సాయితో “ఓ దేవా ! నీటిలోనున్న నీ పాదములను బైటికి తీయుము.” అని వేడగా సాయి తన పాదములను నీటినుండి బైటకు తీసిరి. క్షణమైనా ఆలస్యము చేయక పాఖడే సాయి

పాదములపై పడి మ్రొక్కిరి. వెంటనే సాయి "ఇకపొమ్ము. నీవు క్షేమమును పొందెదవు. భయముగాని, ఆందోళనగాని అవసరము లేదు." అని సాయి స్వప్నమునందే పాఖడేను ఆశీర్వదించెను. ఈ స్వప్నవృత్తాంతమును శ్యామా మరియు పాఖడే కాకాసాహెబ్ దీక్షిత్ కు చెప్పి భక్తితో సాధించవలెనని అందుకు గురుపాదములను భక్తితో ధ్యానించిన చాలనే గుణపాఠమును దీక్షిత్ ఆ స్వప్నవృత్తాంతము వలన తెలుసుకొనెను.

పాఖడే తన స్వప్నములో సముద్రము మధ్యలో నడుము వరకు దిగియున్న (అపాయస్థితిలోనున్న) సమయమున సాయి రత్నములు తాపిన సింహాసనముపై కూర్చొనిఉండ తమ పాదములు మటుకు నీటిలో కనపడకుండా ఉంచెను.   పాఖడే సాయి స్వరూపమును చూచి ఆనందించినప్పటికీ తన దృష్టిని మటుకు ఆ ఆనందముతో సరిపెట్టకొనక మరియు పాఖడే యొక్క దృష్టి రత్నములతో తాపిన సింహాసనముపై పడక వాటిని చూచినను మనస్సును అదుపులో ఉంచుకుని కనిపించే అందాన్ని మరియు ఆడంబరాలకు లోనుగాక కనిపించని గురు(సాయి) పాదములకై వెతికి ఆ పాదములను కోరెను. కావుననే సాయి గొప్ప ఆశీర్వచనమునిచ్చెను. నాకు తెలిసిన సాయి మరెవరో కాదు. ఎవరైతే సాయివంటి మహాత్ములను సద్గురువుగా స్వీకరించి అట్టి సద్గురువుల కృపకు అర్హత పొందిన పిదప ఇక తనజీవితములో దేనికొరకు ప్రాకులాడక నిరాశ చెందక సాయియందే నిశ్చలమైన విశ్వాసముకలిగి భయమునకు గాని, ఆందోళనకు గాని అవకాశమివ్వక తనదృష్టిని ఇతర ఆనందములకు మరియు ఆడంబరములకు పోనివ్వక గురుపాదములనే స్మరిస్తూ సర్వస్యశరణాగతి వేడినటువంటి పాదరేణువుల వద్దకు సాయి నిశ్శబ్దముగా నిరాకారుడై ఎన్నో కష్టములనే సముద్రములో చిక్కుకునియున్న భక్తుని వద్దకు వచ్చి సాయి

కనిపించకుండా సహాయము చేసి ఆశీర్వదించేవాడే **నాకు తెలిసిన సాయి.** సాయిపై విశ్వాసముంచి మౌనముగా ఉన్న భక్తునికి ఆ మౌనములో నిశ్శబ్దమును ఎరిగి అటువంటి నిశ్శబ్దములో ఒక రకమైన ఆనందమును పొందును. సాయి నిశ్శబ్దముగా వచ్చి అని ప్రతి అధ్యాయములో చెప్పబడినది. మరియు నిరాకారుడై వచ్చెదడనికూడా చెప్పబడినది. భక్తునికి మౌనము వలన నిశ్శబ్దమెఱిగి ఆ నిశ్శబ్దము వల్ల ఆనందమును పొందుచున్నాడు అని కదా అన్నాము. ఆ ఆనందమునకు కారణం ఆ నిశ్శబ్దములో నిరాకారసాయి నిశ్శబ్దముగానే వచ్చియుండుటచే ఆ భక్తునికి తెలియని ఆనందమును పొందుచున్నాడు.

సాయిని నమ్ముకున్న భక్తునికి సాయి ఆ భక్తుని కంటె ముందు గా ఆ భక్తుడు వెళ్లినచోట ఉండును. ఇది అక్షరసత్యం. ఉదాహరణకు ఏ సాయి భక్తుడైనా ఒకస్థలమును గాని లేదా ఊరును కానీ విడిచి వేరొక చోటకు వెళ్లనప్పుడు అక్కడ సాయి చిత్రరూపములో కనిపించును. ఇది ఎందరకో జరిగిన అద్భుతానుభవం. ఇది నిజమనే ఋజువుచేయుటకు సాయి వారు సజీవముగా ఉన్నపుడు తన భక్తుడైన శ్యామాను సాయికి ప్రతినిధిగా ఉపనయనమునకు మరియు వివాహమునకు వేరొక భక్తుల ఇళ్లకు పంపినపుడు సాయి ఇట్లనినారు. “ కాశీ,ప్రయాగ యాత్రలు ముగియు సరికి నేను శ్యామాకంటే ముందుగనే గయలో కలిసికొనెదను. ” నిజంగానే సాయి ఒక అందమైన పెద్ద చిత్రరూపమున గయలో శ్యామాకు కనిపించెను. **నాకు తెలిసిన సాయి** ఇంకెవరు?

ఏ భక్తుడైతే పూర్తి విశ్వాసముతో సాయిని నమ్మియున్నాడో ఆ భక్తుని కంటే సాయి ముందుగా ఆ భక్తుడు వెళ్లేచోట ఉండి సాయి యజమాని అయినప్పటికి భక్తునియొక్క భక్తికి బానిసై ఆ భక్తునిరాక కొరకు వేచియుండే ఆ కరుణామూర్తియే **నాకు తెలిసిన సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 47,48

"నేనే దాని తండ్రిని. నేనిచ్చటనేయున్నాను. పాము చేత కప్పను ఎట్లు తినిపించెదను ? నేనిక్కడ ఊరకనే ఉన్నానా ?" అని సాయి ఒక ప్రయాణీకునితో అన్న మాటలివి. నిజానికి ఇది పూర్వజన్మకు సంబంధించినది. వీరభద్రప్ప మరియు చెన్నబసప్ప అను ఇద్దరి మధ్య గొడవలకారణముగా వీరభద్రప్ప చెన్నబసప్పను చంపెదననగా చెన్నబసప్ప పిరికివాడగుటచే సాయి పాదములను ఆశ్రయించగా సాయి అతనిని శత్రువుబారినుండి కాపాడెదనని వాగ్దానము చేసెను. తరువాత వారిరువురు చనిపోగా మరుజన్మలో కప్ప మరియు పాములుగా జన్మించి శత్రుత్వము చేత వీరభద్రప్ప పాముగను చెన్నబసవప్ప కప్పగను జన్మించిరి. పాము తనశత్రువైన కప్పను చూచి నోటితో పట్టకొనగా కరుణామూర్తియైన సాయి పూర్వజన్మలో ఇచ్చిన వాగ్దానము నెరవేర్చుటకై పాముని మందలింపగా కప్పను వదలి ఆ పాము వెళ్లిపోయింది. ఈ సంఘటనలో సాయి పూర్వజన్మము నందు వాగ్దానమిచ్చుటచే రక్షించినాడని అనుకోవలదు. నిజానికి ఎవరు చేసిన కర్మను వారే అనుభవించవలెను. శత్రుత్వమున్న ఎడల విముక్తిని పొందవలెను. అలాగే బాకీ ఉన్నను తీర్చవలెను. కానీ సద్గురువులు తలచిన అటువంటి కర్మలను కూడా తప్పించగలరని సాయి ఋజువుచేసెను. సాయి ప్రయాణీకునితో అన్నమాటలలో "నేనే దాని తండ్రిని. నేనిచ్చటనే యున్నాను ఊరకనేయున్నానా? "అనే పల్కులలో

తండ్రి అనగానే రక్షించువాడని అర్థం. సాయిని నమ్మిన భక్తులు ఎల్లప్పుడు వారితోనే అక్కడే ఉన్నారని అనుకొనవలెను. అట్లు విశ్వసించిన భక్తులకు సాయి ఊరకనే ఉండక వారి గతజన్మలో చేసిన కర్మలనుకూడా తారుమారు చేయగలరు కావున సాయి ఒక్క ఆ కప్పకే (చెన్నబసప్ప) తండ్రికాదు. యావత్ ప్రపంచములోని చరాచరజీవులందరికీ తండ్రి అనే యథార్థము తెలిసికొనవలెను. **నాకు తెలిసిన సాయి** మరెవరో కాదు. యావత్ ప్రపంచములోని చరాచర జీవులందరికీ తండ్రిగాఉంటూ రక్షిస్తూ తల్లిగా అందరినీ భేదము లేకుండా ప్రేమించే కరుణామూర్తి. అటువంటి దయార్ద్రహృదయుడే **నాకు తెలిసిన సాయి.** ఏ భక్తుడైతే సాయియే రక్షకుడని భావించి నిర్భయముగా ఎటువంటి సంకోచము లేకుండా పూర్తివిశ్వాసముతో సాయిని నమ్మినయెడల ఆ తండ్రి ఎక్కడున్నను అసలు ఎక్కడ లేడని భక్తుని ప్రక్కనే ఉన్నారు. కానీ భక్తునికి తెలియకపోవుటచే ఎక్కడో ఉన్నారని భావించి రక్షణకోరెదరు. కాని ఆ తండ్రి భక్తుని ప్రక్కనేయుండి నిశ్శబ్దముగా ఊరకే ఉండక భక్తుని ఆలనాపాలనలను చూచే ఆ సాయియే **నాకు తెలిసిన సాయి.**

నిజానికి మనందరి పూర్వజన్మ సుకృతము వలన సాయిబాబాను మన సద్గురువుగా స్వీకరించి పూజిస్తున్నాము. కాని అదంతా సాయి అనుగ్రహమే. సాయి అని పలుకటానికి అర్హత కల్పించినది ఆ సాయియే. అలాంటి గొప్ప అవకాశాన్ని సాయినామాన్ని స్మరించే భాగ్యం కల్పించిన ఆ సద్గురుసాయికి మనమెంతో ఋణపడియున్నాము. సాయినామము పలికే భాగ్యముకన్న ఇక ఏమి కోరగలము. సాయిని అడుగుట అనవసరము. సాయినామమే శాశ్వతమైనది. అదే ఆనందం. అటువంటి భాగ్యాన్ని నోచుకున్న తరువాత ఇంకేమి కావాలి. సాయి తమ భక్తులనుండి ఎటువంటి సేవను కాని, ప్రతిఫలము కాని కోరరు. వారే భక్తులకు సేవచేయతలచుదురు. తన భక్తులను కొడుకుల వలె ప్రేమించుదురు.

ఒక్కొక్కసారి ఎంతో విశ్వాసముతో తాను నమ్ముకున్న సద్గురువును కొన్ని సందర్భములలో నిందించే పరిస్థితులు భక్తులకు కూడా ఏర్పడుతాయి. అటువంటి పరిస్థితియే **సపత్నేకర్** అనే భక్తునికి 1913 వ సంవత్సరములో ఎదురైనది. తనకు గల ఒకే ఒక కుమారుడు మరణించెను. సాయి **సపత్నేకర్** శిరిడీకి వచ్చినపుడు అందరిముందు ఇట్లనెను. "వీడు తన కొడుకును నేను చంపితినని నన్ను నిందిచుచున్నాడు. నేను లోకులబిడ్డలను చంపెదనా ?" అని సాయి పలికెను. సాయి తండ్రి అని పైన చెప్పుకున్నాము. తండ్రి అంటేనే రక్షకుడని అర్థం. కావున రక్షించేవాడు శిక్షించునా ? అది జరుగదు. **సపత్నేకర్** తనకు చుట్టుకున్న కష్టముల వలన అట్లుఅనినారు. సాయి వెంటనే హెచ్చరించినారు. ఆ హెచ్చరిక **సపత్నేకర్** కే కాదు. సాయి భక్తులందరికూ కూడా. కావున ఏ భక్తునికైనా భరించరాని కష్టాలెదురైనను, ఆ కష్టాలకు తాను నమ్ముకున్న సద్గురువే కారణమని నిందవేయరాదు. ఆ సమయమున సాయి మనందరి తండ్రి అని, రక్షకుడని జ్ఞప్తికి తెచ్చుకుని రక్షకుడైన ఆ సాయి మనలను ఎలా శిక్షించునని ఒక్కసారి ఆలోచించినఎడల ఆ కష్టములలో సుఖమనుభవించే శక్తిని సాయి తప్పక ప్రసాదిస్తాడు. కావున నింద వదిలి నమ్ముకున్న సాయినే పట్టుకోవాలి. సాయి పాదములు పవిత్రమైనవి. ఆ పాదములను జ్ఞప్తి చేసుకున్న ఎడల ఎటువంటి కష్టములైనను తీరిపోవును. అందుకే సాయి ఇట్లనినారు. "ఈ పాదములు ముదుసలివి. పవిత్రమైనవి. నీ కష్టములు తీరిపోయినవి. నా యందే నమ్మకముంచుము. నీ మనోభీష్టములు నెరవేరును." **నాకు తెలిసిన సాయి** ఇంకెవరు ? ఏ భక్తుడైతే ఎన్ని కష్టములు అనుభవిస్తున్నను పవిత్రమైన సాయిపాదములను నమ్ముకున్నయెడల సాయి నిశ్శబ్దముగా నిరాకారుడై ఆ భక్తుని కష్టములను, భారములను వారు మోసి భక్తుని విముక్తుని చేసే ఆ కరుణామూర్తియే **నాకు తెలిసిన సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 49,50

సృష్టి మరియు సృష్టిలోని చరాచర జీవులు పరమాణువు నుండి అనంతము వరకు సృష్టించినది ఆ పరమాత్మయే. కావున పరమాత్మకు సర్వాధికారము కలదు. వారిని ప్రశ్నించుట తగదు. కావున ఏ జీవికైనా కష్టములు కాని నష్టములు కానీ దుఃఖములు కాని కలిగినప్పుడు ఆ జీవి పరమాత్మపైన నిందవేయరాదు. పరమాత్మ తన ధర్మమును తాను చేయును. కావున ఆ ధర్మమునకు విరుద్ధముగా జీవుడు పరమాత్మను కోరరాదు. జన్మఇచ్చినది ఆ పరమాత్మయే కావున ఆ జన్మపై పరమాత్మకు సర్వాధికారములు కలవు. జన్మించిన ఆ జీవి ఈ ప్రపంచనాటకములో ఆట ఆడవలసినంత సేపు ఆడెదరు. తన పాత్ర ముగిసిన పిదప జన్మఇచ్చిన ఆ పరమాత్మయే ఆ జీవిని తీసుకుని పోవుటకు వచ్చును. అది పరమాత్మ ధర్మము. పూర్వకర్మఫలాను గుణముగా పూర్ణాయుష్షు, అల్పాయుష్షు, కీర్తి, దారిద్ర్యము, కష్టములు, సంపదలు ఇలా లిఖితమై యుంటాయి. పాపపుణ్యముల కర్మల లెక్కల అనుగుణముగా జీవియొక్క ఆయుర్దాయము మరియు కర్మానుగుణముగా జీవితము నడుచును. కావున ఎంత దగ్గరజీవియైనా తన ఆయుర్దాయము తీరిన పిదప వెళ్లిపోయిన చో పరమామత్మను నిందించక పరమాత్మ తన ధర్మము తాను చేసినవాడనే ఎరుక కలిగి జీవియుండవలెను.

మళ్ళీ మళ్ళీ గుర్తుకు తెచ్చుకుందాము. సాయి అశ్వరమైన దేహము వదిలినను, దానిలోనున్న సాయిమాత్రము ఇప్పటికీ అనంతశక్తి వలె నుండి వారు సమాధిచెందకముందు భక్తులకు తోడ్పడినట్లే ఇప్పటికి వారిని ఆశ్రయించిన భక్తులకు నిశ్శబ్దముగా సహాయపడుచునేయున్నారు. వారి శాశ్వతమైన అనంతశక్తి

ఇప్పటికీ నిలిచియున్నది. వారు ఏ భక్తుడైతే భక్తి,ప్రేమ మరియు విశ్వాసములు కలిగి సాయిని మనస్ఫూర్తిగా కొలిచెదరో సాయి నిశ్శబ్దముగా అశరీరులై నిరాకారునిగా ఆ భక్తులను కాపాడుతునే ఉన్నారు. శ్రీసాయి దత్తుని అవతారమని అందరికీ తెలిసినదే. శ్రీపాదవల్లభులు నరసావధానులతో ఒకసారి ఇట్లనినారు. "మీరు శరీరధారులు కనుక మీరు గుర్తించటానికి వీలుగా సశరీరుడనై వచ్చితిని. వాస్తవముగా నేను నిరాకారుడను, నిర్గుణుడను. ఆకారము లేకుండా ఉండుట కూడా ఒకఆకారమే. అలాగే గుణములు లేకుండా ఉండుటకూడా ఒక గుణమే." అలాగే శ్రీసాయికూడా మనమందరము శరీరధారులము కావుననే వారుకూడా మనము గుర్తించటానికి వీలుగా సశరీరుడై శిరిడీ అనే గ్రామమున అవతరించి1918 వ సంవత్సరము వరకు వారి లీలలను ప్రదర్శించినారు. నిజానికి వారి కూడా నిరాకార నిర్గుణుడు. సకార నిరాకార సగుణ నిర్గుణములకు ఆధారముగా ఉండే పరమాత్మ సాయి వాటన్నిటికీ కూడా అతీతులు. కావున మనందరి ఎరుకలో నిలిచిని వారి అనంత తత్త్వమే.

సాయి అనంత తత్త్వములో మరికొన్ని ముఖ్యమైనవి. –

1. మన హృదయము స్వచ్ఛముగా ఉన్నంతవరకు ఏమియు దోషములేదు. మనలో చెడ్డ ఆలోచన లేనప్పుడు ఇతరులకు భయపడరాదు. నేత్రములు వాని పనిని అవి నెరవేర్చుకొనవచ్చును.

ఈ అద్భుత తత్త్వములో గమనింపవలసిన విషయము ఒక్కొక్క సందర్భములో సాధకుడు తన ఆలోచనల విధముగా ఉండని వ్యక్తులతో కలవవలసిన పరిస్థితులు ఏర్పడవచ్చును. అలాగే సాధకుడు మంచి స్థితిలోఉన్నప్పుడు అతని మనసు వికలము చేయుటకు ఒక అందమైన దృశ్యము లేదా భావన కలుగవచ్చును. ఇటువంటి స్థితులలో ఆ సాధకుడు ఉన్నప్పటికీ భయపడక తన హృదయము

స్వచ్ఛముగనే ఉంచుటకు ప్రయత్నించి చెడ్డ ఆలోచనలకు తావివ్వక ఉండవలెననే సాయి హెచ్చరికను గ్రహించవలెను. **నాకు తెలిసిన సాయి**

ఏ భక్తుడైతే తన హృదయము స్వచ్ఛముగా ఉంచుకుని చెడ్డఆలోచనలను రానివ్వకుండా ఉండునో అటువంటి భక్తుని చెంతకు సాయి నిశ్శబ్దముగా సహాయపడును. వారే **నాకు తెలిసిన సాయి.**

2. చంచలమైన మనస్సును ఉద్రేకించక శరీరము స్వాధీనమునందుంచుకుని ఇంద్రియముల విషయములపై పరుగెత్తక చెంచలత్వము జయించుటకు సాధన చేయవలెనని సమయానుకూలముగా ఇంద్రియములను అణిచి ఉంచవలెను. దురాలోచనలకు లోనుకాక ఎట్టి కోరిక లేక భగవంతుడు సృష్టించిన సుందరమైన సృష్టిని చూడుము. ఇంద్రియములను ఈ విధముగా స్వాధీనమొనరించుకొనవచ్చును. విషయములను అనుభవించుటలో కూడా భగవంతుని జ్ఞప్తియందుంచుకొనవలెను.

దీనిని బట్టి అన్నింటికి మూలము మనస్సు అని, అది చంచలమని దానిని ఉద్రేకించినచో ఇంద్రియములు చలించునని, అట్లు పోనివ్వకుండా ఉండాలంటే శరీరమును స్వాధీనమందుంచుకుని ఇంద్రియములవెంట పరుగెత్తరాదను, విషయములను కోరరాదని అట్లు ఉండుటకు సాధన ముఖ్యమని తద్వారా చంచలతత్వము జయించవచ్చని సమయానుకూలముగా వాటిని అణచవలెను. అని నానాసాహెబ్ చందోత్కర్ అను బాబా భక్తుడు శ్యామా అను భక్తునికి సాయి చెప్పిన భావమును పైవిధముగా బోధించెను. ఎవరైతే చంచలమైన మనస్సును ఉద్రేకించక ఇంద్రియమున వెంట పరుగిడక సాధనతో చంచలత్వమును జయించవలెననే జిజ్ఞాస ఉన్న భక్తులకు సాయి ఎట్టి దురాలోచనలు మనస్సునందు రానివ్వక నిశ్శబ్దముగా నిరాకారుడై అట్టి భక్తుని ఇంద్రియములను సులభముగా ఆ భక్తునికి స్వాధీనము చేసుకునేవిధముగా అట్టి విషయములను అనుభవించుటలో కూడా సాయినే జ్ఞప్తియందుంచుకొనునట్లు సహకరించే ఆ నిరాకార నిర్గుణులే **నాకు తెలిసిన సాయి.**

3. సాయి ఇట్లనినారు. ఒకవేళ వాడు తనవాడు కానిచో వాడు తనచే ఆకర్షింపబడడనయు, వాడు తన దర్శనమే చేయలేడు.

కొంతమంది సాయిని పూజించము అని, శిరిడీకి వెళ్లమని వాదోపవాదాలు చేసే వారికి సాయిహెచ్చరిక అటువంటి వారికి వర్తిస్తుంది. అటువంటివారు సాయిచే ఆకర్షింపబడలేరు. కాబట్టే సాయి దర్శనము ఇక జరుగదని గ్రహించవలెను. ఏ భక్తుడైతే నిత్యం సాయి ఆకర్షణకై తపన పడుతూ జీవితము గడిపెదరో అట్టి వానికి ఏదో ఒకరోజు కరుణామూర్తి అయిన సాయి నిశ్శబ్దముగా నిరాకారుడై అటువంటి భక్తుని పిచ్చుక కాలికి దారము కట్టి ఈడ్చినట్లు తన దర్శనమునకు రప్పించునట్లు సహకరించే ఆ దివ్యమూర్తియే **నాకు తెలిసిన సాయి.**

4. అంత్యకాలమున నిన్ను విమానములో తీసుకుపోయెదను అని సాయి కాకాసాహెబ్ తో అనెను. సాయి తన భక్తుడైన కాకాను 1926 వ సంవత్సరములో ఎటువంటి బాధలేకుండా సాయి విషయాలు మాటలాడుచూ ఒక్కసారిగా కాకా రైలు ప్రయాణములో మరియొక భక్తుడైన హేమాడ్ పంత్ భుజముపై వ్రాలి ప్రాణములు వదిలెను. **నాకు తెలిసిన సాయి** మరెవరో కాదు. ఏ భక్తుడైతే తన జీవితములో విమానము ఎక్కవలెనని కోరికయే లేక నిత్యము సాయియందు మనస్సును లీనము చేసి సాయి విషయములే మాట్లాడే వానికి సాయి నిశ్శబ్దముగా నిరాకారుడై తాను సృష్టించిన జీవిని తామే స్వయముగా ఆ భక్తుని అంత్యకాలమునందు విమానములో తీసుకునిపోవుటకు కనబడకుండా వచ్చి సహాయపడే ఆ సాయియే **నాకు తెలిసిన సాయి.**

5. టెంబే స్వామి ఒకసారి ఒక టెంకాయను సాయికి ఇమ్మని పుండరీకరావు అను అతనికి ఆజ్ఞాపించపగా అతడు తన ప్రయాణమార్గమధ్యమున అటుకులు తిని తెలియక వేరొకటెంకాయ అనుకుని టెంబే స్వామి యిచ్చిన ఆ

టెంకాయను పగులకొట్టి నీళ్లు త్రాగెను. శిరిడీకి వచ్చిన పిదప సాయి ఆ భక్తునితో ఇట్లనెను. ఆ విషయమై నీవేమాత్రము చింతింపనవసరములేదు. అది నా సంకల్పము ప్రకారము నీకివ్వబడెను. తుదకు దారిలో పగులకొట్టబడెను. దానికి నీవే కర్తవని అనుకొనెదవేల ? మంచిగాని, చెడుగాని చేయుటకు నీవు కర్తవని అనుకొనరాదు.

టెంకాయ పగులకొట్టుట అనే విషయము చిన్నదైనప్పటికీ సాయి తత్వమనంతమైనది. సాయి సంకల్పము ప్రకారమే టెంబేస్వామి ఆ టెంకాయను సాయికై పంపెను. అదే టెంకాయను దారిలో సాయిసంకల్పముచేతనే పగులకొట్టబడినదని గ్రహించవలెను. దీనినిబట్టి ఏ పనికైనా ఎవరు కర్త అని ప్రశ్నించుకొనవలెను. మంచిచెడులను నిర్ణయించుటకు కర్త పరమాత్మఅయిన సాయియే కాని మనమెవరమూ కాము. ఈ ఒక్కమాట జ్ఞప్తియందుంచుకున్న జీవికి ఏ విషయము జరిగినను ఇక చింతఅనేదే ఉండదు. సాయి చెప్పిన ఈ తత్వము ప్రతివానికీ ధైర్యమునిచ్చేది. ఈ బోధన ఎన్నటికి మరువవద్దు. ప్రతిరోజు ఒక్కసారియైన జ్ఞప్తియందుంచుకున్న యెడల ఏ జీవికైనా ఎటువంటి చింతలు ఉండవు. **నాకు తెలిసిన సాయి** ఏ భక్తుడైతే ఎటువంటి విషయములు జరిగినను చింతింపక అది సాయి సంకల్పము ప్రకారమే జరిగినదని కర్త తానుకాదని సాయి మాత్రమేనని ఎరుకతో ఉన్నయెడల సాయి నిశ్శబ్దముతో నిరాకారుడై ఆ భక్తుని శబ్దములేకుండా అతని ధైర్యమునకు మెచ్చి ఆ భక్తుని వీపును తట్టి ముందుకు నడిపే ఆ మార్గదర్శియే **నాకు తెలిసిన సాయి.**

శ్రీ సాయినాథార్పణమస్తు

అధ్యాయములు – 51

ఇంతవరకు చదివిన అధ్యాయములన్నియు సాయి తత్వాన్ని బోధిస్తున్నాయి. అనగా సాయిస్వభావమును లేక వేదాంత తత్వము బోధించేవని అర్థము. తత్వమంటేనే స్వభావము లేదా తత్వజ్ఞానము అనే అర్థాలు వస్తాయి. సాయిని 1918 వ సంవత్సరమున కోల్పోయామని ఎవ్వరూ అనుకోవద్దు. మనమందరము సశరీరులై భూమిపై కి వచ్చినాము. కావున మనకు కనిపించుటకు ఆ సాయికూడా సశరీరులై వచ్చారు. కాని నిజానికి వారు నిర్గుణనిరాకార స్వరూపులు. సాయి సశరీరులుగా ఉన్నపుడు వారి స్వభావము మాత్రమే జ్ఞప్తియందుంచుకుని ఆకారముతో పనిలేకుండా వారి స్వభావము లేదా తత్వాన్ని అనునిత్యము ఎరుకలో ఉంచిన ఎడల సాయి అశ్వరమైన దేహం లేకున్నను ఆ దేహములో ఉన్న సాయి మాత్రము ఈనాటికి అనంతశక్తివలె ఉన్నది. అటువంటి సాయి తత్వాన్ని లేదా స్వభావాన్ని ఆశ్రయించిన అసంఖ్యాక భక్తులకు సాయి నిశ్శబ్దముగా సహాయపడుచున్నారు. ఎక్కువభాగము భక్తుని ఎరుకలో నిలిచినది సాయి అనంతతత్వమే.

అటువంటి సాయి స్వభావమును లేదా తత్వమును జ్ఞప్తియందుంచుకున్న వారి సంసారము సాయి ఎటువంటి ఆటంకములు లేకుండా ఆ భక్తుని సంసారమనే మహాసముద్రమును భయము లేకుండానే దాటించగలరు. ప్రతిసాయి భక్తునికి సాయిపై భక్తి,ప్రేమ మరియు విశ్వాసము కలిగియున్నచో తద్వారా ఆ భక్తునికి ధైర్యము వచ్చును. భయాన్ని పారద్రోలును.

అటువంటి ఫలము కలుగవలెనన్న సాయి స్వభావము లేక తత్వమును బాగుగా జ్ఞప్తియందుంచుకొని అనునిత్యము వాటిని అమలు పరచుటకు ప్రయత్నించినచో సాయి తప్పక తనను నమ్ముకున్న భక్తునికి ధైర్యాన్ని ఒసగి భయాన్ని పారద్రోలి సాయి స్వభావమును లేదా తత్వమును జీర్ణించుకొన్న భక్తునికిచ్చే ఫలం ఇంతకన్న ఇంకేమి కావాలి !!!!

ఈ పైన చెప్పబడిన సాయియే నాకు తెలిసిన శ్రీ సాయి.

శ్రీ సాయినాథార్పణమస్తు

సర్వేజనాః సుఖినో భవన్తు



కోటంరాజు శ్రీనివాసరావు
17-1/17
పీర్జాదిగూడ, ఘట్ కేసర్ మండలం
రంగారెడ్డి జిల్లా
హైదరాబాదు – 500 039
సెల్ 93468 23570.